thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 364 కరీంనగర్ మంగళవారం, 11 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికి దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.



# తెరపైకి ఎన్డీయే కూటమి!

## తెలంగాణలో కొత్త పొత్తులు - అనూహ్య మలుపు..!?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత బీజేపీలో జోష్ పెరిగింది. బీఆర్ఎస్ అప్రమత్తం అయింది.

కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం మొద లైంది. దీంతో, తెలంగాణలో పట్టు పెంచుకోవటం పైన పార్టీలు కొత్త వ్యూహాలు సిద్దం చేస్తున్నాయి. ఇదే సమయంలో రాజకీయంగా కొత్త కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ఈ కూటమి బలం పరీక్షించుకుంటూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం అయ్యేలా ఢిల్లీ కేంద్రంగా ఆపరేషన్ మొదలైంది.

**మారుతున్న లెక్కలు...** తెలంగాణలో ఎమ్మెల్సీ ఫలితాలు కొత్త లెక్కలకు కారణమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కోల్పోయింది.

బీజేపీ రెండు సీట్లు గెలవటం తో ఉత్తర తెలంగాణలో తమ పట్టుకొనసాగించేలా వ్యూహాలు సిద్దం చేస్తోంది. తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలవటం పైన ప్రధాని మోదీ సైతం స్పందించారు. గెలిచిన వారిని ప్రధాని మోదీ అభినందించారు. తాజా ఫలితాల పైన సీఎం రేవంత్ మంత్రులతో సమీక్ష చేసారు.

సమన్వయం లేని కారణంగానే ఓడిపోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ పూర్తి సమన్వయంతో బలం పెంచుకునేలా క్షేత్ర స్థాయిలో పని చేయాలని నిర్ణయించారు.

**కొత్త పొత్తులు...** ఇటు ప్రతిపక్ష నేత కేసీఆర్ తిరిగి ప్రజల్లోకి రావాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు అవుతారని చెబుతున్నారు. భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు. బీఆర్ఎస్ – బీజేపీ మధ్య అవగాహన ఉందనే ప్రచారం సాగుతోంది. దీనిని తిప్పి కొడుతూ.. పూర్వ వైభవం కోసం కేసీఆర్ కొత్త ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. ఎన్డీఏను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాల పైన ప్రత్యేక వ్యూహాలకు కసరత్తు చేస్తున్నారు. ఏపీలో సక్సెస్ అయిన కూటమి పొత్తులు ఇప్పుడు తెలంగాణకూ విస్తరించే ఆలోచనలో బీజేపీ నాయకత్వం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అమరావతి పర్యటనకు వచ్చిన సమయం లోనే ఈ ప్రతిపాదన పైన చంద్రబాబు వద్ద చర్చ జరిగినట్లు సమాచారం.

**ఢిల్లీ కేంద్రంగా...** తెలంగాణలోనూ 2024 లోక్ సభ ఎన్నికల సమయంలోనూ టీడీపీ, జనసేనతో కలిసి ఎన్డీఏ కూటమి గా పోటీ చేయాలనే ఆలోచన జరిగింది. అప్పుడు బీజేపీ రాష్ట్ర నేతలు అంగీకరించలేదు. ఆ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది పార్లమెంట్ స్థానాలు దక్కిచుకుంది. క్రమంగా రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న సీట్లతో బీఆర్ఎస్ కు నష్టం తప్పదనే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ దశలో ఏపీలో తరహాలోనే తెలంగాణలోనూ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా పోటీ చేసే అంశం తెర మీద కు వచ్చింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లోనూ కూటమి గా పోటీ చేసే ఆలోచన పైన కసరత్తు జరుగుతోంది. ఈ కూటమి ఏర్పాటు అధికారికం అయితే, రాష్ట్రం లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతాయనే అంచనాలు ఉన్నాయి. దీంతో, ఇప్పుడు ఢిల్లీ కేంద్రంగా చోటు చేసుకుంటున్న పరిణామాల పైన ఆసక్తి నెలకొంది.

## పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయని.. అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు సీఎం చెప్పారు. 39 సార్లు కాకుంటే 99 సార్లు దిల్లీ పోతాం.. తప్పేంటని సీఎం ప్రశ్నించారు. సందర్భం వస్తే నిధుల విషయంలో దిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎల్పీలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మెట్రో తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే నిధులు అడుగుతున్నాం. ఎన్‌హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల రాజేందర్ కాదా? భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని అన్నప్పుడు మాతో కదా చర్చించాలి. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కిషన్ రెడ్డి ఎందుకు రాలేదు. కేసీఆర్ బాధపడుతారని కిషన్‌రెడ్డి రాలేదా? పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమీక్ష పెడితే ఎందుకు రాలేదు? ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాజెక్టులు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. హైదరాబాద్ అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలని మేం భావిస్తున్నాం. రాష్ట్రానికి నిధులు రాకూడదని భారాస చూస్తోంది. రాష్ట్రాభివృద్ధి, కేంద్ర నిధులపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధం కావాలి. చర్చకు నేను, భట్టి విక్రమార్క రావడానికి సిద్ధంగా ఉన్నాం. అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తాం. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించేందుకు సీఎం స్థాయి సరిపోదా?పీసీసీ అధ్యక్షుడిగా కేసీఆర్‌ను గద్దెదింపి అధికారంలోకి వచ్చాం. భారాస హయాంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు. మందకృష్ణ మాదిగ అంటే నాకు గౌరవం ఉంది. పోటీ పరీక్షల ఫలితాలకు.. రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదు. మందకృష్ణ భాజపా నేతలా మాట్లాడితే ఎలా? గతంలో ఎప్పుడో వచ్చిన నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గకరణ అంశం వర్తించదు. ఏదైనా చేయాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కేటీఆర్, కిషన్‌రెడ్డి కలిసి తిరుగుతున్నారని నేను చెబుతున్నా" అని సీఎం పేర్కొన్నారు.

**'కేసీఆర్ చెల్లని రూపాయి.. కేటీఆర్ పిచ్చోడు'.. :** మాజీ సీఎం కేసీఆర్ చెల్లని రూపాయిలాంటోడని.. బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ ఓ పిచ్చొడని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గురించి మాట్లాడటం టైం వేస్ట్ అంటూ సీఎం వ్యాఖ్యానించారు. తండ్రికొడుకులు ఇద్దరికి బలుపు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు.

**ఇలాంటి వారిని ఎక్కడా చూడలేదు..** స్పైడర్ సినిమాలో సూర్య అనే విలన్ లా కేసీఆర్, కేటీఆర్, హరీష్ ల తీరు ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ సినిమాలో సూర్యాలాగానే తెలంగాణలో ఎవరైనా చనిపోతే తీన్ మార్ వేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇలాంటి వారిని నేను ఎక్కడా చూడలేదు. మేడిగడ్డ లేకుండానే దేశంలో ఎక్కువ వరి పండించాం. చేసిన తప్పులు, అప్పులను ఎన్ని రోజులు కప్పి పుచ్చుతారు. జగన్ ను ప్రగతిభవన్ కు పిలిచి రాయలసీమ లిఫ్ట్ కి అనుమతి ఇచ్చింది కేసీఆర్ కాదా..?. కేసీఆర్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఏపీతో తలనొప్పి వచ్చేది కాదు. కాళేశ్వరంకు లక్ష కోట్లు పెట్టాడు. కట్టుడు కూల్చుడు అయ్యింది. కేసీఆర్ కుటుంబానికి అంత బరితెగింపు ఎందుకో..?' అని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 'రిజల్ట్ కు.. రిజర్వేషన్ కు సంబంధం లేదు. మందకృష్ణ అంటే నాకు గౌరవం ఉంది. కానీ బీజేపీ నేతల మాదిరిగా మాట్లాడితే ఎలా..? ఏపీలో వర్గీకరణ అమలు చేయలేదు. అందుకు మాదిగలకు న్యాయం జరిగిందా..?. నేను వర్గీకరణ చేశా.. కాబట్టి అన్యాయం జరిగిందా..? ' అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండిపోతున్నాయి

జనగామ టౌన్: కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి చుక్క ఒడిసిపట్టారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రతి చుక్కను విడిచిపెడుతున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డికి పరిపాలన దక్షత లేదన్నారు. "నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయి. వరంగల్ జిల్లాలోనే లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతోంది. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండిపోతున్నాయి. సీఎం తన చేతకానితనానికి ప్రకృతి పేరు చెప్పి తప్పించుకోవాలని యత్నిస్తున్నారు" అని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోన్న విధానాలతోనే కరవు ఏర్పడిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 33 రోజులు పంపులను ఆన్ చేయకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగునీటి కరవుతో లక్ష ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లడంతో దక్షిణ తెలంగాణలో కూడా కరవు ఏర్పడిందన్నారు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్లు రాష్ట్రంలో 20- 20 క్రికెట్ పాలన కాకుండా.. 20 శాతం కమీషన్ల పాలన చేస్తున్నారుని ఆరోపించారు. సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# సారొస్తున్నారు...

## కేసీఆర్ మార్క్ వ్యూహం..

## అసెంబ్లీ దద్దరిల్లాల్సిందే..!

అమరావతి : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దిగారు.. దీంతో సారొస్తారొస్తారు.. అని గులాబీ దళం మాంచి జోష్ మీదున్నది. ఫామ్‌హౌస్ నుంచి ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారనే సంకేతాలొచ్చాయి. ఏప్రిల్ 17న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నేతలతో జరిగిన భేటీలో కీలక సూచనలు చేశారు కేసీఆర్. ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం ద్వారా మళ్లీ ఉద్యమ పంథాలో విజృంభించాలని పథక రచన చేశారా? అందులో భాగంగానే పోరుగడ్డ ఓరుగల్లును పొలిటికల్ పొలికేకకు వేదికగా నిర్ణయించారా? ఇదంతా ఒక వైపు. అంతకన్నా ముందు అసెంబ్లీ సమావేశాలకు కేసీర్ హాజరు కాబోతున్నారనే చర్చ మరో ఎత్తు%ా% అయితే.. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ లెజిస్లేటివ్ పార్టీ భేటీ కానుంది. అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన అంశాలు.. సర్కార్‌పై సంధించాల్సిన ప్రశ్నలు..అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు కేసీఆర్.. అయితే.. డైరెక్షన్ మాత్రమే కాదు డైరెక్ట్‌గా సభకు వస్తారంటున్నారు బీఆర్ఎస్ నేతలు.జటీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉండడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

అయితే.. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేసీఆర్ టోన్‌తో పొలిటికల్ సీన్ మారింది. బీఆర్ఎస్‌కు ప్రస్తుతం సభలో ఉన్న బలం-బలగం ప్రకారం ఒక సీటు గెలవచ్చు. రెండో అభ్యర్థిని నిలబెడితే ఎలా వుంటుందనే చర్చను ఫామ్‌హౌస్ మీటింగ్‌తో తెరపైకి తెచ్చారు. తద్వారా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలనే వ్యూహమా? ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఝలక్ ఇచ్చే ఎత్తుగడా? అనే డిస్కషన్స్ నడిచాయి. ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ రెండు సీట్లకు పోటీ చేస్తుందా?..అని పొలిటికల్ డొమైన్‌లో చర్చకు తావు తీసిన కేసీఆర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రావణ్‌కుమార్ అభ్యర్థితత్వాన్ని ఖరారు చేయడం ద్వారా తన మార్క్ చాటుకున్నారనేది నడుస్తోన్న టాక్. మరి ఇంతకీ గులాబీ దళం చెప్తున్నట్టుగా బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరుకావడం ఖాయమేనా? అయితే సభలో ఆయన వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయి..? రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు,కులగణన, బీసీ రిజర్వేషన్.. ఎస్సీ వర్గీకరణ బిల్లు, కాళేశ్వరం, ఎస్ఎల్‌బీసీ, రాష్ట్ర అప్పులు.. ఇలా కీలక అంశాలపై సభలో గళమెత్తడం సహా.. ఔర్ ఏక్ దక్కా అనే రేంజ్‌లో మళ్లీ ఉద్యమ పంథాలో విజృంభిస్తారా? అనే చర్చయితే జోరందుకుంది. ఇదంతా బీఆర్ఎస్ఎల్పీ భేటీలో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.




హైదరాబాద్ : తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ తరఫున ముగ్గురు అభ్యర్థులు అద్దంకి దయాకర్ ,శంకర్ నాయక్, విజయశాంతి మార్చి 10న అసెంబ్లీలో నామినేషన్ వేశారు. సీఎం రేవంత్ తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పలువురు మంత్రులు నామినేషన్ కార్యక్రమానికి వచ్చారు. సీపీఐ తరఫున నెల్లికంటి సత్యం నామినేషన్ వేశారు. ఇక బీఆర్ఎస్ తరఫున దాసోజు శ్రవణ్ నామినేషన్ వేశారు. శ్రవణ్ కు మద్దతుగా కేటీఆర్ పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు.

2025, మార్చి 10తో నామినేషన్ల దాఖలు చేసేందుకు గడువు ముగియనుండగా.. ఒక్క రోజు ముందు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో సోమవారం (మార్చి 10) కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మార్చి 20న ఎన్నికలు జరగనున్నాయి. 2025 మార్చి 29తో ఎమ్మెల్యే కోటాలోని 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్న విషయం తెలిసిందే.

**అనూహ్యంగా రాములమ్మ పేరు...** అసెంబ్లీలో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల బలం ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్నాయి. అయితే పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్సీ సీటును సీపీఐకి కేటాయించింది. ఒక్కో ఎమ్మెల్సీకి 21 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్సీ టికెట్ మాజీ ఎంపీ విజయశాంతికి దక్కడం చర్చనీయాంశంగా మారింది. తొలి నుంచి ఎమ్మెల్సీ రేసులో రాములమ్మ పేరు లేదు. చివర్లో అనూహ్యంగా ఆమె పేరు తెరపైకి వచ్చింది. విజయ శాంతి నేరుగా ఢిల్లీలోనే పార్టీ అగ్రనేతలతో చర్చలు జరిపి ఎమ్మెల్సీ టికెట్ సాధించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం టికెట్ త్యాగం చేసిన వారికి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ హైకమాండ్ ప్రియారిటీ ఇచ్చింది. పార్టీ ఆదేశాల మేరకు అద్దంకి దయాకర్ తుంగతుర్తి అసెంబ్లీ, మెదక్ ఎంపీ టికెట్ రేసు నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలోనే వీరి త్యాగాలను గుర్తించిన అధిష్టానం.. ఎమ్మెల్సీగా చాన్స్ ఇచ్చింది.

# నేడు బీఆర్ఎస్ శాసనసభా పక్షం భేటీ

## తెలంగాణ భవన్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్



హైదరాబాద్: ఈ నెల 12 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష భేటీ జరగనుంది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ భేటీ ప్రారంభమవుతుంది. దీనికి రావాల్సిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా సమాచారం పంపించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంతో పాటు, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై జరిగే ప్రత్యేక చర్చల్లో బీఆర్ఎస్ తరఫున వినిపించాల్సిన వాదనపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తారు.

వాయిదా తీర్మానాలు, పార్టీ తరఫున చర్చకు డిమాండ్ చేయాల్సిన అంశాల జాబితా తయారు చేయడంపై పార్టీ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ ప్రసంగానికి కేసీఆర్ హాజరయ్యే చాన్స్ ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.




# ప్రణయ్ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు..

## దోషుల్లో ఒకరికి ఉరి, మిగిలిన వాళ్లకు జీవితఖైదు

నల్గొండ : రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పును ఇవాళ(సోమవారం) నల్లగొండ కోర్టు వెల్లడించింది. ఏ 2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ రెండో అదనపు న్యాయ స్థానం కీలక తీర్పు వెలువరించింది. 302, 120 ఐపీసీ, 109, 1989 సెక్షన్ ఐపీసీ ఇండియన్ ఇండియన్ ఆర్మ్ యాక్ట్ 1959 ప్రకారం శిక్ష విధించింది. శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని ఈ సందర్భంగా నేరస్తులు వేడుకున్నారు. హార్ట్ పెషేంట్, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, చిన్న పిల్లలు ఉన్నారని కొందరు నేరస్తులు న్యాయ స్థానానికి తెలిపారు.

**ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ..** అయితే ఏ2 సుభాష్ శర్మకు నల్గొండ కోర్టు ఉరిశిక్ష విధించింది. ప్రణయ్ హత్యలో సుభాష్ శర్మ కీలకపాత్ర పోషించాడు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. ఇప్పటికే జైల్లో ముగ్గురు నిందితులు శిక్ష అనుభవిస్తున్నారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను అమృత తండ్రి హత్య చేయించాడు. ఏడుగురితో ఓ గ్యాంగ్‌ను అస్గర్ అలీ ఏర్పాటు చేశాడు. గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులో నిందితులతో కలిపి అస్గర్ అలీ గ్యాంగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

**అన్ని కోణాల్లో విచారణ..** కాగా.. పెరుమాళ్ల ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్‌కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2018 సెప్టెంబర్ 14వ తేదీన హత్యకు ప్రణయ్ గురయ్యాడు. గర్భవతిగా ఉన్న భార్య అమృతను నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి.. తిరిగి వస్తుండగా.. దుండగులు ప్రణయ్‌పై కత్తులతో దాడి చేసి హతమార్చారు. తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను మారుతీరావు హత్య చేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600పేజీల్లో చార్జిషీట్ నివేదికను రూపొందించింది. అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో విచారణ పూర్తిచేసి హత్యకేసుల్లో ఎనిమిది మంది నిందితుల పాత్ర ఉందని నిర్ధారించి, 2019 జూన్ 12 వ తేదీన చార్జిషీట్ దాఖలు చేయగా నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్ కోర్టు విచారణ మొదలుపెట్టింది.

# ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు స్పీడప్ చేయండి

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్లను హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా యుద్ధ ప్రతిపాదికన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. హిమాయత్?సాగర్?లోని తన నివాసంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో మంత్రి ఆదివారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగానే కలెక్టర్లు అందరూ పని చేయాలి. ఇండ్ల నిర్మాణ పథకంలో కలెక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలి. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై కలెక్టర్లకు ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా నన్ను సంప్రదించాలి. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కలెక్టర్లదే తుది నిర్ణయం. నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు అర్హులను ఎంపిక చేయాలి. అసంపూర్తిగా ఉన్న వాటిని కాంట్రాక్టర్లు పూర్తి చేయకపోతే లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలి"అని పొంగులేటి తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సాగు, తాగునీటికి ఎలాంటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ మీటింగ్ లో ఎంపీలు కావ్య, బలరాంనాయక్, విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, మురళీ నాయక్, యశస్విని రెడ్డి, కడియం శ్రీహరి, మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అభ్యర్థులు ముగ్గురు ఆణిముత్యాలేనా?

హైదరాబాద్ : ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల వేళ దెబ్బ పడిన తెలంగాణ అధికారపక్షం.. అపకీర్తిని మూటకట్టుకుంది. అధికారం చేతిలో ఉన్న వేళలోనూ సిట్టింగ్ సీటును చేజార్చుకోవటం వెనుక పక్కా కసరత్తు జరగలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. దీనికి అగ్రనాయకత్వం మొదలు రాష్ట్ర నాయకత్వం వైఫల్యాలే ఓటమికి కారణాలుగా భావిస్తున్న పరిస్థితి. ఇలాంటి వేళ.. తాజాగా జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల(ఎమ్మెల్యేల కోటా)కు అభ్యర్థుల ఎంపిక ఎలా సాగుతుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. సంఖ్యా బలాన్ని పరిగణలోకి తీసుకుంటే నాలుగు స్థానాల్లో పోటీ చేసే వీలున్నా.. మిత్రధర్మాన్ని పాటిస్తూ మూడు స్థానాలకు పరిమితం కావటం తెలిసిందే. తాజాగా ప్రకటించిన అభ్యర్థులు ముగ్గురు ముగ్గురే అన్న మాట వినిపిస్తోంది. పార్టీని నమ్ముకొన్న వారు.. పార్టీకి సుదీర్ఘకాలంగా విధేయతతో వ్యవహరించిన వారికే కేటాయింపులు జరిపారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ముగ్గురు అభ్యర్థుల బ్యాక్ గ్రౌండ్ ను.. పార్టీ విషయంలో వారు వ్యవహరించిన తీరును చూస్తే ఈ విషయం అర్థమవుతుందని చెప్పాలి. కొందరు రాజకీయ నేతలు ఎంత కష్టపడినా.. లక్ మాత్రం ఉండదు. ప్రతికూల పరిస్థితుల్లో టికెట్ వచ్చి ఓడిపోవటం.. పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు పార్టీ టికెట్ ఇవ్వకపోవటం లాంటివి జరుగుతాయి అలాంటి కోవలోకే వస్తారు అద్దంకి దయాకర్. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ వర్గానికి చెందిన అద్దంకి దయాకర్ కు టికెట్ కేటాయింపు విషయం వెల్లడైనంతనే.. పార్టీలోని అన్ని వర్గాల నుంచి వచ్చిన మాట.. ఎట్టకేలకు న్యాయం జరిగిందని. ఎందుకంటే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ ఆయనకే కేటాయిస్తారన్న ప్రచారం సాగింది. అనూహ్య పరిణామాలతో అద్దంకి దయాకర్ కు కాకుండా సామేల్ కు టికెట్ దక్కింది. కట్ చేస్తే.. 2024 లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ టికెట్ ఇస్తామని పార్టీ మాట ఇచ్చినా అది కూడా నెరవేరలేదు. చివర్లో హ్యాండ్ ఇచ్చిన పరిస్థితి. దీంతో.. పని చేసి.. పార్టీకి వినయవిధేయతలతో వ్యవహరించే వారికి టికెట్లు ఇవ్వరా? అన్న ప్రశ్న తలెత్తింది.ఈ విమర్శలకు తాజాగా అభ్యర్థిగా ఎంపిక చేస్తూ ఫుల్ స్టాప్ పెట్టేసింది కాంగ్రెస్ అధినాయకత్వం. 1971 ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నెమ్మికల్ గ్రామంలో పుట్టిన అద్దంకి ఉన్నత విద్యావంతుడు. పీహెచ్ డీ పూర్తిచేసిన ఆయన 2014, 2018లో తుంగుర్తి అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడారు. పీసీసీ అధికార ప్రతినిధిగా పని చేసిన ఆయన ఎట్టకేలకు ఈ ఎన్నికలతో ప్రజాప్రతినిధి కానున్నారని చెప్పాలి. ఎస్టీ వర్గానికి చెందిన శంకర్ నాయక్ 1972లో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కేతావత్ తండాలో పుట్టారు. వ్యవసాయం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1998 – 2001 వరకు దామెరచర్ల మండలం కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. 2001, 2014 స్థానిక ఎన్నికల్లో దామెరచర్ల జనరల్ సీటు నుంచి జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన ఎస్టీగా ఆయనదో హిస్టరీ. 2006–11 వరకూ దామెరచర్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా.. 2011–14 వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా.. 2016–19 వరకు మిర్యాలగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా.. 2019 నుంచి నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ప్రజల్లో పేరుతో పాటు.. అగ్రనాయకురాలిగా గ్లామర్ ఉన్నప్పటికీ రాజకీయంగా సరైన స్థానానికి ఎదిగే విషయంలో విజయశాంతి ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. సొంతంగా పార్టీ పెట్టినప్పటి నుంచి వివిధ పార్టీల్లో పని చేసినప్పటికి ఆమెకు సరైన పదవులు దక్కలేదు. ఎన్నికల్లో గెలిచినా.. ఆమె తీసుకున్న నిర్ణయాల కారణంగా ఆమెకు దక్కాల్సిన పదవులు దక్కలేదని చెప్పాలి. బీఆర్ఎస్.. బీజేపీలో పని చేసిన ఆమె.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కాస్త ముందుగా కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమె.. తనకు ఏదో ఒక పదవి ఇవ్వాలన్న మాట తీసుకొని పార్టీలో చేరినట్లుగా చెబుతారు. గతంలో తనకు ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడుకున్న ఆమెకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయటంతో.. ఆమెకు ఇచ్చిన మాటను పార్టీ నిలబెట్టుకున్నట్లుగా చెప్పుకోవాలి. బీసీ నినాదంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పలువురు బీసీ నేతలు ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఆ కోటాలో బీసీ వర్గానికి చెందిన విజయశాంతికి టికెట్ ఇవ్వటం ఆసక్తికరంగా మారింది. మొత్తంగా తాజాగా ఎంపిక చేసిన అభ్యర్థులు అసలుసిసలు ఆణిముత్యాలుగా అభివర్ణిస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు నోఛాన్స్.. ఏకగ్రీవమే



హైదరాబాద్ : అధికారం చేతిలో ఉన్నప్పుడు అత్యాశకు పోవటం.. ఎన్నికల వరకు వెళ్లటం.. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలను దెబ్బ తీసే ఎత్తులు వేయటం.. డబ్బుల సంచులు భారీగా కుమ్మరించటం..విలువల్నివదిలేసి.. విమర్శల్ని పట్టించుకోకుండా తమ పట్టును ప్రదర్శించుకోవటమే లక్ష్యంగా వ్యవహరించే ధోరణికి భిన్నంగా వ్యవహరించింది తెలంగాణ అధికారపక్షం. తాజాగా తెలంగాణలో జరుగుతున్న ఐదు ఎమ్మెల్సీ ఎన్నికల వేళ.. గత అధికారపక్షానికి భిన్నంగా వ్యవహరించింది. ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఎమ్మెల్సీ కోటా ఎన్నికలను పోలింగ్ జరగకుండా.. ఏకగ్రీవాల దిశగా నిర్ణయం తీసుకుంది. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. అధికార కాంగ్రెస్ కు నలుగురు అభ్యర్థుల్ని గెలిపించుకునే వీలుంది. మిత్రుడైన సీపీఐకు ఒక స్థానాన్ని కేటాయించటం.. మూడు స్థానాలకే పరిమితం కావటం.. విపక్ష బీఆర్ఎస్ కు గెలిచే అవకాశం ఉన్న ఒక్క స్థానాన్ని వదిలేయటం ద్వారా పోలింగ్ కు అవకాశం లేకుండా చేసింది. దీంతో.. తాజా ఎన్నికలు గడువు పూర్తైన వెంటనే ఏకగ్రీవం కావటం ఖాయమని చెప్పాలి. ఈ మొత్తం ఎపిసోడ్ చూసినప్పుడు కాంగ్రెస్ అత్యాశకు పోకుండా ఉండటం.. కుట్రలకు తెర తీసే రాజకీయానికి దూరంగా ఉన్నామన్న సంకేతాల్ని ఇచ్చినట్లైంది. తాజా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల లాంఛనమనే చెప్పాలి. నామినేషన్లకు తుదిగడువు ఈ నెల పదకొండు అంటే మంగళవారం సాయంత్రానికి పూర్తి అవుతాయి. నామినేషన్ పత్రాల పరిశీలన.. అభ్యర్థుల ఉపసంహరణకు 13 మధ్యాహ్నం వరకు గడువు ఉంటుంది. ఐదు స్థానాలకు ఐదుగురు అభ్యర్థులే బరిలో ఉండటమే ఖాయమైన నేపథ్యంలో మార్చి 20న జరగాల్సిన ఎన్నికలు జరిగే వీల్లేదు.

దీంతో.. ఎన్నికలు జరిగే అవకాశం లేని నేపథ్యంలో ఉపసంహరణకు గడువు ముగిసే 13నే.. అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లుగా అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. మొత్తంగా పార్టీలు ప్రకటించిన అభ్యర్థులంతా ఎమ్మెల్సీలు అయినట్లే. కేవలం లాంఛనాలు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పాలి.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నారు.. బడ్జెట్‌పై మాట్లాడతారు: కేటీఆర్




హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఢిల్లీలో చెల్లుబాటు కావడం లేదని ఎద్దేవా చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రేవంత్‌ను చూసి తెలంగాణ ప్రజలు జాలి పడాలన్నారు. అలాగే, ఈసారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్సీ కోటాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి దాసోజు శ్రవణ్ నేడు నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో నేడు అసెంబ్లీకి కేటీఆర్ వచ్చారు. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రవణ్‌ను 2023లోనే ఎమ్మెల్సీగా కేసీఆర్ నామినేట్ చేశారు. అప్పుడు బీజేపీ ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుంది. శ్రవణ్ బీఆర్ఎస్‌ను వదిలిపెట్టి వెళ్లి ఉంటే ఇప్పటికే చట్ట సభల్లో అడుగుపెట్టేవాడు. కానీ, బీఆర్ఎస్‌పై నమ్మకంతో పార్టీలోనే ఉన్నాడు. రెండు జాతీయ పార్టీలదీ ఒకటే ధోరణి. రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చుట్టూ ఉండే నలుగురు బ్రోకర్లు టీడీఆర్ ల్యాండ్ కొనే పనిలో తిరుగుతున్నారు. టీడీఆర్ అతి పెద్ద కుంభకోణానికి తెరలేపబోతున్నారు. రేవంత్ ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేస్తున్నారు. ఎఫ్ఎస్ఐ నిబంధనల ద్వారా శిఖం భూముల ధరలు కృత్రిమంగా పెంచే యోచనలో రేవంత్ ఉన్నారు. తెలంగాణలో రేవంత్ అండ్ టీమ్ ప్రైవేటు దోపిడీ పెరుగుతోంది. ప్రభుత్వ ఆదాయం తగ్గుతోంది. ప్రభుత్వం లేని అప్పులు చూపించి.. ఎక్కువ మిత్తి చూపిస్తున్నారు. కేంద్రంతో మంచి సంబంధం ఉన్న రేవంత్.. తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చాడో చెప్పాలి. 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ఒక్క పోరాటమైనా చేసిందా?. బీజేపీ హడావుడి సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ అంటూ సెటైర్లు వేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్ అట్టర్ ఫ్లాప్‌గా ఉంది. అందుకే అటెన్షన్ కోసం డైవర్షన్ రాజకీయం చేస్తున్నారు. ఈ–కారు రేసును ముందుకు తెచ్చారు. ప్రపంచ సుందరి పోటీలు పెట్టి సీఎం ఏం సాధిస్తారు?. 200 కోట్లు ఖర్చు పెట్టారు ఏం లాభం వస్తుంది?. ఎవరికి ఉద్యోగాలు వస్తాయి' అని ప్రశ్నించారు.

# రాములమ్మ 2.0.. సినిమాల్లోనే కాదు.. రాజకీయాల్లోనూ.. అధిష్ఠానంతో టచ్

మహా సముద్రం లాంటి కాంగ్రెస్ పార్టీలో అంతే.. అధిష్ఠానంతో సరైన సమయంలో టచ్ లోకి వెళ్లాలి.. వారు ఇచ్చిన హామీని గుర్తు చేయాలి. అందుకోసం అవసరమైతే అధిష్ఠానం చుట్టూ తిరగాలి.. అనుకున్నది సాధించాలి.. ఇప్పుడు రాములమ్మ విజయశాంతి అదే చేశారు. బీజేపీలో మంచి స్థాయిలో ఉంటూ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లోకి వచ్చారు విజయశాంతి. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు. కాంగ్రెస్ ఓడిపోతే పరిస్థితి ఏంటి? అనే అనుమానం ఉన్నా.. విజయశాంతి ధైర్యం చేసి నిర్ణయం తీసుకున్నారు. రాములమ్మ కాంగ్రెస్ లోకి వచ్చే సమయంలోనే అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మణిక్ రావ్ ఠాక్రేకు తనకు పదవి ఇవ్వాలనే షరతు పెట్టారట. ఈ షరతును గుర్తు చేసేందుకు విజయశాంతి ఇటీవల కాంగ్రెస్ హై కమాండ్ వద్దకు వెళ్లారట. ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను కలిసి తనకు ఇచ్చిన హామీని ప్రస్తావిస్తూ ఎమ్మెల్సీ టికెట్ కావాలని కోరినట్లు తెలిసింది. ఇక ఠాక్రే సైతం గతంలో విజయశాంతికి ఇచ్చిన హామీని అధిష్ఠానం చెవిన వేసినట్లు తెలిసింది. అందుకనే అనూహ్యంగా రాములమ్మను పదవి వరించింది. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్సీ టికెట్ కోసం బీసీ నాయకులు పెద్దఎత్తున పోటీ పడుతుండడంతో అధిష్ఠానం కూడా మధ్యే మార్గం ఆలోచించింది. మహిళా కోటాలో బీసీ కోటానూ పరిగణిస్తూ విజయశాంతిని ఎంపిక చేసింది. దీంతో.. ఐదేళ్ల కిందట సరిలేరు నీకెవ్వరు సినిమాతో సినిమాల్లో సెకండ్ ఇన్నింగ్స్ ను ఘనంగా స్టార్ట్ చేసిన లేడీ సూపర్ స్టార్ విజయ శాంతి ఇప్పుడు రాజకీయాల్లోనూ సెకండ్ ఇన్నింగ్స్ ను అంతే ఘనంగా మొదలుపెట్టారు.

**కొసమెరుపు:** 2009లో తొలిసారి ఎంపీగా గెలిచి చట్ట సభలో అడుగుపెట్టిన విజయశాంతి 16 ఏళ్ల తర్వాత ఎమ్మెల్సీగా చట్ట సభలో అడుగుపెడుతున్నారు. అది కూడా అధికార పార్టీ సభ్యురాలిగా.. మరి రాజకీయ సెకండ్ ఇన్నింగ్స్ లో ఎంతవరకు రాణిస్తారో?

# భక్తుల కల్పతరువు నారసింహుడు - ఫాల్గుణ శుద్ధ ద్వాదశి... - నృసింహ ద్వాదశి



ఫాల్గుణ శుద్ధ ద్వాదశిని నృసింహ ద్వాదశి అంటారు. నరసింహ ద్వాదశిగా ప్రసిద్ధి చెందిన గోవింద ద్వాదశి హోలీకి ముందు ఫాల్గుణ మాసంలోని శుక్ల పక్ష ద్వాదశి తిథి నాడు వస్తుంది. భారత దేశంలోని అనేక వైష్ణవాలయాల్లో ఈ రోజున విశేషంగా ఉత్సవాలు జరుపు తారు. ఫాల్గుణ మాసంలో వచ్చే నృసింహ ద్వాదశి వైష్ణవ ఆలయా లను సందర్శించడం ద్వారా శుభఫలితాలు చేకూరుతాయని సాంప్రదాయ ఆచరణాసక్తుల విశ్వాసం. భగవంతుని అవతారాలలో అత్యద్భుత అవతారంగా చెప్పగలిగే అవతారం నారసింహావ తారం. సగం మనిషి సగం మృగం ఆకారంలో రూపు దాల్చడం నరసింహావతార ప్రత్యేకం. దుష్ట శిక్షణ శిక్ష రక్షణ సర్వాంత ర్యామిత్వం, భక్తుని మాటను నిజం చేయడం... నమ్మిన బంటును శాప విముక్తుని గావించడం, ఎన్ని నియంత్రణలు, వరాలున్నా వాటిని అధిగమించి భక్తుడు లేక వైరి కోరుకున్న విధంగానే శత్రు వధ చేయడం, సూక్ష్మం నుండి స్థూల రూపాన్ని ఏదైనా ధరించడం నరసింహావతారంలో విశిష్టతలు. శ్రీహరి (మనిషి జంతువు కాని) నరసింహ రూపంలో, పగలూ రాత్రిగాని సంధ్యా సమయాన, ఇంటా బయటా గాని గుమ్మంలో, భూమ్యాకాశాలు కాని తన తొడపై, హిరణ్య కశిపుని సంహరించాడు. ప్రహ్లాదుని మాటను యధార్థం చేసి, బ్రహ్మవరాన్ని గౌరవించి, తన అవతార తత్వాన్ని చాటాడు మహా విష్ణువు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కదిరి, అహోబిలం, యాదగిరి గుట్ట, సింహాచలం, మంగళగిరి, ధర్మపురి, జగ్గయ్యపేట, పాలెం, సింగరాయ కొండ, పెంచల కోన, చీర్యాల తదితరాలే గాక కర్నాటకలో మేల్కొటె, ఉడుపి, సావన దుర్గ, దేవరాయన దుర్గ తదితర నృసింహాలయాలు ప్రఖ్యాతాలు. భక్తుల కోరికలు నెరవేర్చే కల్పతరువులు. నృసింహ ద్వాదశి పవిత్ర దినాన గంగా, సరస్వతి, యమునా, గోదావరి వంటి పవిత్ర నదులలో స్నానాలు ఆచరిస్తారు. సూర్యోదయానికి ముందే లేచి నదుల్లో స్నానాలు చేస్తారు. నదులు అందుబాటులో లేనివారు సరస్సులోనైనా, నదుల దగ్గర కూడా స్నానాలు చేయవచ్చు. అలా చేస్తున్నప్పుడు గంగా దేవి, విష్ణువులను స్మరించుకోవాలి. ఈ రోజు భక్తులు గోవింద ద్వాదశి వ్రతం ఆచరిస్తారు. ఉపవాసాలు కూడా పాటిస్తారు. ఈ రోజున భక్తులు సాయంత్రం విష్ణు దేవాలయాలను సందర్శించి పూజల్లో, ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ రోజున విష్ణు నామ స్మరణ, శ్రీ నరసింహ కవచం పఠించడం విశేష ఫలితాలనిస్తుంది. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన నరసింహస్వామిని ఈ రోజున పూజించే వారికి అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. ద్వాదశి నాటి గంగాస్నానం పాపాలను నశింపజేస్తుందని పురాణ వచనం. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం, మహిళలు సీతామాత పూజ, విష్ణుపూజ చేయడం వలన సకల సంపదలు చేకూరుతాయి. నృసింహ ద్వాదశి వ్రతమాచరించే భక్తులకు స్వామివారు ధైర్యం, నమ్మకం, భద్రత కల్పిస్తారని విశ్వసిస్తారు. నరసింహస్వామి సంబంధిత శ్లోకాలు రోజంతా చదువుకుంటూ ధ్యానం చేస్తే విశేషంగా లబ్ధి పొందుతారు. వ్రతం చేసుకునే వారు వేకువ ఝామునే నిద్రలేవాలి. పారే నదిలో కానీ చెరువులో లేదా బావి వద్ద శిరస్నానం చేయాలి.. ఇలా చేస్తే దేహంశుద్ధి అవడమే కాకుండా పూజపై మనసు లగ్నమవుతుందని పెద్దలు చెబుతారు. నరసింహస్వామి దేవాలయంలో కానీ, ఇంటివద్ద స్వామి వారి పటం పెట్టుకొని వివిధ రకాల పూలు, పండ్లు ఉంచి నరసింహస్వామి శ్లోకాలను భక్తి శ్రద్ధలతో చదువుతూ పూజ చేయాలి. స్వామివారిని తులసిమాలతో అలంకరించి, వడపప్పు, పానకం నైవేద్యంగా సమర్పించాలి. నరసింహ గాయత్రిని కానీ, శ్రీలక్ష్మి నరసింహ కరావలంబ స్తోత్రం, నరసింహ అష్టోత్తరం, నరసింహ సహస్ర నామాలను గానీ పఠిస్తే చాలామంచిదని పురాణాలు పేర్కొంటున్నాయి.

**ఉగ్రం వీరం మహావిష్ణుం**
**జ్వలంతం సర్వతోముఖం**
**నృసింహం భీషణం భద్రం**
**మృత్యుమృత్యుం నమామ్యహం**

ఉగ్రం అంటే... నృసింహుడు ఉగ్రమూర్తి. నరసింహుని హుంకారాన్ని విన్నంత మాత్రంలోనే అంతర్గత, బహిర్గత శత్రునాశనం జరుగుతుంది. వీరం అంటే.. సకల కార్యకారణాలకు మూలంగా వున్న శక్తినే వీరం అంటారు. నరసిం హుడు వీరమూర్తి. కనుక సకల కార్యకారణ స్వరూపుడు ఆయనే. మహావిష్ణుం అంటే... అన్ని లోకాల్లో అంతటా వుండే నరసింహ తత్వానికి ఈ నామం ప్రతీక. సకల జీవరాశులన్నిటిలోనూ తానే వ్యక్తంగానూ, అవ్యక్తంగానూ పరమాత్మ భాసిస్తాడు. జ్వలంతం అంటే... సకల లోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేయడం ద్వారా వాటి ప్రకాశానికి కారణమైన తత్త్వమే జ్వలంత శబ్దానికి అర్థం. సర్వతోముఖం అంటే... ఇంద్రియ సహాయం లేకుండా సకల విశ్వాన్ని చూడగల పరమాత్మ తత్త్వమే సర్వతోముఖత్వం. నృసింహం అంటే.. సకల జీవుల్లో సింహం చాలా శ్రేష్ఠమైనది. అందుకనే పరమాత్మ లోకాలను ఉద్ధరించ డానికి శ్రేష్టమైన సింహాకృతి ప్రధానంగా నరసింహుడుగా ఆవిర్భవించాడు. భీషణం అంటే... నరసింహుని శాసనశక్తి ప్రతీక భీషణత్వం. అత్యంత భయంకరమైన రూపం ఇది. భద్రం అంటే.. భయాన్ని కలిగించే భీషణుడైన పరమాత్మే ఆ భయాన్ని పోగొట్టి అభయాన్ని కూడా ఇస్తాడు. ఇదే భద్రత్వం. మృత్యుమృత్యుం అంటే.. స్మరణ మాత్రం చేత అప మృత్యువును దూరం చేసేవాడు. మృత్యువుకే మృత్యువైన వాడు నరసింహుడు మాత్రమే. మృత్యువును కలిగించేదీ, మృత్యువును తొలగించేది కూడా ఆ స్వామి అనుగ్రహమే. ఓం నమో నృసింహాయ నమః అని 108 సార్లు స్వామి వారిని ధ్యానిం చినా విశేష ఫలితం లభిస్తుంది. అలాగే ఈ రోజున నరసింహ - స్వామి వారి దేవాలయాలను దర్శిస్తే వారి కృపకు పాత్రుల వుతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# 2 రోజులు.. వెయ్యిమంది హతం.. ఆ దేశంలో వీధుల్లో మృతదేహాల గుట్టలు



ప్రాణాలు గాల్లో ఉండడం అంటే ఇదేనేమో..? ఊచకోతకు అర్థం ఇదేనేమో..? అంతర్యుద్ధం ఇలాగే ఉంటుందేమో..? అన్నట్లుగా ఆ దేశంలో హింస చెలరేగుతోంది.. ఎంతగా అంటే.. వీధుల్లో శవాలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి.. బయటకు వస్తే ప్రాణం పోయినట్లే అనే పరిస్థితి ఉండడంతో వాటిని కనీసం పట్టించుకునేవారు లేరు.. కేవలం రెండు రోజుల్లోనే వెయ్యి మందిపైగా ఊచకోతకు గురయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పశ్చిమాసియా అంటేనే అత్యంత కల్లోలం అనే సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పటికే హమాస్-ఇజ్రాయెల్ ఘర్షణలతో ఏడాదిన్నర నుంచి రావణకాష్టంగా రగులుతూ ఉంది ఆ ప్రాంతం. ఇదే ప్రాంతంలోని సిరియాలో ఇప్పుడు హింస చెలరేగుతోంది. ఈ దేశ మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మూడు నెలల కిందట పదవిని వదిలేసి రష్యాకు పారిపోయిన సంగతి తెలిసిందే. నాడు అసద్ ను కేవలం రెండు రోజుల్లో సాగనంపారు తిరుగుబాటుదారులు. అయితే, ఇప్పుడు అసద్ మద్దతుదారులు తిరుగుబాటు చేస్తున్నారు. దీంతో సిరియాలో మళ్లీ హింస చెలరేగింది. భద్రతా దళాలు, అసద్ వర్గం ఘర్షణల్లో రెండు రోజుల్లో వెయ్యిమంది పైగా ప్రాణాలు కోల్పోయారు. 2014లో సిరియాలో అసద్ కు వ్యతిరేకంగా తిరుగుబాటు మొదలైంది. దీన్ని రష్యా సాయంతో ఆయన అణచివేశారు. అయితే, ఆ అంతర్యుద్ధం మొదలైన తర్వాత అత్యంత ఘోరమైన ఘటనగా తాజా ఘటన అని అంటున్నారు. అసద్ మద్దతుదారులు దాడికి దిగగా భద్రతా దళాలు ప్రతి దాడి మొదలుపెట్టాయి. దీంతో 745 మంది సాధారణ పౌరులు, 125 మంది భద్రతా బలగాలు, 148 మంది అసద్ మద్దతుదారులు ప్రాణాలు కోల్పోయారు. ముస్లింలలోనే అసద్ ది అలావైట్ తెగ. ఈ వర్గం సిరియాలో మైనారిటీ. కానీ, 50 ఏళ్లకుపైగా సిరియాలో వీరిదే రాజకీయ అధికారం. అసద్ ను ఎట్టకేలకు సాగనంపినా లకాటియా ప్రాంతంలో ఆయన వర్గానికి పట్టుంది. ఇప్పుడీ ప్రాంతంలోనే తిరుగుబాటుతో విద్యుత్తు, నీటి సరఫరా నిలిచిపోయింది. అసద్ కుటుంబంతో పాటు రష్యాకు పారిపోగా.. తిరుగుబాటుదారులు కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశారు. దీన్ని అసద్ వర్గం వ్యతిరేకిస్తూ జబ్లే నగరంలో భద్రతా సిబ్బందిపై దాడికి దిగారు. దీంతో అలావైట్లు అధికంగా ఉండే ప్రాంతాల్లోకి ప్రభుత్వ దళాలు వెళ్లి ఊచకోతకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇళ్లకు నిప్పంటిచడంతో పెద్దఎత్తున ఘర్షణలకు దిగుతున్నారు. బనియాస్ పట్టణంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలు వీధుల్లో, ఇళ్లలో పడి ఉన్నాయి. సిరియాలో అసద్ పాలన సమయంలో రష్యా దళాలు ఉన్నాయి. అసద్ తప్పుకొనే సమయంలోనే అవి కూడా వైదొలగాయి. ఇప్పుడు అక్కడ తిరుగుబాటుదారుల ప్రభుత్వానికి అమెరికా పరోక్ష మద్దతు ఉన్నట్లు చెబుతున్నారు. తాజాగా ఘర్షణలు ఎక్కడకు దారితీస్తాయో చూడాలి.

# పాండిత్యానికి ప్రతి రూపం విద్వన్మణి రాజన్న శాస్త్రి

## మార్చి 11... రాజన్న శాస్త్రి వర్ధంతి



నిరంతర పఠన మందే మనసును లగ్నం చేసి, సిద్ధి పొందిన సాహితీ తాపసి కొరిడె రాజన్న శాస్త్రి. కావ్య వ్యాఖ్యల్లో మల్లినాథసూరి వలె, శాస్త్ర వ్యాఖ్యలలో అభినవ గుప్తుని వలె, శ్లేష రచనలో శ్రీహర్షుని వలె, కమనీయ కవితలో కాళిదాసు వలె వచన రచనలో దండి వలె, ప్రసంగాలలో కవిసామ్రాట్ వలె భాసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాజన్న శాస్త్రి. వేద వేదాంగ శాస్త్ర ఆగమ సకల కళలకు కాణాచి అయిన ధర్మపురి క్షేత్రంలో 1933 జూన్ 2న జన్మించిన శాస్త్రి, ఇంటి వద్ద వేద సంస్కృత అధ్యయనాలు చేసి, మహారాష్ట్ర, గుజరాత్, ఇతర ప్రాంతాలలో లబ్ద ప్రతిష్టులైన తాడూరి బాలకృష్ణ శాస్త్రి వద్ద కావ్య పాఠాలు, పాలెపు వేంకటరాయ శాస్త్రి చెంత, అద్వైత పూర్వ మీమాంసాదులను అభ్యసించారు. సంస్కృతాంధ్రాలలో ప్రైవేటుగా పరీక్షలు రాసి ఉపాధ్యాయ, అధ్యాపక స్థాయి నుండి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య స్థాయికి, స్వయం కృషితో చేరుకున్నారు. మనోహర కవితాధారలను స్రవించడమే కాకుండా, అమర భాషలు శ్లేషలో రెండర్థాలతో "బలి పుష్ట విలసితం"అనే పేరుతో కాకి, రాజకీయ నేతక్షుద్రవ్యంలో సమానులే అనే భావం ప్రకటితమ య్యేలా, ఆయన ద్వర్థి లఘు రచన సమస్త భారతావనిలో అభిమాన పాత్రతకు కారణమైంది. అలాగే , "గణనాయక స్తవం" పేరుతో రచన... పైకి గణపతి ప్రార్థన, తరచి చూడ, లోన నాయకుల ప్రస్తావన ఇమిడించుకుంది. "మధుపవి గీతి" లో తేనెను త్రాగుతున్న తుమ్మెదను వర్ణిస్తూ త్రాగుబోతు దుశ్చర్యలను శ్లేషార్థంతో విరచించారు. హరిహర స్తుతి మరో శ్లేష కావ్యం. చలన చిత్రాలు కళ, విజ్ఞానం అందించాల్సిన సాధనాలుగా ఉండాలని, కానీ అది హింస, అశ్లీలతతో కూడి ఉంటున్నాయని ఆవేదన భరిత సామాజిక బాధ్యతలు వ్యక్తీకరించారు. అలంకార శాస్త్ర గ్రంథం పరిష్కారమే కాకుండా, అల్లసాని పెద్దనామాత్యుని "మను చరిత్ర" లోని ధ్వని సిద్ధాంత అనువర్తనాన్ని పరిశోధన గ్రంథ రూపంలో వెలువరించి, ప్రతిభను చాటి చెప్పి, డాక్టరేట్ పొందారు. చిన్నయసూరి బాల వ్యాకరణానికి వ్యాఖ్యానం రాశారు. మరో రచన తారావళి గ్రంథం పండితామోదం పొంది, దివంగత ప్రధాని పీ.వీ.నరసింహా రావు ద్వారా సన్మానితుల చేసింది. దివాకర్ల సాహితి ట్రస్టు నుండి పురస్కార గ్రహీతలు అయినారు. స్వర్ణ భారతి పురస్కారం లభించింది. హైదరాబాద్ సంస్కృత భాషా ప్రచార సమితికి "వైస్ ఛాన్సలర్" గా పనిచేసి సంస్కృత భాషామ తల్లికి నీరాజనాలు అందించే కృషి జరిపారు. దివాకర్ల పండిత మండలిలో "భువన విజయం' భారతా వరణం, శ్రీనాధ కనకాభి షేకాది రూపకాలలో విభిన్న పాత్రలు ధరించి జీవం పోశారు. తాము పుట్టువు నొంది, పెరిగిన ధర్మపురి క్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహుని సుప్రభాత శ్లోకాలు, నిత్య ఉషోదయ ప్రతిధ్వనులుగా, కొనసాగుతూ వస్తున్నాయి. భర్తృహరి శతక త్రయంకు సంబంధించి చతుర్థ శతకం పేరున, 1987 లో "ఓరియంటల్ కాన్ఫరెన్స్" లో నూతన ఆవిష్కరణలు గావించి, విశేషాలను వివరించారు. "వసుమతీ వసుధాకరం" పేరుతో రాసిన సంస్కృత నాటకం, నాలుగు దశాబ్దాల నాటి సంస్కరణలపై వెలుగొంది ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారమై, సంస్కృత భారతిలో ప్రచురితమైంది. "వింశతి శతా బ్దీయ సంస్కృత కావ్యామృతం" లో భారత.దేశ వాసులకు సుపరిచితులైన, 20 మంది మహాకవుల సరసన స్థానాన్ని పొందారు. షోడశ్రీ అనే 16 మంది భారతీయ సంస్కృత కవుల పరిచయంలో, రాజన్న శాస్త్రి కవిత్వం ముద్రితంగా నిలిచింది. "నిబంధ రత్న సముచ్చయము", సరస్వత సుషమం, సూర్యోదయం, సాగరికా, సంవిద్, అమృతలతా, సంస్కృత శోధనా, సంస్కృత భారతి, మధురవాణి లాంటి అనేక పత్రికలలో వచ్చిన తమ రచనలను సంకలనం గావించారు. 3,500 శ్లోకాలతో కూడిన "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" క్రీస్తుశకం 930 నాటి, ప్రాచీన తాళపత్ర గ్రంథాల్ని, స్థానికులు పండితులు కశోజ్జల సదాశివ శాస్త్రికి సహకరించి, పరిష్కరించి, దేవస్థానానికి ప్రచురణార్థం అందజేశారు. లక్ష్మీ నరసింహ సుప్రభాతం, ప్రపత్తి, కాళేశ్వర స్తుతి, హరిహర స్తుతి లాంటి దేవత స్తుతులతో తమ కవిత మాధుర్యాన్ని రంగరించారు. తమ పాండిత్య ప్రతిభతో యావత్ దేశానికి బహుముఖీన సాహిత్య సేవలందించి, తెలంగాణ పూర్వ పండిత సంప్రదాయ వారసునిగా, ప్రతినిధిగా నిలిచిన కొరిడె రాజన్న శాస్త్రి, 2013 మార్చి 11న పాంచభౌతిక శరీరాన్ని త్యజించి, పర బ్రహ్మలీనులైనారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఎంత సేపు పనిచేయాలి.. సౌమ్య స్వామినాథన్ ఆసక్తికర వ్యాఖ్యలు

దేశంలో పనిగంటలపై చర్చ తీవ్రమవుతోంది. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే ఎక్కువసేపు పని చేయాల్సి వస్తుందని కొందరు భావిస్తుంటే, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిమిత గంటల పని చేయడం ఉత్తమమని మరికొందరు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%) మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ కీలక వ్యాఖ్యలు చేశారు.

**-అధిక పని గంటలు.. శరీరంపై ప్రభావం**... స్వామినాథన్ మాట్లాడుతూ 'ఎక్కువసేపు పని చేయడం వల్ల సామర్థ్యం తగ్గుతుందని, అలసిపోయినప్పుడు శరీరం చెప్పినట్లు వినాలని' సూచించారు. కొంతకాలం పాటు అధికంగా పని చేయడం సాధ్యమేనని, అయితే దీర్ఘకాలం పాటు అలాంటి పని తీరు కొనసాగించడం శ్రేయస్కరమికాదని పేర్కొన్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో వైద్య, ఆరోగ్య రంగాల్లోని వారు రెండేళ్ల పాటు తీవ్ర ఒత్తిడిలో పనిచేశారని, దీని ప్రభావంగా కొందరు వృత్తులనే విడిచిపెట్టాల్సి వచ్చిందని వివరించారు.

**-ఉత్పాదకతకు విరామం అవసరం...** ఉత్పాదకతను మెరుగుపరచాలంటే కేవలం గంటల కొద్దీ పనిచేయడం కంటే, మానసిక విశ్రాంతిని




కూడా ప్రాధాన్యత ఇవ్వాలని స్వామినాథన్ సూచించారు. "మీరు టేబుల్ వద్ద 12 గంటలు కూర్చుంటే సరిపోదు. ఎనిమిది గంటల తర్వాత మీ పనితీరు ఎలా ఉందో విశ్లేషించుకోవాలి. గంటల సంఖ్యకంటే పని నాణ్యత ప్రధానంగా ఉండాలి" అని ఆమె అభిప్రాయపడ్డారు. అదనంగా, మానవ శరీరానికి నిద్ర అత్యవసరమని, మంచి నిద్ర తీసుకోకపోతే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు.

**-భారత కార్మికులపై వివిధ అభిప్రాయాలు...** భారత యువత వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు దీనిని సమర్థిస్తుండగా, మరికొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ ఈ వ్యాఖ్యలకు మరింత ఊతమిస్తూ, వారానికి 90 గంటలు పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పిన విషయం మరోసారి చర్చకు దారి తీసింది.

**- సమతుల్యమైన విధానం అవసరం...** పని గంటలు పెంచితేనే ఉత్పాదకత పెరుగుతుందని అనుకోవడం సరైన దృక్కోణం కాదని, దాని స్థానంలో సమతుల్యమైన పని-జీవిత సమతుల్యతపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. దేశ అభివృద్ధికి, వ్యక్తిగత ఆరోగ్యానికి హానికరం కాకుండా సమతుల్య విధానాన్ని అవలంభించడం అవసరం. పునరాలోచన అవసరమైన ఈ సమస్యపై సమాజంలోని అన్ని వర్గాలు చర్చించి సమతుల్య నిర్ణయాన్ని తీసుకోవడం సమాజ హితానికి తోడ్పడుతుంది.

# ఏడాదిలో పట్టాల మీదకు మేడిన్ తెలంగాణ రైల్వే కోచ్ లు!

ఆసక్తికర అంశం వెలుగు చూసింది. సరిగ్గా మరో ఏడాదిలో మేడిన్ తెలంగాణ రైల్వే కోచ్ లు పట్టాల మీద పరుగులు తీయనున్నాయి. కాజీపేటలో ఏర్పాటు చేసిన రైల్వే మాన్యూఫ్యాక్చరింగ్ యూనిట్ లో 2026 మార్చి నుంచి రైల్వే కోచ్ ల ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఏళ్లకు ఏళ్లుగా కాజీపేట రైల్వే కోచ్ తయారీ కేంద్రం గురించి చెబుతున్నా.. ఉత్పత్తి మాత్రం మొదలుకాని పరిస్థితి. ఇప్పటివరకు 65 శాతం పనులు పూర్తి కావటం.. మిగిలిన 35 శాతం పనుల్నివచ్చే ఏడాది మొదట్లో పూర్తి కానున్నట్లు చెబుతున్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి రైల్వే కోచ్ తయారీ షురూ కానుందన్న విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా చెప్పటంతో.. పెండింగ్ పనులు శరవేగంగా సాగుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోచ్ లు..



వ్యాగన్ల ఉత్పత్తి.. రిపేర్లు చేసే ఈ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ కోసం రూ.716 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి మొదలైతే.. ప్రతి నెలా 50చొప్పున ఏడాదికి 600 చొప్పున ఆధునిక ఎల్ హెచ్ బీ కోచ్ లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ యూనిట్ ప్రత్యేకత ఏమంటే.. ఎల్ హెచ్ బీ కోచ్ లతోపాటు ఇంజిన్ ప్రత్యేకంగా అవసరం లేని ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లను ఉత్పత్తి చేస్తారు. ఇవి నెలకు రెండు చొప్పున ఉత్పత్తి చేస్తారు. ఒక్కో దాన్లో 12 బోగీలు ఉంటాయి. ఎంఎంటీఎస్..మెట్రో రైళ్లకు వినియోగిస్తున్నవి ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లే. ఇక్కడే గూడ్సు రైళ్ల వ్యాగన్లూ ఉత్పత్తి కానున్నాయి. మొత్తం160 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ యూనిట్ 60,753 చదరపు మీటర్ల పరిధిలో ప్రీఇంజినీర్డ్ భవనాలు రానున్నాయి. వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాల్ని పెంచటంతో పాటు.. మేడిన్ తెలంగాణ రైల్వే కోచ్ లు అందుబాటులోకి రానున్నాయి.

అంతేకాదు.. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు అవసరమైన మెట్రో రైల్ కోచ్ ల్ని కూడా కాజిపేట యూనిట్ నుంచి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.


చురకలు

## సంపాదకీయం

# చంద్రబాబు రేవంత్ ముఖా ముఖీ తలపడతారా ?

ఉమ్మడి ఏపీకి సీఎం గా వ్యవహరించిన వారు చంద్రబాబు. ఏకంగా 23 ఉమ్మడి జిల్లాలకు అతి పెద్ద ఆంధ్రప్రదేశ్ కి తొమ్మిదేళ్ళ పాటు నిరాటంకంగా పాలించిన చరిత్ర ఆయన సొంతం. అయితే అటువంటి బాబు కేవలం 13 ఉమ్మడి జిల్లాకే పరిమితం అయ్యారు. విభజన తరువాత ఆయన ఏపీకి సీఎం అయ్యారు అంటే తన పవర్ ని సగానికి సగం తగ్గించుకున్నారు అని అప్పట్లోనే అంతా అన్నారు. ఇక చంద్రబాబు ఏపీకి సీఎం అయినా రెండు తెలుగు రాష్ట్రాల మేలు కోరుకుంటాను అని ఎపుడూ చెబుతూ ఉంటారు. ఎందుకంటే ఆయన తెలంగాణాను కూడా పాలించి ఉన్నారు కాబట్టి ఆ మాట అంటున్నారు. ఏపీలో చూస్తే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ దశలో ఉంది. ఇక గోదావరి వరద నీటిని రాయలసీమకు మళ్ళించి అక్కడ కూడా భూములను సస్యశ్యామలం చేయాలన్నది బాబు మార్క్ ఆలోచన. ఆయన 2014 నుంచి 2019 దాకా సీఎం గా ఉన్నపుడే ఈ ప్రతిపాదన చేశారు. దానిని నాడు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ అడ్డుకుంది. నిజానికి బాబు చేస్తున్నది తప్పు కాదు. అక్రమ ప్రాజెక్ట్ అంతకంటే కాదు. ప్రతీ ఏటా గోదవారికి భారీ వరదలు వస్తాయి. అలా జూన్ జూలై ఆగస్టు మూడు నెలలలో ఉధృతంగా నీరు వచ్చి ఏపీలోని సముద్రంలో పెద్ద ఎత్తున కలసిపోతుంది. ఈ నీటిని ఎంతో కొంత మళ్ళించి తమ కరవు ప్రాంతాలను బాగు చేసుకుందామని బాబు ఆలోచించడం మేలైన విధానమే. ఆయన ఈ మధ్యనే బనకచర్ల ప్రాజెక్ట్ కి శ్రీకారం చుట్టారు. అది కూడా గోదావరి వరద నీటితోనే అని పదే పదే చెబుతున్నారు. ఏటా మూడువేల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో కలసిపోతోంది. అందులో కేవలం పది శాతం అంటే 300 టీఎంసీల నీరుని తీసుకుని గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ ని చేపట్టాలని చూస్తున్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం దీని మీద పక్కా ప్లాన్ తో ఉంది. దీని వల్ల ఏకంగా ఏడు నుంచి ఎనిమిది లక్షల సాగు నీటికి నీరు అందిస్తారు. ఈ ప్రాజెక్ట్ తో ఏకంగా రాయలసీమలో చివరి ప్లేస్ అయిన కుప్పం దాకా నీరు పారించవచ్చు అన్నది కూటమి ప్రభుత్వ పెద్దల ఆలోచన. అయితే దీని మీద తెలంగాణాలో రాజకీయ దుమారం రేగుతోంది. ఏపీ కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోందని అందువల్ల అడ్డుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి సహా అంతా డిమాండ్ చేస్తున్నారు. దాని మీద రేవంత్ రెడ్డి కూడా ఘాటుగానే రియాక్ట్ అయ్యారు. తెలంగాణాలో కొత్త ప్రాజెక్టులు పూర్తి అయ్యేంతవరకూ ఏపీ కొత్త ప్రాజెక్టులు తలపెట్టవద్దని ఆయన అంటున్నారు. అంతే కాదు గోదావరి నది మీద తెలంగాణా ప్రాజెక్టులు కడుతుందని దానికి కేంద్రం అనుమతులు ఇవ్వాలని ఆ విధంగా ఎండీయే భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కృషి చేయలాని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఏపీ గోదావరి క్రిష్ణా నదుల విషయంలో తన హక్కులను దాటి ముందుకు వెళ్తోందని కూడా తెలంగాణా రాజకీయ పార్టీలు అంటున్నాయి. దీని మీద చంద్రబాబు అసెంబ్లీలోనే వివరణ ఇచ్చారు. తాము వరద నీరుని వాడుకుంటామని అది కూడా సముద్రజలాల నుంచే అని అంటున్నారు. కానీ చూస్తూంటే బీఆర్ఎస్ కాంగ్రెస్ సీఎం ని రెచ్చగొడుతోంది. దాంతో రేవంత్ రెడ్డి కూడా బాబు మీద విమర్శలు చేయాల్సి వస్తోంది. మరి ఈ వ్యవహారం ఎంతదాకా వెళ్తుంది అన్నది అయితే తెలియడంలేదు అని అంటున్నారు. ఈ నీటి గొడవలు కాస్తా గురుశిష్యుల మధ్య రాజకీయ వివాదాలకు దారి తీస్తాయా అన్నది కూడా చర్చగా ఉంది. అలా జరగాలని చంద్రబాబుని రేవంత్ రెడ్డి నిలదీయాలని బీఆర్ ఎస్ నేతలు కోరుకుంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పాత్రలలో మాధవపెద్ది స్వరం పరకాయ ప్రవేశం - మార్చి 11.. మాధవపెద్ది సత్యం జయంతి




"వివాహ భోజనంబు వింతైన వంటకంబు, వియ్యాల వారి విందు, ఒహ్హొహ్హొ నాకే ముందు" అనే అలనాటి మల్టీ స్టారర్ చిత్రరాజం మాయా బజార్ చిత్రంలోని పాటను వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి కాదేమో. ఆ పాట గుర్తుకు రాగానే వెను వెంటనే కళ్ళ ముందు కదలాడతూనే రూపం ఎస్వీ రంగారావు ది. ఆ వెంటనే స్ఫురణకు వచ్చేది మాధవపెద్ది గాత్రమే. ఎస్వీఆర్ నటనకు జీవం పోసిన నేపథ్య గాయకుడు మాధవ పెద్ది. అంతేకాదు, దుర్యోధనుడు, రావణుడు, ఘటోత్కచుడు ఇలా ప్రతినాయక పాత్రలకు నేపథ్య గానం ఆయనదే. ఎస్వీరంగారావు, రేలంగి, రమణారెడ్డి లాంటి నాయకే తర నటుల నటనలతో ఆయన గొంతు మమేకం అయింది. మాధవ పెద్దిది సుస్వరం. వివాహ భోజనంబు' అని తిను బండారాల గురించి వర్ణించినా, సరదా సరదా సిగరెట్టు' అని ధూమ పానం అనర్థాల గురించి హెచ్చరిం చినా, అయయో జేబులో డబ్బులు పోయెనే' అంటూ పేకాట గురించి వాపోయినా, భళి భళి భళి భళి' దేవా అంటూ తత్వాన్ని బోధించినా, భలేచాన్సులే' అంటూ ఇల్లరికంలో ఉన్న మజాను తెలిపినా, మాధవ పెద్ది సుస్పష్ట స్వరం చెవులలో ఇంపుగా వినిపిస్తుంది. అపస్వరమే తెలియని గాయకుడు మా బాబాయ్' అని మాధవపెద్ది గురించి గాన గంధర్వుడు ఎస్పీ. బాలు అంటుండే వారు. మాధవపెద్ది సత్యం (మార్చి 11, 1922 – డిసెంబర్ 18, 2000) తెలుగు సినిమా నేపథ్య గాయకు డు, రంగస్థల నటుడు. ఈయన తెలుగు, తమిళం, కన్నడ, మళయా ళం, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7,000 పైగా పాటలు పాడి ప్రసిద్ధి చెందాడు. సత్యం 1922, మార్చి 11 న బాపట్ల సమీపాన బ్రాహ్మణ కోడూరు గ్రామంలో మాధవపెద్ది లక్ష్మీ నరసయ్య, సుందరమ్మ దంపతులకు జన్మించాడు. వృత్తిరీత్యా నటుడైన సత్యం చిన్నతనములో ఎనిమిదేళ్ల వయసునుండి రంగస్థల నాటకాలలో నటించేవాడు. తెలుగు రంగ స్థలముపై మల్లాది సూర్య నారాయణ నాటక బృందములో సభ్యునిగా హరిశ్చంద్ర నాటకములో నక్షత్రకుని పాత్రను అద్భుతము పోషిస్తూ పేరు తెచ్చుకున్నాడు. ఆయన ప్రతిభను గుర్తించిన చక్రపాణి మాధవపెద్దిని తనతోపాటు మద్రాసు తీసుకువెళ్లి, తను నాగిరెడ్డితో కలిసి అప్పడే కొత్తగా స్థాపించబడిన విజయా పిక్చర్స్ పతాకము కింద నిర్మిస్తున్న షావుకారు చిత్రములో నటించే అవకాశము కలుగ జేశాడు. ఆయన తొలిసారిగా వెండితెరపై హిందీ, తమిళ ద్విభాషాచిత్రం రామదాసులో కనిపించాడు. ఆ సినిమాకు రెండు భాషల్లోనూ తన పాత్రర పాటలు తనే స్వయంగా పాడాడు. మాధవపెద్ది సత్యం షావుకారు సినిమాతో తెలుగు సినిమా రంగములో అడుగు పెట్టా డు. ఈ సినిమాలో సత్యం ఒక గుడ్డివాని పాత్రపోషించి ఆ పాత్రకు ఉన్న మూడు పాటలు పాడాడు. కొన్ని తెలుగు చిత్రాలలో నటించినా మాధవపెద్ది సత్యం ప్రధానంగా గాయకుడే. ఆయన ఆనాటి ప్రసిద్ధ సంగీత దర్శకులైన సాలూరు రాజేశ్వర రావు, ఘంటసాల వెంకటేశ్వర రావు తదితరు లందరితో పనిచేశాడు. ఎస్వీ రంగారావు, రేలంగి వెంకట రాయ య్య పాటలన్నీ దాదాపు ఆయనే పాడాడు. పౌరాణిక చిత్రాలలో పద్యాలు పాడటములో పేరెన్నిక గన్నాడు. ముఖ్యంగా పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం జోడి కలిసి పాడిన పాటలు తెలుగు వారి నొళ్ళలో ఇప్పటికి నానుతూనే ఉన్నాయి. 75 ఏళ్ళ వయసులో కూడా కృష్ణవంశీ తీసిన సింధూరం సినిమాలో సంకురాతిరి పండ గొచ్చెరో పాటపాడి పలువురి ప్రశంసలందు కున్నాడు. ఇలా ఎందఱో నటులకు ఆయన కంఠం అమరి పోయింది. రంగస్థల అనుభవం ఆయన్ని తీర్చిదిద్దింది. పద్యం ఆయన గళంలో వయ్యారా లు ఒలికించు కుంది. పాట ఆయన గొంతులో ఒదిగి పోయింది. పాడు తున్నది పాత్రలేమో, పాత్రదారులేమో అనిపించేలా పాత్రలలో ఆయన స్వరం పరకాయ ప్రవేశం చేస్తుంది. ఆయన పద్యంలో భావం తొణికిస లాడుతుంది. ఆయన పాటలో రాగం అలవోకగా అమరి పోతుంది. ఆయన కంఠంలో గాంభీర్యం నాట్య మాడుతుంది. ఆయన కంఠంలో హాస్యం గిలి గింతలు పెడుతుంది. తనకు వచ్చిన గౌరవ పురస్కారా లను ఎప్పుడూ ప్రదర్శించు కోలేదు. కారు కూడా ఎక్కేవారు కాదు. రైలు లో సెకండ్ క్లాసులోనే ప్రయాణించే వాడు. మాయాబజార్‌లో నాన్న పాడిన 'వివాహ భోజనంబు' పాట 'సాంగ్ ఆఫ్ ద మిలీనియమ్'గా ఎంపికయినా ఏ మాత్రం గర్వించ లేదు. ఆయన సినిమా పరిశ్రమలో యాభై ఏళ్లకు పైగా ఉన్నప్పటికీ విజిటింగ్ కార్డు కూడా ఉండేది కాదు . ఆయన 78 సంవత్సరాల వయసు లో 2000, డిసెంబర్ 18న చెన్నైలో అస్వస్థతతో మరణించాడు. ఆయన కుమారుడు, కూచిపూడి నృత్య కోవిదుడు మాధవపెద్ది మూర్తి తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం ' మాధవపెద్ది సత్యం అవార్డు, మాధవపెద్ది ప్రభావతి అవార్డును ' నెలకొల్పారు. ఆ పురస్కారం అందుకొన్న వారిలో ఎం. ఎస్. విశ్వనాథన్, పి. బి. శ్రీనివాస్ లాంటి ప్రముఖులున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సంగీత సాధనలో సిద్ది పొందిన తాపసి పినాక పాణి - గురువులకే గురువు శ్రీపాద పినాక పాణి - మార్చి 11...శ్రీపాద పినాక పాణి వర్ధంతి

కర్ణాటక సంగీతం అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చే పేర్లు అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య తదితరులు. శాస్త్రీయ కర్ణాటక సంగీతం నేటికీ సంప్రదాయ రీతిలో కొన సాగుతున్న దంటే ఇలాంటి కారణ జన్ములైన సంగీతజ్ఞులు తమ సర్వస్వాన్నీ సంగీతానికి ధారపోసిన ఫలితమే. అయితే నిరాడంబరంగా, నిశ్శబ్దంగా, నిర్విరామంగా సంగీతానికి తొంభయ్యేళ్ళకి పైగా కృషి చేసిన ఒక గొప్ప సంగీత విద్వాంసుని సేవల గురించి చాలామందికి తెలియక పోవచ్చు. శత వత్సర జీవన యానంలో సంగీతమే ప్రపంచంగా జీవించిన సంగీత తపస్వి ఆయన. వృత్తి రీత్యా వైద్యుడేయినా, సంగీతజ్ఞుడినని చెప్పుకోవడానికే ఇష్టపడిన అరుదైన వ్యక్తిత్వం ఆయనకే సొంతం. ఆయన కేవలం గాయకుడే కాదు, కేవలం వైణికుడే కాదు. సంగీత శాస్త్రాన్ని ఆసాంతం అవగాహన చేసుకున్న వాగ్గేయకారుడు కూడా. వందలాది వాగ్గేయకారుల కృతులకు స్వరరచన చేసి ఒక చోట పుస్తకంగా అచ్చు వేయడానికి తన జీవితకాలాన్ని వెచ్చించిన కళా పిపాసి, సిద్ధి పొందిన తాపసి ఆయన. నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం, మల్లాది సూరిబాబు, నేతి శ్రీరామశర్మ, ఓలేటి వేంకటేశ్వర్లు, సినీ నేపథ్య గాయని ఎస్. జానకి, ఎందరో లబ్ధ ప్రతిష్టులైన గాయకులకు సంగీతం నేర్పి, గురువులకే గురువుని పేరు ప్రఖ్యాతులు గడించిన సంగీత కళా నిధి ఆయన. ఆయనే డాక్టర్ శ్రీపాద పినాక పాణి. ఈ శతాబ్దపు అద్భుత సంగీత విద్వాంసుడు, మధుర గాయకుడు, సంగీత కళానిధి, పద్మ భూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. సంగీత కళాభివృద్ధికి విశిష్ట కృషిచేసి, భావి తరాలకు అందించాలన్న కుతూహలంతో అనేక సంగీత రచనలు చేసి, తన శిష్య, ప్రశిష్యులకు సంగీతంలోని మెళకువలు నేర్పించిన సంగీత శాస్త్ర విశారదుడు. నిరంతర పరిశ్రమతో, సంక్లిష్టమైన, విషయాలను సమన్వయించి నిశితంగా పరిశీలించి, విశ్లేషించి రాగ యుక్తంగా శిష్యులకు నేర్పేవారు. ఒకవైపు రోగాలను, మరోవైపు రాగాలను సరిచేసిన సవ్యసాచి డాక్టర్ శ్రీపాద పినాక పాణి (ఆగస్టు 3, 1913 – మార్చి 11, 2013) వైద్య, సంగీత రంగాలలో నిష్ణాతులు. శాస్త్రీయ సంగీతం తెలుగునేలపై అంతంత మాత్రంగా ఆదరణ ఉన్నరోజులు. నాటక పద్యాలలోనో, హరికథలలోనో తప్ప శాస్త్రీయ సంగీతం అంతగా వినబడని ఆ రోజులలో, తమిళ నాట లాగే శాస్త్రీయ సంగీతం తెలుగునాట వర్ధిల్లాలని నిరంతరం తపన పడ్డారు. శాస్త్రీయ సంగీత వైభవాన్ని ఆకాంక్షించారు. ఆ దిశగా ఎందరో సంగీత శిఖామణులను తెలుగు వారికి అందచేశారు. శ్రీపాద పినాక పాణి శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారంలో 1913, ఆగష్టు 3 వ తేదిన కామేశ్వరరావు, జోగమ్మ దంపతులకు జన్మించారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు గారి వద్ద తొలి సంగీత పాఠాలకు శ్రీకారం చుట్టారు. 1939వ సంవత్సరంలో విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల నుండి ఎం.బి.బి.ఎస్. పట్టా తీసుకున్నారు. 1945వ సంవత్సరంలో జనరల్ మెడిసన్ ఎం.డి. పూర్తి చేసారు. తర్వాత రాజమండ్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా ప్రభుత్వ సర్వీసులో చేరారు. 1951 నుండి 1954 వరకు విశాఖలో వైద్య కళాశాలలో సివిల్ సర్జన్ గా పనిచేసారు. 1957లో కర్నూలు వైద్య కళాశాలకు బదిలీ అయి, అక్కడే కళాశాల ప్రిన్సిపాల్ గా, సూపరింటెండ్ గా పనిచేసి 1968 లో పదవీ విరమణ చేసారు. కర్నూలులో స్థిర పడ్డారు. సంగీతం వింటూనే నొటోషన్స్ రాయగల నైపుణ్యం ఆయనకు దేవుడిచ్చిన వరం. పదవీ విరమణానంతరం, త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, గీతాలు, స్వరజతులు, స్వరపల్లవులు, తాన పద వర్ణములు, కృతులు, జావళీలు మొదలైన సంగీత రచనలు ఏరి కూర్చి, పుస్తక రచనకు శ్రీ కారం చుట్టారు. సంగీత సౌరభం పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన నాలుగు సంపుటాలలో శ్రీపాద స్వర పరచిన అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజాది వాగ్గేయ కారుల కృతులు 607, ముత్తు స్వామి దీక్షితుల కృతులు 173, పదములు 44, జావళీలు 40, తానవర్ణములు 56, తిల్లానాలు 10, మొత్తం 1088 సంగీత అంశాలు ఉన్నాయి. పాణినీయం, ప్రపత్తి, స్వరరామమ్, అభ్యాసమ్, నా సంగీత యాత్ర పుస్తకాలు ఆయన విరచితాలు. సంగీతకళా శిఖామణి, సప్తగిరి సంగీత విద్వాన్ మణి, సంగీత కళానిధి, గానకళా సాగర, కళా ప్రపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పురస్కారం, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకొన్నారు. ఆయన సంగీతాన్ని కేంద్రనాటక అకాడమీ రికార్డ్ చేసి ఆర్కైవ్స్ లో



పొందు పరచింది. 1977 లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 1978 లో ఆంధ్ర విశ్వ విద్యాలయంచే కళాప్రపూర్ణ బిరుదు, 1984 లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2011 లో సంగీత నాటక అకాడమీ ఠాగూర్ ఫెలో గౌరవాన్ని పొందారు. 2012, ఆగష్టు 3 న తన 99 వ జన్మదినాన తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే "జ్ఞాన విద్యా వారథి" బిరుదు పొందడం జరిగింది. అనేకమంది వాగ్గేయకారులు రచించిన పాటలకు స్వరాలతో, అనుస్వర, గమక సహితంగా స్వరరచన చేసి పినాకపాణి సంగీత సౌరభంలో పొందు పరిచారు. సంగీత సౌరభం అనే పుస్తకంలో అన్నమయ్య కీర్తనలూ, క్షేత్రయ్య పదాలూ, జావళీలూ, వర్ణాలూ ఇలా దాదాపు రెండు వేలకు పైగా పాటలకు స్వర రచన అందించారు. స్వతహాగా వైద్యులు కావడం వలన రోగానికి కారణం వెతికినట్లే, సంగీతం ఎలా నేర్పాలి, ఎలా నేర్పితే సులభతరం అవుతుంది అనే విషయాలపై లోతుగా అధ్యయనం చేసి గ్రంథస్థం చేశారు. సంగీతాభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పెన్సిలిన్ ఆవిష్కర్త ఫ్లెమింగ్ - మార్చి 11...అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతి



వెయ్యేళ్ల కాలంలోనే అతి గొప్ప ఆవిష్కరణగా, కోట్లాది మంది ప్రాణాలకు రక్షణగా గుర్తింపు పొందింది 'పెన్సిలిన్'. వైద్య శాస్త్రంలో అద్భుతమైన యాంటీ బయాటిక్ మందుగా పేరుపొందిన పెన్సిలిన్ పేరు చెప్పగానే వెంటనే స్ఫురించే పేరు అలెగ్జాండర్ ఫ్లెమిం గ్. తొలి యాంటీ బయోటిక్‌గా పేరొందిన ఆ మందును కనిపెట్టిన శాస్త్రవేత్తే అలగ్జాండర్ ఫ్లెమింగ్. ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే యాంటీ బయాటిక్. వేరే ప్రయోగం చేస్తుండగా జరిగిన చిన్న పొరపాటు వల్ల ఇది బయట పడడం విశేషం. పెన్సిలిన్ వల్ల క్షయ, న్యూమోనియా, టైఫాయిడ్ లాంటి ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కలుగు తోంది. దీన్ని కనిపెట్టినందుకు ఫ్లెమింగ్ 1945లో నోబెల్ బహు మతిని పొందారు. సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (ఆగస్టు 6, 1881 – మార్చి 11, 1955) స్కాట్లాండుకు చెందిన జీవ శాస్త్ర వేత్త, వైద్యుడు. 1923 లో కనుగొన్న ఎంజైములు, లైసోజై ములు, 1928 లో కనుగొన్న ప్రపంచ మొట్ట మొదటి యాంటీ బయోటిక్ పెన్సిలిన్ ఆయన పరిశోధనల్లో ముఖ్యమైనవి. పెన్సిలిన్ కనుగొన్నందుకు ఆయన 1945లో హొవార్డ్ ఫ్లోరే, ఎర్నెస్ట్ బోరిస్ చైన్ లతో కలిసి వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నాడు. బ్యాక్టీరియాలజీ, ఇమ్యునాలజీ, కీమోథెరపీ మీద అనేక వ్యాసాలు రాశారు. స్కాట్లాండ్‌లో 1881 ఆగస్టు 6న రైతు కుటుంబంలో పుట్టిన ఫ్లెమింగ్, ఏడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసి షిప్పింగ్ కంపెనీలో గుమాస్తాగా చేరాల్సి వచ్చింది. అనుకోకుండా ఆస్తి కలిసి రావడంతో తిరిగి ఇరవయ్యేళ్ల వయసులో చదువును కొనసాగించడం ప్రపంచానికెంతో మేలు చేకూర్చింది. సెయింట్ మేరీస్ కాలేజీలో వైద్యవిద్యలో చేరి చురుగ్గా చదువుతూనే రైఫిల్ షూటింగ్, ఈత, వాటర్‌పోలో క్రీడల్లో బహుమతులు పొందుతూ ఉండేవారు. మేరీ మెడికల్ కాలేజీ నుంచి 1906 లో ఈయన డిగ్రీ తీసుకున్నారు. డిగ్రీ పొందాక పరిశోధనల్లో నిమగ్నమయ్యారు. మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా 1918 లో మళ్ళీ సెయింట్ మేరీ మెడికల్ కాలేజీకి చేరారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో సైనికులకు చికిత్స లు చేసే బృందానికి నాయకత్వం వహించారు. గాయాలకు సూక్ష్మ జీవుల వల్ల ఇన్ఫెక్షన్ సోకి చాలా మంది సైనికులు చనిపోవడాన్ని గమనించిన ఫ్లెమింగ్, యుద్ధా నంతరం బ్యాక్టీరియాపై పరిశోధన లు చేయసాగారు. లండన్ లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లోని ప్రయోగశాలలోని ఇన్‌క్యులేషన్ విభాగంలో ఫ్లెమింగ్ ఇన్ఫ్లుఎంజా వైరస్‌తో ప్రయోగాలు చేశారు. వాటిలో భాగంగా 'స్టెఫైలో కోకి' సూక్ష్మజీవులపై పరిశోధన చేస్తుండగా ఓ రోజున చిన్న పొర పాటు జరిగింది. ఆ బ్యాక్టీరియా ఉన్న పాత్రలను బల్లపై పెట్టి మర్చిపోయి ఇంటికి వెళ్లిపోయారు. ఆ మర్నాడు వచ్చి చూస్తే బయటి వాతావరణం ప్రభావం వల్ల ఓ పాత్రలో నీలిరంగులో బూజులాంటి తెట్టు (ఫంగస్) కట్టి ఉండడం గమనించారు. చిత్రంగా ఆ బూజు ఆశించినంత మేరా పాత్రలో సూక్ష్మజీవులు నాశనమై కనిపించా యి. అంటే ఆ బూజులో సూక్ష్మ జీవులను చంపే పదార్థమేదో ఉందని తెలుసు కున్నారు. దాంతో ఫ్లెమింగ్ దానిపై పరిశోధ నలు చేసి చిన్న కుంచెలాగా ఉండే పదార్థాన్ని వేరుచేయ గలిగారు. లాటిన్‌లో పెన్సిలియమ్ అంటే చిన్న కుంచె అనే అర్థం ఉండడంతో దానికి 'పెన్సిలిన్' అని పేరు పెట్టారు. దాన్ని 1928లో కనిపెట్ట గా, మరిన్ని పరిశోధనలు చేసి ఓ మందుగా మార్చి వాడుకలోకి తీసుకు రావడానికి 17 సంవత్స రాలు పట్టింది. దీంతో యాంటీ బయాటిక్ యుగానికి నాంది పలికినట్టయింది. ప్రచురించిన నివేదికలలో ఫ్లెమింగ్ ఇలా అంటారు: ఒకరు కొన్నిసార్లు తాను వెతకని దాన్ని కనుగొంటారు. నేను సెప్టెంబర్ 28, 1928 న తెల్లవారు జామున మేల్కొన్న ప్పుడు, ప్రపంచం లోని మొట్ట మొదటి యాంటీ బయాటిక్ లేదా బ్యాక్టీరియా కిల్లర్‌ను కనుగొనడం ద్వారా ఔషధం మొత్తాన్ని విప్లవా త్మకంగా మార్చాలని నేను ఖచ్చితంగా అనుకోలేదు. కానీ నేను సరిగ్గా అదే చేశానని అనుకుంటు న్నాను. 1942 లో యునైటెడ్ స్టేట్స్‌లో స్ట్రెప్టోకోకల్ సెప్టిసిమియాకు మొదటి రోగికి విజయ వంతంగా చికిత్స అందించబడింది. రెండవ ప్రపంచ యుద్ధంలో సైనికుల మరణాలు మరియు విచ్ఛేదనం సంఖ్యను తగ్గించడానికి పెన్సిలిన్ సహాయ పడింది. రికార్డుల ప్రకారం, 1943 మొదటి ఐదు నెలల్లో 400 మిలియన్ యూనిట్ల పెన్సిలిన్ మాత్రమే అందుబాటులో ఉన్నా యి. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే సమయానికి, అమెరికా కంపెనీలు నెలకు 650 బిలియన్ యూనిట్లను తయారు చేస్తున్నాయి. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ స్కాటిష్ జీవశాస్త్రవేత్త, వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలగిస్ట్) కాగా, ఆయన కనిపెట్టిన "ఎంజైము లైసోజైము(1923 ), అంటి బయోటిక్ ' పెన్సిలిన్(1928 ) ' ముఖ్యమైనవి. 1945లో వైద్య శాస్త్రానికి నోబెల్ బహుమానం ఈ పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్ తో పాటు హొవార్డ్ ఫ్లోరె, ఎర్నెస్ట్ చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్ర వేత్తలకు కూడా ఇచ్చారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కాగితాల్లోనే ప్రణాళికలు.. కానరాని మొక్కలు

ధర్మపురి: జిల్లాలోని పురపాలికల్లో ఈ సంవత్సరం మొక్కల పెంపకానికి ఇంకా అడుగులు పడలేదు. మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపని పుర అధికారులు కనీసం వాటిని పెంచడం, పంపిణీ చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏటా రూ.లక్షల నిధులు వెచ్చించి అయిదు పురపాలికల్లో వివిధ రకాల మొక్కలు నాటుతున్నారు. ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ పురపాలికల్లో 2023 నవంబరు నాటికి వివిధ నర్సరీల టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకొని డిసెంబరులో పనులు చేపట్టారు. విత్తనాలు పెట్టి.. మొక్కలు ఎదిగిన తర్వాత జూన్‌లో



నాటారు. అయితే ఏడాది అంతా అస్తవ్యస్తంగా ఉంది.

**మొక్కుబడిగానే జరిగే అవకాశం!**

నిజానికి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నీరు పట్టి.. జూన్ మొదటి వారంలో(వానలు పడితే) పుర వార్డుల్లో ఇంటింటికీ హరితహారం మొక్కల్ని పంపిణీ చేయాలి. గత ఏడాది ఈ ప్రక్రియ బాగానే జరిగినా, ఈ సంవత్సరం మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికలు, సామాజిక ఆర్థిక, ఇందిరమ్మ ఇళ్ల సర్వేల కారణంగా అధికారులకు పనుల ఒత్తిడితో దృష్టి నిలపలేదు. మార్చి మొదలైనా పనులు మొదలు కాకపోవడంతో కార్యక్రమం మొక్కుబడిగా సాగే అవకాశముంది. ఇప్పటికే మున్సిపాలిటీల్లో నీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకానికి అడ్డంకులు ఏర్పడే అవకాశముంది. పుర ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నా.. నిధుల కేటాయింపు లేక క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. కూలీలకు సమయానికి డబ్బులు చెల్లించడం లేదు. దీంతో నర్సరీల్లో మొక్కల పెంపకానికి కూలీలు వెనకడుగు వేస్తున్నారు. ఈ విషయమై ధర్మపురి పుర కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధర్మపురి మున్సిపాలిటీ పరిధి నక్కలపేట ఇందిరమ్మ కాలనీల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్లు ఖరారు చేసి, నర్సరీల్లో మొక్కలు నాటి సంరక్షిస్తామన్నారు.

# జిల్లాకేంద్రం.. పడకేసిన పారిశుద్ధ్యం

సిరిసిల్ల : జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో ఏదైనా సమస్య ఉన్నా ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని... అధికారులు స్పందించక పోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతు న్నారు. పట్టణంలోని ప్రధాన మురుగు కాలువలకు ఇరువైపులా చెత్తా చెదారం పేరుకుపోయి, పిచ్చి మొక్కలు పెరిగాయి. మురుగు పారక దుర్వాసన వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా మురుగంతా రోడ్డుపైకి వచ్చి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతో ంది. దోమలతో ఇక్కట్లు తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. సిరిసిల్లలోని పద్మానగర్ ఓపెన్ జిమ్ ప్రాంతం అసాంఘి కార్యకలాపా లకు అడ్డాగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయంలో కొందరు ఇక్కడికి వచ్చి మద్యం తాగుతున్నారని చెబుతున్నారు. మద్యం సీసాలు, చెత్త చెదారం వేస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని అంటున్నారు. వీధుల్లో భారీ వృక్షాలు ఉండటంతో వీధి దీపాలు ఉన్నా, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండి వెలుతురు రావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**దోమల బెడద తగ్గించాలి**

సిరిసిల్లలోని బీవైనగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. దోమకాటు వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశు ద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి.సాయికుమార్, బీవైనగర్

# కళ తప్పిన ప్రకృతి వనాలు..

సిరిసిల్ల : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచి ప్రజలకు ఆహ్లాదాన్ని చేరువచేయాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా వనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. రెండేళ్లు ఈజీఎస్ ద్వారా నిర్వహణ చేపట్టగా ప్రస్తుతం వనాలను పట్టించుకోకపోవడంతో బోసిపోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో 12 మండలాల పరిధిలో పల్లె ప్రగతిలో భాగంగా పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు అప్పట్లో నిధులు మంజూరు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో వనానికి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులను సమకూర్చారు. గ్రామాల్లో అనుకూలతను బట్టి 20 గుంటల నుంచి ఎకరా విస్తీర్ణంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా నడకదారులు, చిన్నారులు ఆడుకునే ఉపకరణాలు ఏర్పాటు చేశారు. 255 గ్రామ పంచాయతీల్లో మియావాకీ పద్ధతిలో ఆయా వనాల్లో ఔషధ, ఫలాలను అందించే మొక్కలను విరివిగా నాటించారు. మొక్కలు నాటినప్పటి నుంచి రెండేళ్లపాటు ఆయా వనాల నిర్వహణను ఈజీఎస్ ద్వారా పర్యవేక్షించారు. మూడేళ్ల క్రితమే నిర్వహణ గడువు ముగియడంతో గ్రామపంచాయతీల పరిధిలోకి వచ్చింది.

**పంచాయతీలకు తప్పని భారం**

ప్రకృతి వనాల్లో మొక్కలు ఏపుగా పెరిగాయి. నిధుల కొరత కారణంగా పల్లె ప్రకృతి వనాల బాధ్యత పంచాయతీలకు భారంగా మారుతోంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో నిర్వహణకు ఖర్చులు పెట్టేందు కు ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు వెనకాడుతున్నారు. కనీసం నీటిని అందించకపోవడంతో వృక్షాలు వాడిపోయి కనిపిస్తున్నాయి. ఆకులు రాలి అధ్వానంగా కనిపిస్తున్నాయి. నడకదారులు, చిన్నారులు ఆడుకునే పరికరాలు ధ్వంసమవుతున్నాయి. ఆహ్లాదాన్ని పంచే గ్రామీణ ఉద్యాన వనాలు కళావిహీనంగా తయారవుతున్నాయి. పలుచోట్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వనాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సంఘం పటిష్ఠం.. సహాయం సమున్నతం



తాండూరు : మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా నూతన కార్యవర్గాల ఏర్పాటు ప్రక్రియను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) శ్రీకారం చుట్టింది. తొలుత గ్రామాల్లో ఎన్నిక పూర్తి చేసేందుకు ఖరారు చేశారు. అన్ని గ్రామాల్లో పూర్తయ్యాక మండల సమాఖ్యలకు కొత్త కార్యవర్గాలను ఎన్నుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

**ఆరు నెలలు దాటితే రూ.5 లక్షల రుణం మంజూరు:** జిల్లాలోని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు వారితో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆరు నెలలు దాటాక గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూ.5లక్షల బ్యాంకు లింకేజీ రుణాల్ని మంజూరు చేయిస్తున్నారు. క్రమంగా రుణ పరిమితిని పెంచుతున్నారు. దీంతో ఒక్కో సంఘం ఏకంగా రూ.20లక్షల వరకు రుణాలు పొందే వెసులుబాటు కల్పిస్తున్నారు. వీటితో సంఘాల్లోని మహిళలు ఆసక్తి ఉన్న స్వయం ఉపాధి యూనిట్లు, వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. ఈక్రమంలో సంఘాల నెలవారి పొదుపు, రుణ వాయిదాల వసూలు, బ్యాంకులో జమ చేయడం, ఎప్పటికప్పుడు దస్త్రాల్లో నమోదు చేసేందుకు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సంఘాల్లోని మహిళలతో కార్యవర్గాల్ని ఎన్నుకున్నారు. గతంలో నియామకమైన కార్యవర్గాల గడువు ముగియడంతో కొత్తగా ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. సంఘానికి ఒక సభ్యురాలితో అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి, సహ కార్యదర్శిలను ఎన్నుకుంటున్నారు. వీరిలో అధ్యక్షురాలు, కోశాధికారి, కార్యదర్శికి సంఘాల నగదు ఉపసంహరించే చెక్‌పవర్‌ను కల్పిస్తున్నారు.

**పనితీరే కొలమానం..**

గతంలో మాదిరి రాజకీయాలకు, నేతలు, ప్రజాప్రతినిధుల సిఫారసులకు తావులేకుండా సంఘాల పనితీరు, సీఐఎఫ్, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణ వాయిదాల చెల్లింపులు, లావాదేవీలు, నెలనెలా సమావేశాలు, దస్త్రాల నిర్వహణ, కార్యకలాపాల ఆధారంగా మండల సమాఖ్య కార్యవర్గంలో చోటు కల్పిస్తున్నారు. పనితీరు ఆధారంగా మండల సమాఖ్య అధ్యక్షురాలి స్థానం కల్పించనుండటంతో పారదర్శకత ఏర్పడనుంది.

**12 లోగా నూతన కార్యవర్గాలు పూర్తి:** ఆనంద్, ఏపీఎం, తాండూరు గ్రామాల్లోని వీఓఏలకు నూతన కార్యవర్గాల ఎన్నిక నిర్వహిస్తున్నాం. ఇరవై శాతం కార్యవర్గాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన వాటికి కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేసి 12న మండల కార్యవర్గాన్ని ఎన్నుకునేం దుకు ఏర్పాట్లు చేశాం.

సభ్యులుగా చేరేందుకు వయసు.. 18 సంవత్సరాలు
ఒక్కో సంఘంలో సభ్యులు.. 10 నుంచి 12 మంది
నెలకు పొదుపు.. రూ.50 నుంచి రూ.150

# పంటలకు వేసవి గండం



సిరిసిల్ల: గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన అంబటి వీరయ్య వరిసాగు చేయగా నాలుగు ఎకరాల పంట నీరందక ఎండిపోయింది. శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకంలో నారాయ ణపూర్ జలాశయం కుడికాల్వ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీని పరిధిలోని గ్రామాలకు సాగునీరు రావడంలేదు. భూగర్భజలాలు సైతం అడుగంటడంతో వరి పంట ఎండిపోతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జలాశయాల్లో నీటి మట్టాలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. యాసంగి నీటి కేటాయింపులపై డిసెంబరులో రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యుఏఎం) సమావేశంలో ఉమ్మడి జిల్లాలో 6.97 లక్షల ఎకరాలుగా నిర్ణయించారు. కాగా ప్రస్తుతం వరి 8.95 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. వేసవి నేపథ్యంలో ముమ్ముందు పంటల సాగుకు, తాగునీటి సరఫరాకు మెరుగైన ప్రణాళిక అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని వేసవిలో నీటి కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

ఓదెల మండలం హరిపురం వద్ద దెబ్బదిన్న డి-86 కాల్వ దుస్థితి. నిర్వహణ లేకపోవడంతో నీటి సామర్థ్యం తగ్గి ఓదెల మండలంలోని హరిపురం, పిట్టలఎల్లయ్యపల్లి, రూపునారాయణపేట తదితర గ్రామాలకు సాగునీరందక పంటలు ఎండుతున్నాయి.

**ఇదీ పరిస్థితి**

ఎస్సారెస్పీ పరిధిలో జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో కొంత మేరకు నీటి తడులు మెరుగ్గానే అందుతున్నాయి. పైన ఉన్న రైతులు అవసరానికి మించి వాడటం, కాల్వల డ్రాపులు, తూములు శిథిలమవడంతో చివరికి నీటి ప్రవాహం తగ్గి కరీంనగర్ గ్రామీణం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు నీరు చేరడం గగనమవుతోంది.

ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకంలో నారాయణపూర్ జలాశయం మత్తడికి రామడుగు, కొత్తపల్లి మండలాల రైతులు గండి కొట్టారు. దీంతో ఎత్తిపోతలలోని ఒకే మోటారుకు నీరందుతోంది. పంపులు సక్రమంగా నడవకపోవడంతో వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాలకు పూర్తి స్థాయిలో తరలింపు సాధ్యం కావడం లేదు.

జలాశయాల పరిధిలోని మేజర్, మైనర్ కాల్వలకు ఏళ్ల తరబడి ఓఅండ్ఎం (ఆపరేషన్ మెయింటెనెన్స్) పనులు చేపట్టలేదు. నీటిని వదిలాక కాల్వలపై కింది స్థాయి సిబ్బంది పర్యవేక్షణ లోపిస్తోంది.

జలాశయాల్లో నీటి లెక్కలు ఇలా

ఎస్సారెస్పీలో 67 టీఎంసీల నీటిని యాసంగికి నిర్ణయించారు. ఇప్పటికే 47 టీఎంసీలు వినియోగించారు. ఏప్రిల్ మొదటి వారంలోపు మరో 20 టీఎంసీలు విడుదల చేయనున్నారు.

ఎలంపల్లిలో ప్రస్తుతం 12.97 టీఎంసీల నీరుంది. ఇందులో 2 టీఎంసీలు నంది పంపుహౌస్ నుంచి సాగుకు, మిగతావి తాగడానికి, ఎన్టీపీసీ అవసరాలకు ఉపయోగిస్తారు.

దిగువ మానేరు పరిధిలో మార్చి నెలాఖరులోగా 38.40 టీఎంసీల నీటిని యాసంగికి కేటాయించగా ఇప్పటికే 30 టీఎంసీలు విడుదల చేశారు. ప్రస్తుతం 12.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగి తర్వాత తాగునీటికి 2.6 టీఎంసీలు మధ్యమానేరు నుంచి తరలించనున్నారు.మధ్యమానేరు కింద 54 వేల ఆయకట్టుకు 2 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతం 15.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇవి జూన్ వరకు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు.

# నిలవని నీరు.. నెరవేరని లక్ష్యం

జగిత్యాల : జిల్లాలో ఆయకట్టు కలిగిన 1,125 చెరువులు, కుంటల తో పాటు ఆయకట్టులేని 96 కుంటలను మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించాల ని నిర్ణయించినా చాలావరకు ఇది నెరవేరలేదు. మిషన్ కాకతీయ పథకం ద్వారా మొదటి విడతలో 627 చెరువులు, కుంటల పునరుద్ధరణకు రూ.201 కోట్ల వరకు ఖర్చు చేయగా 66 చెరువుల పునరుద్ధరణ పూర్తికాలేదు. తొలి విడతలో చేపట్టిన పునరుద్ధరణను తర్వాత సంవత్సరాల్లోనూ కొంతమేరకు నిర్వహణ చేపట్టాల్సి ఉన్నా ఇవన్నీ అటకెక్కాయి. నాలుగో విడతలో 133 చెరువుల పునరుద్ధరణకు రూ.31.45 కోట్లతో పనులు చేపట్టినా వీటిల్లో చాలాపనులు అసంపూర్తిగానే ఉన్నాయి. 5వ విడతలో 130 చెరువులు, కుంటల పునరుద్ధరణకు అధికారులు ప్రతిపాదనలు పంపగా నిధులు విడుదల చేయక పనులు ప్రారంభించలేదు. గుత్తేదారు చేపట్టాల్సిన మూడు నాలుగేళ్ల నిర్వహణ పూర్తికాకుండానే నిధులివ్వక పథకాన్ని పక్కనబెట్టడంతో రెండు వానాకాలాల్లో భారీ వర్షాలతో కట్టలు తెగి తూములు, మత్తడివద్ద గండ్లుపడగా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. **ఆక్రమణలు తేల్చకుండానే..** చాలాచోట్ల చెరువుశిఖం భూములు ఆక్రమణకు గురికాగా ఫుల్‌ట్యాంకు లెవెల్ ప్రకారం చెరువుల హద్దులను తేల్చకుండా, ఆక్రమణల స్వాధీనం లేకుండానే పనులు చేపట్టారు. వందశాతం చెరువులకు జియోట్యాగింగ్ చేసినా హద్దులను మాత్రం పూర్తిస్థాయిలో తేల్చలేదు. జియోట్యాగింగ్ చెరువుల వివరాలను అంతర్జాలంలో జీపీఎస్ ద్వారా అక్షాంశ, రేఖాంశాల ద్వారా చెరువును చూపిస్తుంది. కట్టఎత్తు, మత్తడి, తూము, ఆయకట్టు తదితర అన్నివివరాలు ఇందులో ఉంటాయి. కానీ పూర్తిస్థాయిలో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోకుండానే జియోట్యాగింగ్ చేసినందున వివాదాలు సమసిపోలేదు. బడ్జెట్లో రూ.110 కోట్లు కేటాయించి ఇప్పటినుంచి వేసవి వరకు ప్రాజెక్టుల్లోని నీటిని చెరువుల్లోకి తరలించే తూముల నిర్మాణాలు పూర్తి చేయటం, మిషన్ కాకతీయ పనులపూర్తి, నిర్వహణ, దెబ్బతిన్న చెరువుల మరమ్మతు చేపట్టాల్సి ఉ ంది. **సాధ్యపడని నీటినిల్వ** జిల్లాలోని చెరువులు, కుంటల్లో నీటినిల్వ 5.57 టీఎంసీలుగా ఉన్నా పనులు పూర్తిగాక లక్ష్యం నెరవేరటంలేదు. మిషన్ కాకతీయ పథకం ద్వారా సగంమేరకు కూడా వీటిల్లో పునరుద్ధరణ చేపట్టలేదు. చెరువుల పునరుద్ధరణతో మీటరు మేరకు భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నా పనులన్నీ పూర్తయితేనే ఇది సాధ్యపడుతుంది. పూర్తివిస్తీర్ణం మేరకు పూడికను తీయకపోగా కట్టలపై మట్టిపోయటం, బండరాళ్ల తెట్టెలు కట్టడం, తూములు, మత్తడుల నిర్మాణం తదితర పనులు ఆశించినట్లుగా సాగకపోగా చాలాపనులను అలాగే వదిలేశారు. నీటివనరుల్లోకి వచ్చే కాలువలు శిథిలం కావటం, ఆక్రమణలకు గురికావటం, మరమ్మతు లేనందున ఆనవాళ్లు లేకుండాపోయి నీటినిల్వ సాధ్యపడటంలేదు. చెరువుల పరిధిలోని ఆయకట్టు విస్తీర్ణం: 58,847 ఎకరాలు

# అసంపూర్తిగానే ఆహ్లాదం

కరీంనగర్ : బుట్టిరాజరాంకాలనీలో కరోనా సమయంలో నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారు సిద్ధంగా ఉండగా ఆ దస్త్రం దొరకడం లేదని దాటేస్తున్నారు. దీంతో చేపట్టిన పనులూ అధ్వానంగా మారాయి. జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉట్టి పడేలా, ప్రజలకు ఉపయోగపడేలా పార్కులను తీర్చిదిద్దేలా చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో ఆహ్లాదం కనిపించకుండా పోతోంది. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి, అమృత్, ముఖ్యమంత్రి హామీ నిధులను కేటాయించారు. కొన్ని చోట్ల పనులను పూర్తి చేయగా, మరికొన్ని చోట్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.

**పూర్తయ్యేదెన్నడో?**

నగరవ్యాప్తంగా సుమారు 18 పార్కులకు రూ.7 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో కొన్ని ప్రాంతాల్లో పనులు ఇప్పటికీ పూర్తి



కావడం లేదు. పద్మనగర్‌లో సగం మేర పూర్తి చేయగా మిగతా పనుల బిల్లులు ఇవ్వకపోవడంతో ఆగిపోయాయి. హౌసింగ్ బోర్డుకాలనీలో వాచ్‌మెన్ క్వార్టర్ నిర్మించకుండా వదిలేశారు. బాత్‌రూం డోర్లు చెడిపోయాయి. బుట్టి రాజరాంకాలనీలో పనులు మధ్యలో ఆపేశారు. మరో పార్కులో బోర్‌వెల్ చెడిపోగా, ఆట పరికరాలకు మరమ్మతులు చేయడం లేదు. జ్యోతినగర్ శివ థియేటర్ వెనుకాల ఉన్న పార్కులో మొక్కలే లేవు.

**నిర్వహణ కొరవడి..**

న్యూశ్రీనగర్‌కాలనీ, బుట్టిరాజరాంకాలనీ, శివనగర్, అలకాపురి, సప్తగిరికాలనీ, ఏవోఎస్ కాలనీ, జడ్పీ క్వార్టర్స్, జ్యోతినగర్, చైతన్యపురి, బ్యాంకుకాలనీ, వావిలాలపల్లి, మంకమ్మతోట తదితర ప్రాంతాల్లో పార్కులు ఉన్నాయి. నిర్వహణ కొరవడి క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వానం గా తయారవుతోంది. పలుచోట్ల పిల్లల ఆట పరికరాలు విరిగిపోయా యి. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. చెత్తాచెదారం, పనికి రాని గడ్డి పెరగడంతో కొన్ని చోట్ల మూసేశారు. నిర్వహణ అనేదీ పూర్తిగా మర్చిపోయారు. పార్కుల స్థితిగతిపై సమీక్షిస్తామని.. నిధులతో సంబంధం లేని పనులు ఉంటే వెంటనే పూర్తి చేసేలా ఆదేశాలిస్తామని నగరపాలిక ఎస్ఈ రాజ్‌కుమార్ తెలిపారు.

# అనుసంధానం రోడ్డుకు మోక్షమెప్పుడో..!

ముస్తాబాద్ : సిద్దిపేట-రాజన్న సిరిసిల్ల జిల్లాలను అనుసంధానం చేసే రోడ్డు అధ్వానంగా తయారై వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డును పట్టించుకునే వారే కరవయ్యారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వరకు రెండువరసల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదలను పంపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్న క్రమంలో ప్రభుత్వం మారడంతో పరిస్థితి ఎప్పటిలాగే మారింది. రాజక్కపేట నుంచి దుబ్బాక వరకు ఇరువరసల రోడ్డు పనులు పూర్తయ్యాయి. ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి మోహినికుంట గ్రామశివారు వరకు మాత్రం పనులు చేపట్ట లేదు.



ఈ మార్గం అధ్వానంగా ఉండటంతో ఇరుజిల్లాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. **ఏళ్లు గడుస్తున్నా...**

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు మోహినికుంట శివారు వరకు గుంతలమయంగా మారి ఏళ్లు గడుస్తోంది. దీంతో రెండు జిల్లాల వాహనదారులు, ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. ముస్తాబాద్-దుబ్బాక రోడ్డు మంజూరు విషయంలో అప్పటి ప్రజాప్రతిని ధులు ప్రభుత్వానికి నివేదించారు. ముస్తాబాద్ నుంచి మోహినికుంట మీదుగా దుబ్బాక వరకు 2023 సంవత్సరంలో ఇరువరసల రోడ్డు నిర్మాణం మంజూరైంది. 14 కిలోమీటర్లకుగాను సుమారు రూ.26 కోట్లు, దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు 8.4 కిలోమీటర్లకుగాను రూ.12 కోట్ల నిధుల మంజూరు జరిగింది. కాగా దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు వరకు పనులు పూర్తికాగా ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు పనులు చేపట్టలేదు. నిధులు వెనక్కి వెళ్లడంతోనే పనులు జరగలేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

**తప్పని అవస్థలు**


రెండు జిల్లాలను కలిపే రోడ్డు మార్గం కావడంతో ప్రజలు, వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంతో పోలిస్తే ఈ మార్గంలో రాకపోకలు పెరిగాయి. వివిధ అవసరాల నిమిత్తం ప్రజల రాకపోకలు పెరిగాయి. రోడ్డు చాలాచోట్ల గుంతలమయం కావడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో వెళ్లాలంటే ఆందోళనకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి మోహినికుంట శివారు వరకు రెండు వరసల రోడ్డు మంజూరుకు కృషి చేయాలని కోరుతున్నారు.

**పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలి**

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో ముస్తాబాద్ నుంచి మోహినికుంట శివారు వరకు 5.6 కిలో మీటర్ల రెండువరసల రోడ్డుకు రూ.14 కోట్ల నిధులు మంజూరు చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంజూరైన నిధులు వెనక్కివెళ్లాయి. పార్టీలకతీతకంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు దృష్టిసారించాలి. నల్ల నర్సయ్య, మాజీ సర్పంచి, ముస్తాబాద్

# స్కాన్ చేద్దాం.. చూసొద్దాం

హైదరాబాద్: చార్మినార్ చూడాలంటే.. ముందుగా అఫ్జల్‌గంజ్ వద్ద మూసీ నదిని దాటుకుని మదీనా రోడ్డుకు చేరుకోవాలి. అక్కడి నుంచి పర్యాటకులు ఎవరి సాయమూ లేకుండా చార్మినార్‌తో పాటు చుట్టుపక్కలున్న పర్యాటక ప్రాంతాలన్నింటినీ చుట్టేయొచ్చు. అలాంటి సౌకర్యాన్ని డిజిటల్ సూచికల సాయంతో తీసుకొచ్చేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు చేపట్టింది. అన్ని బోర్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే.. సమీప పర్యాటక ప్రాంతాల వివరాలు, వాటిని చేరుకునే గూగుల్ మ్యాప్ లింకు అందుబాటులోకి




వస్తుంది. మొదట పాతబస్తీలో ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపట్టి, తర్వాత అన్ని పర్యాటక కేంద్రాల వద్ద, ప్రధాన రహదారులపై ఈ రకమైన సూచికలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో జీహెచ్‌ఎంసీ ఈ ప్రాజెక్టును చేపట్టబోతోంది. ఇప్పటికే మదీనా రోడ్డు, చార్ కమాన్ రహదారులను ప్రాథమికంగా గుర్తించారు. బోర్డులపై కొంత స్థలంలో ప్రకటనలు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థ ఆదాయం పొందుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

# చరవాణిలో ఇంటి అనుమతి

హైదరాబాద్ : కూర్చున్న చోటు నుంచే ఇంటి నిర్మాణ అనుమతి పొందవచ్చు. ఇలాంటి మరిన్ని ప్రయోజనాలు నూతన నిర్మాణ అనుమతుల విధానం 'బిల్డ్ నౌ'తో ప్రజలకు చేరువ కానుంది. చరవాణిలోనే బిల్డ్ నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు పరిశీలించి గరిష్ఠంగా 15 రోజుల్లోపు అనుమతి ఇస్తారని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఇది కృత్రిమ మేధతో పనిచేస్తుంది. ఇంటి స్థల విస్తీర్ణం 75గజాల్లోపు ఉంటే.. దరఖాస్తును సమర్పించగానే అనుమతి వచ్చేస్తుంది. ఈ కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదట జీహెచ్‌ఎంసీ పరిధిలో మార్చి 10 నుంచి కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఇవీ ప్రత్యేకతలు..**భవన నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌లు రూపొందించే డ్రాయింగే




ప్రామాణికం. ప్రస్తుత వ్యవస్థలో డ్రాయింగ్ పరిశీలనకు కొన్ని వారాల సమయం పడుతోంది. అది కాస్తా నిమిషాల్లోకి తగ్గనుందని అధికారులు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, టీడీసీపీ, ఇతర స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మూసీ నది అభివృద్ధి సంస్థ, తదితర శాఖలన్నీ బిల్డ్ నౌతో అనుసంధానమై ఉంటాయి.

దరఖాస్తు, వాటి స్థితిగతులు, ఏ అధికారి వద్ద పెండింగులో ఉంది, ఇతరత్రా వివరాలను దరఖాస్తుదారు తెలుసుకోవచ్చు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో సమాచారం ఉంటుంది. సామాన్యుడు సైతం.. తనకున్న ఇంటి స్థలంలో ఎన్ని అంతస్తులు కట్టుకోవచ్చు, సెట్ బ్యాక్ ఎంత వదలాలి, దరఖాస్తు విధానం గురించి వెబ్‌సైట్‌లోనే వివరాలు పొందవచ్చు. ప్రశ్నను పొందుపరిస్తే.. ప్రభుత్వ ఉత్తర్వులు, వాటి నిబంధనలతో సూచనలు వస్తాయి. డ్రాయింగ్ ప్రకారం 3డీ ఇంటి నమూనాలను కూడా చూడొచ్చు.

# తప్పొకరిది.. శిక్ష మరొకరికి

హైదరాబాద్ : గతంలో ఇంటి నంబర్ల కేటాయింపుల్లో తీసుకొచ్చిన విధానం కొత్త చిక్కులను తెచ్చిపెట్టింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తిపన్ను స్వీయ మదింపు ఏప్రిల్, 2022లో మొదలైంది. ఆటో అప్రూవల్ విధానంలో ప్రతీ దరఖాస్తు ఆమోదం పొందింది. ఇంటి నంబరు, పీటీఐఎన్ నంబరు జారీ అయ్యాయి. కొన్ని రోజులకే ఆ విధానం పక్కదారి పట్టింది. తెల్ల కాగితాలు, నోటరీ పత్రాలు సమర్పించి వేలాది మంది నంబర్లు పొందారు. దీంతో ఏప్రిల్, 2022 నుంచి జనవరి 2023 మధ్య జారీ అయిన 25 వేల నంబర్లను అప్పటి కమిషనర్ లోకేష్ కుమార్ రద్దు చేశారు. ఇందులో సరైన పత్రాలు, అన్ని అర్హతలున్న సుమారు 5 వేల నంబర్లను రద్దు చేయడంతో వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



**ప్రజావాణిలోనూ వినట్లేదు..**

యూసఫ్‌గూడలోని మోతినగర్ జనప్రియ క్లాసిక్ మెట్రోపాలిటన్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశారు. రెండుసార్లు ఆస్తిపన్ను సైతం చెల్లించారు. తర్వాతి ఏడాది పన్ను చెల్లిద్దామంటే ఇంటి నంబరు రద్దయినట్టు తేలిసింది. ప్రజావాణిలో విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. ఇలాంటి సమస్యలపై దాదాపు 250 అర్జీలు అధికారుల వద్ద మూలుగుతున్నాయి. ఫిర్యాదు చేయకుండా.. దళారులు, కింది స్థాయిలోని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు లంచాలు ఇచ్చి మోసపోయిన బాధితులు వెయ్యికిపైగా ఉంటారు.

# బ్రో..సాహసానికి సిద్ధమా



హైదరాబాద్ : పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసేలా.. వివిధ సాహస క్రీడలతో ప్రత్యేక జోన్ త్వరలో అందుబాటులోకి రానుంది. కొత్వాల్‌గూడలోని ఎకో పార్కులో ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి హెచ్‌ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) ప్రాతిపదికన తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డెవలపర్స్ ఎంపిక కోసం తాజాగా హెచ్‌ఎండీఏ ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) నోటిఫికేషన్ జారీ చేసింది. పలు సంస్థలు ఇందులో పాల్గొని డిజైన్లు రూపకల్పన చేసే అవకాశం ఉంది. టెండర్ల అనంతరం ఏడాదిలోగా అందుబాటులోకి వచ్చేలా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. అవుటర్ రింగ్ పరిధిలోని హిమాయత్‌సాగర్ పక్కన 85 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ఎకో పార్క్ అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఇప్పటికే పక్షిశాల సిద్ధమైంది. దేశవిదేశాల నుంచి దాదాపు 1500 రకాల పక్షులను సేకరించి ఇక్కడి వాతావరణానికి అలవాటు చేస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రోజంతా అక్కడే గడిపేలా వివిధ రకాల సాహస క్రీడలను రూపొందిస్తున్నారు. ఈ అడ్వెంచర్ జోన్‌కు రూ.15 నుంచి రూ.20 కోట్లు అవుతుందని అంచనా.

**నాలుగు ప్రాంతాలను కలుపుతూ..**

అడ్వెంచర్‌జోన్‌తోపాటు నాలుగు కీలక పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక సర్క్యూట్(హారం) ఏర్పాటు చేసేందుకూ హెచ్‌ఎండీఏ తాజాగా ఈవోఐ ఆహ్వానించింది. బాపూఘాట్, తారామతి బారాదరి, మంచిరేవుల వద్ద ఫారెస్టు పార్కు, కొత్వాల్‌గూడ ఎకోపార్కులను ఇందులో చేర్చనున్నారు. పశ్చిమ హైదరాబాద్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలను కలుపుతూ ఒక సర్క్యూట్ కింద మార్చి ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించడం, రవాణా ఇతర అన్ని సానుకూలతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ప్రధాన బాపూఘాట్ వద్ద అతిపెద్ద గాంధీ విగ్రహం నెలకొల్పడమే కాకుండా.. పర్యాటకులకు ఆకట్టుకునేలా పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు ఉన్నాయి.

అడ్వెంచర్ జోన్‌లో వచ్చే క్రీడలు..

- స్కై వంతెన
- రోలర్ కోస్టర్
- జిప్‌లైన్, క్లైంబింగ్‌వాల్
- జాయింట్ స్వింగ్, సస్పెన్షన్ బ్రిడ్జి
- ఫ్లయింగ్ కప్, హ్యూమన్ స్లింగ్‌షాట్
- జిప్ బైక్, 360 డిగ్రీల ఫ్లైయింగ్ సైకిల్
- రోప్ కోర్సు, బంగీ ట్రంప్‌లైన్

# ఎండకు ఎండాల్సిందే




హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న వేళ ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అవసరమైన బస్‌షెల్టర్లు లేక ఎండలో నిరీక్షిస్తున్న పరిస్థితి. పేరుకే ఉన్న కొన్ని ఏసీ బస్‌షెల్టర్లు మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల విద్యుత్తు సరఫరా లేక పాడైన ఫ్యాన్లు, ఏసీలు దర్శనమిస్తున్నాయి. గ్రేటర్‌లో 2800కి పైగా బస్సుల్లో నిత్యం 20లక్షల మంది ప్రయాణాలు సాగిస్తుండగా 2200 బస్‌షెల్టర్లకు 1370 మాత్రమే ఉన్నాయి. 200 ప్రాంతాల్లో నిర్మించడం తప్పనిసరి అంటూ గ్రేటర్ ఆర్టీసీ అధికారులు జీహెచ్‌ఎంసీకి విన్నవించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

**ఆరు బయటే నిరీక్షణ..**

మెహిదీపట్నంలో రైతుబజార్ వైపు ఉన్న బస్‌షెల్టర్లలో విరిగిన కుర్చీలు, బల్లలే దర్శనమిస్తున్నాయి. ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రయాణికులు ఎక్కడ బస్సు ఎక్కుతారో సర్వే చేయకుండా బస్‌షెల్టర్లు నిర్మించడంతో చాలావరకు నిరుపయోగంగా మారిపోయాయి. హిమాయత్‌నగర్ రోడ్డు, నారాయణగూడ, కాచిగూడ, అమీర్‌పేట, కోఠి, ఉప్పల్, బీహెచ్‌ఈఎల్ మార్గంలో అవసరమైన చోట షెల్టర్లు లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి నిర్మించారు. లింగంపల్లి నుంచి చందానగర్ మార్గంలోనూ కొత్తగా నిర్మించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఫలక్‌నుమా ఇంజిన్‌బౌలి మార్గంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏసీ బస్‌షెల్టర్ల పరిస్థితి..

డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ (డీబీఎఫ్‌వోటి) పద్ధతిలో ఏసీ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎస్పీరోడ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, మలక్‌పేట్‌లోని ఏసీ బస్‌షెల్టర్లలో నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. డిజైన్‌లోపం ఉండటం, వచ్చే బస్సులు కనిపించకపోవడంతో షెల్టర్ బయటే వేచి చూస్తున్నారు. కొన్నిచోట్ల దుకాణాలకు అద్దెకిచ్చారే తప్ప నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కూకట్‌పల్లిలో రాత్రయితే మందుబాబులు ఇందులో తిష్ఠవేస్తున్నారు.

# కాచిగూడ.. ఏదీ ఆధునికీకరణ జాడ?



కాచిగూడ : నగరంలోని ప్రముఖమైన కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ ప్రతిపాదనను రైల్వే బోర్డు వెనక్కి పంపింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే, గతిశక్తి విభాగం అధికారులు మార్పులుచేర్పులపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రూ. 750 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అన్నిహంగులతో తీర్చిదిద్దుతున్నారు. అదేతరహాలో కాచిగూడ స్టేషన్‌నూ అభివృద్ధి చేయాలని మూడేళ్లక్రితం ప్రతిపాదించారు. ఈ మేరకు రూ. 450 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రైల్వే బోర్డుకు పంపారు. సంబంధిత అంచనా వ్యయాన్ని తగ్గించాలని కోరుతూ.. ప్రతిపాదనను వెనక్కి పంపించారు.

అన్నీ ఇబ్బందులే..: రైళ్ల సంఖ్యకు అనుగుణంగా కాచిగూడ స్టేషన్ ప్రాంగణంలో.. స్టేబుల్, ఫిట్‌లైన్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్లాట్‌ఫారాల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఐదు ప్లాట్‌ఫారాలే ఉన్నాయి. అదనంగా 6-7 ప్లాట్‌ఫారాలను నిర్మించాల్సి ఉంది. కొన్నింటిపై లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లనూ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల సందర్శన**

రైళ్లు సులువుగా రాకపోకలు సాగించేలా స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న బ్రిడ్జిలను సైతం విస్తరించాల్సి ఉంది. ఆధునికీకరణతోనే ఇవన్నీ సాధ్యమని అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదనను బోర్డు వెనక్కి పంపిన నేపథ్యంలో.. గతిశక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్(సీపీఎం) ఏకేసింగ్ నేతృత్వంలో అధికారుల బృందం కాచిగూడ స్టేషన్‌ను ఇటీవల సందర్శించి మార్పులపై కసరత్తు చేపట్టింది.

రోజువారీ రైళ్లు :100
ప్రయాణికులు :45 వేలు
వార్షికాదాయం : రూ. 90 కోట్లకు పైగా
ఆధునికీకరణ వ్యయం : రూ. 450 కోట్లు

# జన సాంద్రత.. నేర తీవ్రత

హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో నేరాల సంఖ్య పెరుగుతోంది. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి ఠాణాలో జనవరి, ఫిబ్రవరిలో 336 కేసులు నమోదయ్యాయి. సగటున రోజుకు 5 రికార్డయ్యాయి. నార్సింగి ఠాణా పరిధిలో 2 నెలల్లో 389 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం వల్లే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నమ్మకద్రోహం (చీటింగ్), ఆర్థిక తగాదాలు, ఉద్యోగ మోసాలు, అదృశ్యం, రోడ్డు ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. విభజిస్తేనే తగ్గుదల గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండేది. కొత్తగా ఫిల్మ్‌నగర్, మధురానగర్, బోరబండ ఠాణాలు రావడంతో కేసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఐటీ కారిడార్‌లో కొత్తగా కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఠాణాలను ప్రతిపాదించారు. అవి వస్తే నిఘా పెరిగి నేర నియంత్రణ సులువుగా మారుతుందని అధికారులు తెలిపారు.



జనసాంద్రత అంతర్జాతీయ, దేశీయ సంస్థలు.. భిన్న ప్రాంతాల ప్రజలు.. అత్యధిక జనసాంద్రత.. వీటితోపాటే ఆర్థిక వివాదాలు.. సైబర్ నేరాలు ఐటీ కారిడార్‌లో ఎక్కువ నేరాల నమోదుకు కారణమవుతోంది. ఇక్కడితో పోలిస్తే జగద్గిరిగుట్ట, రాజేంద్రనగర్ ఠాణాల పరిధిలో జనసాంద్రత ఎక్కువ. ఇతర రాష్ట్రాల కూలీలు ఉంటున్నారు. ఇలాంటి చోట్ల సైబర్ నేరాలు, ద్విచక్రవాహనాల చోరీలు, ఆర్థిక తగాదాలు తక్కువగా ఉంటాయి. ఐటీ కారిడార్ పరిధిలోని మూడు ఠాణాల పరిధిలో అత్యధికులు విద్యావంతులు. ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తుండటంతో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు దశలో రాజీ ప్రయత్నాలు జరిగేవని హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 2 వేల ఐటీ సంస్థలు పనిచేస్తుంటే సుమారు 95 శాతానికి పైగా ఐటీ కారిడార్ కేంద్రంగానే నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 5 లక్షల మందికిపైగా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో నేరాలివీ..

గచ్చిబౌలి 336 మాదాపూర్ 314 రాయదుర్గం 173 నార్సింగి 389

# తీరు మారితే.. తీరుతుంది దాహార్తి

తాండూరు, పరిగి: ప్రజల దాహార్తిని తీర్చిడానికి ప్రభుత్వం పంప్‌హౌస్‌లు, తాగునీటి ప్రాజెక్టులు చేపడుతోంది. వీటి నిర్వహణ సక్రమంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి తనిఖీలు చేపట్టక పోవడం, అవసరమైన మరమ్మతులు నిర్వహించక పోవడం తదితర కారణాలతో పథకాలు వృథాగా మారుతున్నాయి. నిదర్శనంగా నిలుస్తున్నాయి ఈ పంప్‌హౌస్‌లు.

**కాగ్నా నది ఆధారంగా రెండు ఏర్పాటు**

తాండూరు పట్టణానికి కాగ్నానది ఆధారంగా తాగునీటిని సరఫరా చేసే రెండు పంప్‌హౌస్‌లు గడచిన మూడేళ్లకు పైగా మూత పడ్డాయి. వినియోగంలోకి తీసుకు వస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. పట్టణంలోని 36 వార్డుల్లో 14వేల గృహాల్లో నివాసం ఉండే 71,008 జనాభాకు నిత్యం 8.5 ఎం.ఎల్.డి (మిలియన్ లీటర్స్ పర్ డే) తాగు తాగునీరు అవసరం. కానీ 6.5 ఎం.ఎల్.డి.మాత్రమే సరఫరా అవుతోంది.



**రహదారి నిర్మాణం పేరుతో పైప్‌లైన్ తొలగింపు**

కాగ్నానది వంతెన సమీపం నుంచి కొడంగల్ నియోజకవర్గం గ్రామాలు, యాలాల మండలంలోని 39 గ్రామాలకు కలిపి తాగునీటిని సరఫరా చేయడానికి 1999లో రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పంప్‌హౌస్ తాత్కాలికంగా మూత పడింది. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌను గతేడాది వినియోగంలోకి తీసుకు వచ్చి నీటిని సరఫరా చేశారు. అయితే తాండూరు నుంచి కొడంగల్ వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల నేపథ్యంలో నీటి సరఫరా పైపులైన్‌ను తొలగించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పనులను పూర్తి చేసి కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే పంప్‌హౌస్ వినియోగంలోకి వస్తుంది. ప్రజలకు తాగునీటి సరఫరా జరిగి ఎద్దడి సమస్య ఉండదు. ఇందుకోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

**సుదీర్ఘ కాలంగా సేవలు**

1953లో పాత తాండూరు కాగ్నానది వారగా అప్పటి ప్రజల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ నుంచి నాలుగేళ్ల కిందటి వరకు సరిపోను నీటి సరఫరా జరిగింది. నిర్వహణ సవ్యంగా లేక పోవడంతో మరమ్మతుకు వచ్చింది. పట్టణానికి 24 గంటల పాటు నీటిని సరఫరా చేసే పంప్ ఆధారిత ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఉన్నాయి. యాలాల మండలం బెన్నూరు శివారు కాగ్నానది వారగా తాండూరు పట్టణానికి నీటిని సరఫరా చేసే మరో పంప్ హౌస్‌ను 2005లో రూ.5.80 కోట్లతో నిర్మించారు. నిర్వహణ సవ్యంగా లేక నిరుపయోగమైంది. ప్రస్తుత వేసవిలో ఈ రెండు పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే 2ఎం.ఎల్.డి. నీటి సరఫరా జరిగి ప్రజల దాహార్తి తీరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# లక్షణమైన నంబరు

మెదక్ : వాహనాలకు ఫ్యాన్సీ నంబరు పొందేందుకు యజమానులు పోటీపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ నిర్వహించే ఆన్‌లైన్ వేలంలో రూ.లక్షల్లో పోసి నచ్చిన నంబర్లు దక్కించుకున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం గతేడాది మార్చి 15వ తేదీన కొత్త కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాటి నుంచి రవాణాశాఖకు కాసుల వర్షం కురుస్తోంది. పది నెలల్లోనే జిల్లాలోని మెదక్ ఆర్టీఏ కార్యాలయానికి 829 ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.46,82,021 ఆదాయం సమకూరింది.



**వేలంలో నంబర్ దక్కించుకొని**

వాహనాలకు ఫ్యాన్సీ, లక్కీ, పుట్టిన రోజులు వచ్చేలా నంబర్లు తీసుకుంటున్నారు. దీనికోసం రూ.లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి 6666 నంబరుకు రూ. 1,55,678 వెచ్చించి వేలం పాటలో దక్కించుకున్నాడు. వేలంలో పాల్గొనే వ్యక్తుల సంఖ్య తెలియదు. దీంతో కేవలం నంబర్లను చూసి ఒకే వ్యక్తి ఎక్కువ బిడ్లు వేసి వాటిని దక్కించుకుంటున్నారు.మెదక్‌లో టీజీ ఫ్యాన్సీ నంబర్లతో 829 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 6666 నంబర్‌ను రూ. 1,55 ,678.. 5555 నంబర్‌ను రూ. 1,53,500.. 9099 నంబర్‌ను రూ. 71,555కు కొనుగోలు చేశారు.

**ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయాలి**

ఆన్‌లైన్‌లో బిడ్లు నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎక్కువ మొత్తం బిడ్ వేసిన వారికి సంబంధిత నంబరును రిజర్వు చేస్తారు. దాని ప్రకారం వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంటుంది. ఈ విధానంతో రవాణాశాఖకు భారీగా ఆదాయం సమకూరుతోంది.వెంకటస్వామి, జిల్లా రవాణా శాఖాధికారి

# కంది.. కొనరేంది?

చేర్యాల: పది రోజుల క్రితం కందుల కొనుగోలు కేంద్రాన్ని పోటీ పడి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఇప్పటివరకు కందుల కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించలేదు. ఎవరూ పట్టించుకోవటం లేదు. చేర్యాలో కాంగ్రెస్, భారాస ప్రజాప్రతినిధులు, నాయకులు ఒకేరోజు రెండుసార్లు కందుల కొనుగోళ్లు ప్రాంభించారు. కందులను తీసుకొచ్చిన రైతులు వ్యవసాయ మార్కెట్, అటు పీఏసీఎస్ పాలకవర్గాల పనితీరుతో అసహనానికి గురవుతున్నారు. రోజూ వాటిని ఆరబోయడం, రాశి పోయడం చేస్తున్నారు. కొందరు రైతులు వాపసు తీసుకెళ్లి వ్యాపారులకు అమ్ముకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కకుండా పోతోంది. ఈ విషయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి దృష్టికి ఆకునూరు రైతులు ఇటీవల తీసుకెళ్లారు. వెంటనే పీఏసీఎస్ అధికారికి ఆయన ఫోన్ చేసి ఆరా తీశారు. తూకం వేసి కొనుగోలు అనుమతి ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన కందులను సేకరిస్తామని సీఈవో రాములు తెలిపారు. ఆరబోసి, చెత్త లేకుండా నాణ్యత పాటించాలన్నారు.

నమోదు చేయలేదు: ఎల్లయ్య, ధర్మారం, మద్దూరు మండలం

మాది మద్దూరు మండలం ధర్మారం. సొంత భూమిలో 3 ఎకరాల్లో కంది సాగు చేశా. అధికారులు రికార్డుల్లో నమోదు చేయలేదు. నా పేరున రాసివ్వమని మద్దూరులో వ్యవసాయాధికారులను అడిగితే చేర్యాలకు వెళ్లమంటున్నారు. చేర్యాలకు వస్తే మద్దూరు మండల వ్యవసాయాధికారులే ఇవ్వాలంటున్నారు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.కాపలా ఉండలేం: తరిగొప్పుల సత్తవ్వ, ముస్త్యాల, చేర్యాల మండలంకందుల సేకరణ చేపట్టగానే మార్కెట్‌కు తేవాలని పది రోజులుగా ఎదురుచూస్తున్నాం. రెండు రోజుల క్రితం పంట తెచ్చాం. వాటికి కాపలా ఉండలేకపోతున్నాం. ఎప్పటికప్పుడు సేకరిస్తే సమస్య ఉండదు. అందరివీ కొనుగోలు చేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

# ఆగని అక్రమ దందా..!

ఖమ్మం : గ్రానైట్, కంకర క్వారీల నిర్వహణతో రూ.కోట్లు కొల్లగొడుతున్న యజమానులు.. రాయల్టీ చెల్లించకుండా వక్రమార్గాలు అనుసరిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. దొడ్డిదారిన క్వారీలు నిర్వహిస్తూ.. 'నాన్ వర్కింగ్' అని చూపుతూ రాయల్టీ చెల్లించకపోవటాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉల్లంఘనులపై కొరడా ఝులిపించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించుతోంది.

**త్వరలోనే రంగంలోకి..**

రాష్ట్రవ్యాప్తంగా 261 క్వారీలు 'నాన్ వర్కింగ్' జాబితాలో ఉన్నట్లు గనులశాఖ గుర్తించింది. వీటిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని క్వారీలు సుమారు 40 ఉన్నాయని తేల్చింది. కొన్నేళ్లుగా ఆయా క్వారీల్లో ఎలాంటి కార్యకలాపాలు జరపటం లేదని.. వాటి యజమానులు గనులశాఖకు స్పష్టం చేశారు. గనులశాఖ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే 'నాన్ వర్కింగ్' జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఆయా క్వారీల యజమానులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించటం లేదు. గనులశాఖ నుంచి ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంపై కాంగ్రెస్ సర్కారు సమీక్షలు నిర్వహించింది. గతంలో గ్రానైట్, కంకర క్వారీల యజమానులు మైనింగ్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడ్డట్టు భూగర్భగనులశాఖ దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న క్వారీలు, ఉల్లంఘనలకు పాల్పడుతున్న యజమానులపై కొరడా ఝులిపించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించి క్వారీల్లో సాగుతున్న అక్రమాలు, ఉల్లంఘనల నిగ్గు తేల్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణా, అటవీశాఖల అధికారుల తో టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది.

**అనేక చోట్ల ఉల్లంఘనలు**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక క్వారీల్లో ఏళ్లుగా ఉల్లంఘనల తంతు కొనసాగుతోంది. నిషేధిత జాబితాలోని క్వారీల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. కొంతమంది నిర్వాహకులు తమ క్వారీలు పని చేయటం లేదని చూపుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు. అనుమతి తీసుకున్న విస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని క్వారీల విషయంలో లెక్కాపత్రమే లేకుండా పోయింది. లీజుల విషయంలోనూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా మైనింగ్‌శాఖ ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. క్వారీల్లో లోపలికి, బయటకు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు అమర్చాలనే నిబంధన ఉన్నా విస్మరిస్తున్నారు. నిషేధిత జాబితాలోని క్వారీలు విద్యుత్తు సౌకర్యం పొందుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన కొంతమంది అధికారులు ఏళ్లుగా అక్రమాలకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తాజాగా టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించటంతో ఉల్లంఘనుల బండారం బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రానైట్, కంకర క్వారీల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పడింది. జిల్లాలోని ఐదు ప్రధాన శాఖల అధికారులు బృందంలో ఉంటారు. ఉన్నతాధికారులు అందించిన జాబితా ప్రకారం బృంద సభ్యులు ఆయా క్వారీల్లో తనిఖీలు చేపట్టనున్నారు. పని చేయని జాబితాలో ఉన్నాయా, పనిచేస్తున్నా నిర్వాహకులు రాయల్టీ ఎగ్గొడుతున్నారా అనే అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. సాయినాథ్, మైనింగ్‌శాఖ ఏడీ, ఖమ్మం

# పల్లె పోరు.. కసరత్తు షురూ..



వికారాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పల్లె పోరుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా జిల్లా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

నెలాఖరుకు ప్రకటన రానుందనే సమాచారంతో..

ఈ నెలాఖరు నాటికి గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందన్న సమాచారంతో అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకునే పనిలో ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ డబ్బాలు, బందోబస్తుకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

శ్రేణులకు పార్టీల సంకేతాలు: పంచాయతీ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ నేతలు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణులను సిద్ధంగా ఉండాలనే సంకేతాలు ఇచ్చారు.

పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి స్థానిక సంస్థలపై పట్టు సాధించాలని భారాస భావిస్తోంది.

భాజపా కూడా సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది.

**మూడు విడతలకు అవకాశమా..**

జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరిగితే బాగుంటుందని అధికారులు నిర్ధారణకు వచ్చి నివేదిక రూపొందించినట్లు సమాచారం. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కొందరు తెలిపారు.

**కలెక్టర్ ఈవీఎంల పరిశీలన**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పాలనాధికారి ప్రతీక్‌జైన్, జిల్లా పోలీసు అధికారి నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పంచాయతీ ఎన్నికల కోసం జిల్లాలో అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని కలెక్టర్ ఒకసారి పరిశీలించి సంతకం కూడా చేశారు.

జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల వివరాలతో పాటు గతంలో చోటు చేసుకున్న గొడవలు జరిగిన గ్రామాల వివరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

జిల్లాలో అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ఎన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారనే విషయాలను సేకరిస్తున్నారు. పంచాయతీ నోటిఫికేషన్ వెలువడగానే పలువురు సిబ్బందిని బదిలీ చేయడానికి వీలుగా అవసరమైన వివరాలు సేకరిస్తున్నారు.

ఒకే విడత పోలింగ్ నిర్వహించాల్సి వస్తే.. ప్రస్తుతం ఉన్న యంత్రాంగం సరిపోతుందా..? ఇంకా ఎంత మంది కావాలని లెక్కిస్తున్నారు.

జిల్లా సమగ్ర స్వరూపం

గ్రామ పంచాయతీలు.. 566

వెన్యూ డివిజన్లు.. 501

రెవెన్యూ గ్రామాలు.. 20

మొత్తం జనాభా.. 12.45 లక్షలు

ఓటర్లు... 10 లక్షలు

వీరిలో పురుషులు.. 4,92,623

మహిళలు..5,07,64

# ఆశావహులకు సదవకాశం



పెద్దపల్లి : ఆర్మీలో చేరాలనుకునే యువతను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అగ్నివీర్ ఎంపికలో అవసరమైన సామర్థ్యాల సాధనకు ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణ అందించనుంది. ఇందుకోసం కలెక్టర్ శ్రీహర్ష చొరవ చూపారు. రెండు నెలల పాటు ఉచిత భోజన వసతితో కూడిన మెరుగైన తర్ఫీదు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామాల్లో ఆసక్తి కలిగిన యువత నుంచి కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అగ్నివీర్ అర్హత పరీక్షకు వెళ్లి నిరాశ చెందకుండా ముందుగానే దేహ దారుఢ్యం, మానసికంగా సిద్ధం చేసేలా శిక్షణ ఇస్తారు.

**వ్యసనాల బారిన పడకుండా..**

పల్లెల్లో సరైన మార్గ నిర్దేశం లేక చాలా మంది యువత అర్ధంతరంగా చదువులు ఆపి వ్యసనాల బారిన పడుతున్నారు. గంజాయి, మాదకద్రవ్యాల మత్తులో పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఆర్థిక, కుటుంబ పరిస్థితులతో ఇంటర్, డిగ్రీతోనే చదువు ఆపి సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో దేశభక్తి, జాతి సమైక్యతను పెంపొందించి వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు అగ్నివీర్‌లో చేరేలా ప్రోత్సహిస్తున్నారు.

**దరఖాస్తు గడువు 10**

జిల్లాలో పోలీసుల సహకారంతో దాదాపు 200 మందికి ఉచిత శిక్షణ ఇస్తారు. 2004 ఫిబ్రవరి 20, 2007 ఆగస్టు 20 మధ్యలో జన్మించిన వారిని అర్హులుగా గుర్తించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 10 వరకు దరఖాస్తు గడువుంది. అగ్నివీర్ నియామకాల కంటే ముందే అభ్యర్థులను జిల్లా స్థాయిలో పరీక్షకు సిద్ధం చేస్తారు. ఎంపికైన యువత ఆర్మీలో నాలుగేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు. ఉద్యోగ విరమణ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగవకాశాలుంటాయని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అర్హత సాధిస్తేనే ఎంపిక

ఉచిత శిక్షణకు ప్రాథమిక దశలోనే దరఖాస్తుదారుల్లో వడబోత నిర్వహిస్తారు.

ఎనిమిది, పదో తరగతి చదివిన వారు అర్హులు.

విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలనతో పాటు 18 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

400 మీటర్ల పరుగు పందెం, వంద మార్కులకు అర్హత పరీక్ష ఉంటుంది.

అన్నింటిలో అర్హత సాధించిన వారిని ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారు.

నిపుణులు, వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మెలకువలు నేర్పిస్తారు.

అగ్నివీర్ సామర్థ్యాలను నేర్పిస్తూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతారు.

సద్వినియోగం చేసుకోవాలి

సైన్యంలో చేరాలనుకునే వారికి మంచి అవకాశం. కలెక్టర్ ఆదేశాలతో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇందుకోసం ముందుగా అన్ని రకాల అర్హత పరీక్షలు నిర్వహిస్తాం. ఫిజికల్ ఫిట్‌నెస్, ఇతర పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రెండు నెలల పాటు నైపుణ్య శిక్షణ ఉంటుంది.

–సురేష్, జిల్లా యువజన సర్వీసులు క్రీడా శాఖ అధికారి

# స్వచ్ఛత దిశగా అడుగులు

కరీంనగర్ : స్వచ్ఛతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి.. ఎక్కడ పడితే అక్కడ మలమూత్ర విసర్జన చేయకుండా ప్రజావసరాలకు తగ్గట్లుగా టాయిలెట్లు ఉండాలనే లక్ష్యంగా వీటిని నిర్మించేందుకు నిధులు కేటాయించాయి.నగరాలు, పురపాలికల్లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో గత ప్రభుత్వంలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించగా.. తాజాగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ 2.0లో పథకంలో భాగంగా కొత్తగా మరుగుదొడ్లను నిర్మించేందుకు ముందుకొచ్చింది. అవసరమున్న ప్రాంతాల్లో వీటిని నిర్మించుకునే వీలుంది. గతంలో నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన పనులు కూడా పూర్తి చేసుకునేందుకు ప్రతిపాదనలు చేసుకోవచ్చు. 16 పురపాలికల్లో 152 సీట్లతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80 కోట్లు కేటాయించారు.

**అవసరమున్న చోట మరుగుదొడ్లు**

ప్రభుత్వ స్థలాలు ఉన్న చోటనే వీటిని ప్రతిపాదిస్తుండగా జన సంచారం ప్రాంతాల్లో నిర్మించాలనే డిమాండ్ ఉంది. జనం లేని చోట నిర్మిస్తే రోజుకు కనీసం పది మంది కూడా ఉపయోగించుకోవడంలేదు. అవి




నిరుపయోగంగా ఉండి, నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం అలా చేయకుండా చూడాల్సిన అవసరముంది. ఈ విషయాన్ని శానిటేషన్ అధికారి దృష్టికి తీసుకెళ్లగా కొత్త నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**జనాభాకు తగ్గట్లుగా నిర్మాణాలు..**స్వచ్ఛ భారత్ నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక సీటు చొప్పున ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలి. కరీంనగర్‌లో 2011 జనాభా ప్రకారం 24 ప్రజా మరుగుదొడ్లు ఉన్నాయి. మిగతా పట్టణాల్లో ఆ స్థాయిలో నిర్మించకపోవడం, ఉన్న చోట్ల పనులు ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2026 సంవత్సరం నాటికి జనాభాను అంచనా వేసి మరుగుదొడ్ల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. స్థలాల ఎంపిక సవాల్‌గా మారింది.

# దారులు విస్తరిస్తూ.. వారధులు విస్మరిస్తూ

పెద్దపల్లి: గ్రామీణ ప్రాంత రహదారులను విస్తరిస్తున్నా ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకపోవడంతో సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. అవసరమైన ప్రాంతాల్లో వంతెనలు, కల్వర్టులు నిర్మించకపోవడంతో ఇరుకు దారుల్లో వాహనాల రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం పలు మండల కేంద్రాలను పెద్దపల్లికి అనుసంధానించేలా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో పెద్దపల్లి నుంచి కొలనూర్ మీదుగా ఓదెలకు చేపట్టిన పనుల్లో ఒక్క వంతెన మాత్రమే అభివృద్ధికి నోచుకోగా, మిగిలిన వారధుల వద్ద అవస్థలు తప్పడం లేదు.

**ప్రాధాన్య క్రమంలో అనుమతి**

రహదారి విస్తరణ చేపట్టిన ప్రాంతాల్లో పాత బ్రిడ్జిలు 7.5 మీటర్ల వెడల్పున్న చోట ఇబ్బందులు లేవు. వంతెనలు, కాజ్‌వేలు ఇరుకుగా ఉన్న చోట కొత్త వంతెనల నిర్మాణానికి 40 ప్రతిపాదనలు రూపొందించాం. ప్రాధాన్య క్రమంలో వీటన్నింటికీ అనుమతి వస్తుంది. ప్రస్తుతం దస్తగిర్‌పల్లి–కొత్తపల్లి మధ్య కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మిస్తున్నాం.

–బావ్‌సింగ్, ఆర్‌అండ్‌బీ ఈఈ

**పనులకు ప్రయోజనమేదీ!**

పెద్దబొంకూర్ సమీపంలోని హుస్సేన్‌మియా వాగు వంతెనపై సైడ్‌వాల్



నిర్మించలేదు. కేవలం దిమ్మెలు మాత్రమే ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ప్రమాదాలకు ఆస్కారముంది. ఏటా వానాకాలంలో వంతెనపై తరచూ నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ సైడ్‌వాల్ నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది.

కొత్తపల్లి వద్ద గతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇటీవల నీళ్లు నిలవకుండా మరమ్మతు పనులు చేపట్టారు. ఇక్కడ కూడా ఒకే వాహనం వెళ్లేంతగా స్థలం ఉంది. విస్తరణ పనులకు అనుగుణంగా రెండు వరుసల ఆర్‌యూబీ నిర్మిస్తే వాహనదారులకు అనుకూలంగా ఉంటుంది.జూలపల్లి నుంచి పెద్దపల్లి మార్గంలోనూ పలు చోట్ల వంతెనలు, కల్వర్టులు ఇరుకుగా ఉన్నాయి. జూలపల్లి, వడ్కాపూర్ మధ్య కాజ్‌వే వద్ద రహదారి విస్తరణ పనులకు అనుగుణంగా వంతెన నిర్మించాలి.వడ్కాపూర్, కాచాపూర్ మధ్య వంతెన ఇరుకుగా ఉండటంతో రెండు వైపులా రహదారిని విస్తరించినా ప్రయోజనం లేకుండా పోతోంది.

# చక్కని దస్తూరి.. మార్కుల దిక్సూచి

వెల్గటూరు: చక్కని చేతిరాత విద్యార్థుల ఉన్నత భవితకు ఎంతో తోడ్పాటునిస్తుంది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మార్కుల సాధనకు అందమైన దస్తూరి దోహదం చేస్తుంది. మొదటిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు మార్కుల సాధన, చేతిరాత పట్ల కొంత ఆందోళన ఉంటుంది. దీనిని అధిగమించేందుకు చేతిరాతను సాధన చేయాల్సిన అవసరం ఉంది. 'ఒక్కసారి రాసింది.. వందసార్లు చదివిన దానితో సమానం' రాస్తూ చదవడం వల్ల విద్యార్థులకు ఏకకాలంలో రెండు ప్రయోజనాలు చేకూరుతాయి. మార్చిలో జరగబోయే పది, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక కథనం.



**మార్గదర్శకాలివే**

జవాబు పత్రంలో పేజీ పైభాగంలో, ఎడమ వైపున అంగుళం చొప్పున, కుడి వైపున అర అంగుళం చొప్పున మార్జిన్ వదిలి పెట్టాలి.

స్కెచ్ పెన్నులు, ఇతర అచ్చులు పడే దట్టమైన సిరా ఉండే పెన్నులు వాడితే తర్వాత పేజీల్లో వాటి ఆనవాళ్లు కనిపిస్తాయి. అలాంటివి వాడకుండా సాధారణ బాల్ పాయింట్ పెన్నులు మాత్రమే వినియోగించాలి.కొట్టివేతలు లేకుండా పదాల నిర్ణీత దూరాన్ని అవసరమైన నిడివి వదిలి పెడుతూ సరైన క్రమ పద్ధతిలో రాయాలి. గణితంలో అంకెలు మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమయ్యేలా స్పష్టంగా రాయాలి. లేకుంటే మార్కులు కోల్పోయే అవకాశం ఉంటుంది. విద్యార్థులు తమ చేతిరాతకు అనుకూలంగా ఉండే పెన్నులను ఎంపిక చేసుకోవాలి. శీర్షికలు, ఉప శీర్షికలు, ముఖ్యాంశాలు స్పష్టంగా కనిపించేలా కింద గీతలు (అండర్‌లైన్) గీయాలి.గొలుసు కట్టు రాతలు, అక్షరంపై మరో అక్షరం రాయకూడదు. కూర్చునే విధానం, పెన్ను పట్టుకునే విధానం కూడా దస్తూరికి దోహదం చేస్తుంది.స్పష్టంగా ఉండేలా సాధన: సూర్యనారాయణ, గ్రాఫాలజిస్ట్

అక్షరాలు స్పష్టంగా ఉండేలా రాయడం సాధన చేయాలి. పదాల మధ్య నిడివి పాటించాలి. దస్తూరి కోసం చూచిరాతలను సాధన చేస్తే క్రమంగా అందమైన దస్తూరి సొంతం అవుతుంది. ప్రతీనిత్యం పరీక్షల సాధనలో భాగంగా కనీసం అరగంట రాయడానికి కేటాయించాలి. కొట్టివేతలు, దిద్దుళ్లు లేకుండా జాగ్రత్త పడాలి.

అంతర్గత పరీక్షల్లో పూర్తి మార్కులు– మైలగాని మాధురి, పదో తరగతి చిన్నప్పటి నుంచే చేతిరాతపై దృష్టి సారించా. పాఠశాల స్థాయిలో ఇప్పటి వరకు జరిగిన అంతర్గత పరీక్షల్లో పూర్తిస్థాయిలో మార్కులు సాధించాను. పదో తరగతిలో సైతం 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నా. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో సాధన చేస్తున్నా.పదో తరగతి విద్యార్థుల వివరాలు

జగిత్యాల: 11855

కరీంనగర్: 12516

సిరిసిల్ల: 6902

పెద్దపల్లి: 7393

# కేరళ తరహాలో విహరిద్దామా!

బాపట్ల : కాలువలు..వాగుల్లో మడ అడవుల మధ్య పర్యాటకులు ప్రకృతి రమణీయ దృశ్యాలు తిలకిస్తూ పడవల్లో విహరించే ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుంది. జిల్లాలో పర్యాటక రంగాభివృద్ధికి కీలకమైన దీని సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను జలవనరుల శాఖ రూపొందించింది. బాపట్లలో పర్యటించిన పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌కు పీపీటీ ద్వారా ప్రాజెక్టు వివరాలను జిల్లా కలెక్టర్ వెంకటమురళి వివరించారు. పర్యాటకాభివృద్ధి సంస ద్వారా కేరళలోని అలెప్పి తరహాలో పర్యాటకుల కోసం పడవలు నడపాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కేరళ తరహాలో బాపట్ల, కర్లపాలెం, నిజాంపట్నం, రేపల్లె మండలాల తీర ప్రాంతంలో సముద్రం నుంచి వెనక్కి వచ్చే జలాల్లో పడవల విహారానికి అనుకూలంగా ఉన్నాయి. తీరంలో వాగులు, కాలువల్లో పడవల విహారం ప్రాజెక్టు చేపట్టటం ద్వారా ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించటానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ వెంకటమురళి భావిస్తున్నారు.

**మడ అడవులు సందర్శించే అవకాశం :** బాపట్ల మండలం ఆదర్శనగర్ వద్ద పడవ ప్రారంభమై నల్లమడ వాగు సముద్రంలో కలిసే పొగురు వద్ద ఇసుక తిన్నెల్లో ఆగేలా ల్యాండింగ్ పాయింట్ ప్రతిపాదించారు. పర్యాటకులు నల్లమడ వాగు సంగమం, చుట్టూ మూడు వైపుల నీరు, ఓ వైపు భూమి ఉండే ద్వీపకల్ప ప్రాంతం, పక్షులను సందర్శించేలా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఉప్పుటేరులో మరలా పడవ ప్రారంభమై కర్లపాలెం మండలం తుమ్మలపల్లి రామాలయం సమీపంలో రెండో ల్యాండింగ్ పాయింట్‌కు చేరుకుంటుంది. ఇసుక తిన్నెలు, మడ అడవుల అందాలు తిలకిస్తారు. కొద్దిసేపు తర్వాత పడవలో ముందుకు



సాగుతూ తూర్పు తుంగభద్ర కాలువలోకి ప్రవేశించి నిజాంపట్నం హార్బర్‌కు 1.5 కి.మీ. దూరంలో చివరి ల్యాండ్ పాయింట్‌కు చేరుకుంటుంది. హార్బర్, మడ అడవుల సందర్శన తర్వాత పడవ వచ్చిన మార్గంలో వెనుదిరిగి తిరిగి ఆదర్శనగర్ చేరుకోవడంతో విహారం ముగుస్తుంది.

**అతి త్వరలో ప్రారంభం**

పడవల్లో విహారానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించి పీపీటీ ద్వారా పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌కు వివరించి అన్ని వివరాలు అందజేశాం. తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తాం. పడవల్లో విహారం అతి త్వరలో ప్రారంభమై పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది.వెంకటమురళి, కలెక్టర్

పడవల విహార మార్గం

పేరలి కాలువ(4కి.మీ.)- నల్లమడ వాగు(1.5 కి.మీ.)- ఉప్పుటేరు(12.2 కి.మీ.)- తూర్పు తుంగభద్ర కాలువ (0.65 కి.మీ.)

విహారం ప్రాజెక్టు దూరం: 18.37 కి.మీ.

కాలువల్లో కనీస లోతు: 1.65 మీ. నుంచి 3.14 మీ.

మొత్తం ల్యాడింగ్ పాయింట్లు: నాలుగు

ఏడాదిలో నీరు ఉండే రోజులు: 330

# రుయాలో మార్పు.. సేవల కూర్పు

తిరుపతి : 'అత్యవసర విభాగంలో పాడైన పడకలు.. ఉతకని బెడ్‌షీట్లు, కర్టెన్లు.. వినియోగానికి పనికిరాని మరుగుదొడ్లు.. విభాగాల్లో తగినంత వెలుతురు లేక గుహలాంటి వాతావరణం.. పనిచేయని పంకాలు, ఏసీలు.. కూర్చోవడానికి వీలుకాని బెంచీలు.. దారికి అడ్డంగా పాత పరికరాలు, వస్తువులు.. సినిమా పోస్టర్లను మించిన సూచిక బోర్డులు.. ఉరుస్తున్న పైకప్పులు.. ఇలాంటి సౌకర్యాలా రోగులకు కల్పించేదంటూ గతనెల 14న రుయాలో పర్యటించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో యంత్రాంగంలో కదలిక మొదలైంది. రుయాలో అత్యవసర సేవల్లో లోటుపాట్లు, ప్రభుత్వ సర్వేలో రుయా పనితీరుపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ ఆసుపత్రిలో పర్యటించి కీలక మార్పులకు ఆదేశాలిచ్చారు.

**అవినీతి.. అపరిశుభ్రతపై ఏదీ నిఘా?**

నర్సులు సైతం వచ్చామా.. వెళ్లామా.. అన్న ధోరణి మార్చుకోవాల్సి ఉంది. 120 మంది పారిశుద్ధ్య కార్మికులకుగాను 89 మంది మాత్రమే విధులకు హాజరు కావడంపై గత పర్యటనలో కలెక్టర్ నిలదీశారు. అప్పుడప్పుడు మరుగుదొడ్లు శుభ్రం చేయడం కాకుండా నిరంతరం కొనసాగేలా వ్యవస్థను మెరుగుపరచాల్సి ఉంది.

**నిధులు.. సిబ్బంది అవసరం**



ఆసుపత్రికి మరింతమంది సిబ్బంది.. నిధులు అవసరం. 760 పడకల సామర్థ్యం ఉన్నప్పుడు 50 మంది నర్సింగ్ ఆర్డర్లీలను నియమించగా ప్రస్తుతం 1260 పడకలకు చేరిన నేపథ్యంలో వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లు తగినన్ని లేక సిబ్బంది అందుబాటులో లేక రోగులు వారి సహాయకులు అవస్థలు పడాల్సి వస్తోంది.

**మరోచోటుకు జనరల్ మెడిసిన్ ఓపీ**

రెండు చిన్న గదుల్లో 12 మంది వైద్యులు.. సరాసరి 300 మంది రోగులకు జనరల్ మెడిసిన్ ఓపీ నిర్వహిస్తుండగా దాన్ని జిరియాట్రిక్ వార్డులోకి మార్చారు. సమాచార బోర్డులు అందరికీ కనిపించేలా లోపల, బయట ఏర్పాటు చేశారు. ఓప్మీ, వార్డుల్లో ఆరోగ్య సంబంధిత వీడియోలు ప్రసారం చేస్తున్నారు. ఆస్తమా రోగులు వరండాలో కూర్చుని నెబ్యులైజర్ తీసుకునే సదుపాయం కల్పించారు. ఓప్మీ కారిడార్‌లో మారిన్ని ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసి వెలుతురు పెంచారు.

**అత్యవసరం.. ఆధునికీకరణ**

ఆరోగ్యశ్రీ, హెచ్‌డీఎస్ నిధులతో అత్యవసర విభాగంలో పాడైన పడకల స్థానంలో 20 ఐస్మీయూ పడకలు ఏర్పాటు చేశారు. మూడు ప్రాంతాల్లో వైద్యులు పెద్ద టేబుళ్ల మధ్య కూర్చునే విధానాన్ని మార్చి రోగులకు ఎక్కువ స్థలం కేటాయించారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. మందులు నిరంతరం ఉండేలా నూతన డెస్క్ ఏర్పాటుచేశారు. సూదిమందులు వేసేందుకు కొత్త వ్యవస్థను నెలకొల్పారు. ఓపీ లోని నెం.13 ల్యాబ్‌ను సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లోకి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# వాన నీటిని ఒడిసిపట్టేద్దాం..!



ఎస్.రాయవరం : వర్షపునీటి ఒడిసి పట్టేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీన్లోభాగంగా ప్రతి నీటి బొట్టును వృథాగా పోకుండా భూమిలో ఇంకించేందుకు చర్యలు చేపట్టింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, రైతుల పొలాల్లో పంట కుంటలు తవ్వడానికి శ్రీకారం చుట్టింది.

**ప్రతి గ్రామంలో 20...**

జిల్లాలోని 24 మండలాల్లో 6,535 ఇంకుడు గుంతలు తవ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ 20 చొప్పున గుంతల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది గుంత తవ్వేందుకు ఇంటి వద్ద అనువైన స్థలాన్ని పరిశీలించి, జియో ట్యాగింగ్ చేసి మంజూరు చేస్తారు. ప్రతి గుంతకు మెటీరియల్, రైతు కూలీ కలిపి రూ.5800 చెల్లించనున్నారు. వీటిల్లో పిక్క, కంకర, ఇసుక, ఇతర సామగ్రితో నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలి.. ఇళ్ల వద్ద, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో ఇళ్ల నుంచి నీరు రోడ్డుపైకి రాకుండా కొంతమేర పారిశుద్ధ్య సమస్య పరిష్కారం అవుతుంది.

జిల్లాలో ఎక్కువగా వర్షాధారం పైనే పంటలు సాగుచేస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లో పంటలకు బాగానే నీరందుతోంది. అయితే మెట్టప్రాంతాల్లో సాగు చేసే మామిడి, జీడిమామిడి, ఇతర పండ్ల తోటలకు వేసవిలో నీరందడం లేదు. దీంతో రైతుల పొలాల్లోనే వర్షపునీటిని నిల్వ చేసే విధంగా పంట కుంటల తవ్వకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో 7200 పంట కుంటలు తవ్వాలని లక్ష్యం నిర్దేశించింది. తొలి విడతలో 964 పంట కుంటల తవ్వకాలు చేపట్టారు. 9 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పుతో ఉపాధి కూలీలు పంట కుంట నిర్మిస్తారు. దీనికి ప్రభుత్వం సుమారు రూ.45 వేలు చెల్లిస్తుంది. పంట కుంట తవ్వించుకున్న రైతుకు 20 రకాల పండ్ల జాతి మొక్కలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా అందిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి-డీవీ ఎరకయ్య, ఏపీడీ (ఇంఛార్జి), ఎలమంచిలి**

రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం పంట కుంటల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వర్షపునీరు వృథాకాకుండా పొలాల్లో నిల్వ ఉండటానికి పంటకుంటలు తవ్విస్తున్నాం. దీంతోపాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, కూరగాయల విత్తనాలు ఉచితంగా అందిస్తాం. దీంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. భూగర్భ జలాలను పెంపొందించడానికి, పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ప్రతి ఇంటి వద్దా ఇంకుడు గుంత తవ్వుకునేందుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

# రేషన్ దందా..అడ్డు ఉందా?



కాకినాడ : గత అయిదేళ్లూ పేదల బియ్యంతో రూ.కోట్లు కొల్లగొట్టిన రేషన్ మాఫియా అక్రమాల బాట వీడనంటోంది. వైకాపా ప్రభుత్వంలో కొందరు పెద్దలు పోర్టులను గుప్పెట్లో పెట్టుకుని పెద్ద ఎత్తున రేషన్ బియ్యం విదేశాలకు తరలించేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేసుకున్నారు. నేటికీ కొన్ని వ్యవస్థలు సహకరిస్తుండడం సమస్యగా మారింది.

**కూటమి వచ్చాక అడ్డుకట్ట వేస్తున్నా**

రేషన్ మాఫియా గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసుకుని పేదల బియ్యం హద్దులు దాటించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉక్కుపాదం మోపే దిశగా అడుగులు పడ్డాయి. గతేడాది జూన్ 28, 29 తేదీల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలోని 13 గోదాముల్లో తనిఖీలు చేసి 51,427 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 26,488.32 టన్నుల్లో రేషన్ ఆనవాళ్లు గుర్తించారు. ఆయా సంస్థలపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు.. ఛత్తీస్‌గఢ్, బిహార్, ఝూర?ండ్, పశ్చిమ బెంగాల్‌లోని 137 మిల్లుల నుంచి రేషన్ బియ్యం కాకినాడ చేరినట్లు తేలింది. ఆ తర్వాత ఆఫ్రికా వెళ్లే స్టెల్లా నౌకలో 1,320 టన్నులు.. బార్జిలో వెయ్యి టన్నుల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

**అసెంబ్లీలో చర్చతో కదిలిన డొంక..**

కాకినాడ నగర తెదేపా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు రేషన్ అక్రమాలపై అసెంబ్లీలో గురువారం చర్చించారు. వైకాపా ప్రభుత్వం, ద్వారంపూడి కుటుంబంపై ఆరోపణలు చేశారు. గత అయిదేళ్లూ బియ్యం వ్యాపారం చేసి.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆపేసిన మానస సంస్థపైనా విచారణ జరపాలన్నారు. సంబంధిత సంస్థ గత అయిదేళ్లలో 6 లక్షల టన్నుల బియ్యం విదేశాలకు ఎగుమతి చేసిందనే ప్రచారం సాగుతోంది. దీనిలో అక్రమం ఎంత..? సక్రమమెంత తేలాల్సి ఉంది.

**'సిట్' వేస్తే మాకేంటి..**

అక్రమాలపై గతేడాది చివరన రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను వేసింది. బృందం ఇంతవరకు క్షేత్రస్థాయికి రాలేదు. దీంతో అక్రమ రవాణా మళ్లీ ఊపందుకుంది.

కాకినాడ పోర్టులో 4 చెక్‌పోస్టులు ఉన్నాయి. అయినా 2,320 టన్నుల రేషన్ బియ్యం పోర్టులోకి వెళ్లిందంటే అక్రమార్కుల హవా తెలుస్తోంది. నాడు పౌర సరఫరాల వ్యవస్థ మొత్తం ద్వారంపూడి కుటుంబం చేతిలోనే.. కాకినాడ సిటీ వైకాపా ఎమ్మెల్యేగా చంద్రశేఖర్‌రెడ్డి కొనసాగితే.. పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్, రైస్ మిల్లర్ల సంఘం, ఎగుమతిదారుల సంఘం అధ్యక్ష పదవుల్లో ఆయన తండ్రి, సోదరుడు ఉన్నారు.


**ఇవిగో అక్రమాల జాడలు..**

గొల్లప్రోలులోని వైకాపా కౌన్సిలర్ షెడ్డులో 17.49 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఫిబ్రవరి 10న, చినజగ్గంపేట శివారు కోళ్లఫారంలో 1,100 కేజీల బియ్యాన్ని ఈనెల 5న అధికారులు పట్టుకున్నారు.

మహారాష్ట్ర నుంచి 20 టన్నుల రేషన్ బియ్యం లోడుతో వస్తున్న లారీని తొండంగి పోలీసులు ఫిబ్రవరి 1న పట్టుకున్నారు.

కాకినాడ పోర్టు సమీప చెక్‌పోస్టు వద్ద ఫిబ్రవరి 21న నాలుగు లారీల్లోని 92 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

# కిట్ల కొరత.. రోగుల వెత



ఆదోని : పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం 'నాడి'తప్పింది. కేంద్రాలకు వైద్యులు సమయానికి రావడం లేదు.. వచ్చినా రెండు గంటలకు మించి ఉండటం లేదు.. కింద స్థాయి సిబ్బందే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ల్యాబ్ పరీక్షల్లో కీలకమైన సీబీపీ కిట్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఆటంకం నెలకొంది. అత్యాధునిక వైద్య పరికరాలు మూలన పడేశారు. మంచాలు ఇంతవరకు సీలు తీయని పరిస్థితి. బృందం పరిశీలన చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**నిర్వీర్యం చేసిన వైకాపా**

పట్టణాల్లోని బస్తీవాసులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో అపోలో సంస్థ భాగస్వామ్యంతో పరీక్షలు చేసేవారు. దీర్ఘకాలిక జబ్బులకు వీడియో కాన్ఫరెన్స్‌లో రోగితో మాట్లాడి సేవలందించేవారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్) విధానంతో క్షేత్ర స్థాయిలో రోగుల పరిశీలన ఉండేది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత అపోలో సంస్థను ఆపేసింది.

**అటకెక్కిన 67 పరీక్షలు**

పట్టణ, నగర ప్రాంతాల్లోని శివారు, మురికి వాడల్లో నివాసముండే ప్రజలకు వైద్య సేవలందించి, వారి ఆరోగ్య రక్షణకు దోహదపడాలనే సంకల్పంతో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు.

ఒక్కో కేంద్రం పరిధిలో సుమారు 20-30 వేల జనాభాకు సేవలందించాల్సి ఉంది. రోజు వారీ ఓపీ 50-80 ఉంటుంది. ఆయా కేంద్రాల్లో 67 రకాల పరీక్షలు, 172 రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలి. ఎక్కడా సరైన వైద్యం అందడం లేదు.

ఆదోనిలో శంకర్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో మూడు, అరుణ్‌జ్యోతినగర్ కేంద్రంలో ఐదు నెలలుగా వైద్యుడి స్థానం ఖాళీగా ఉంది. రెండు నెలల కిందట వైద్యుడిని నియమించినా.. పైచదువుల పేరుతో తిరిగి వెళ్లిపోయారు. పాత ఆకాశవంతెన కింది భాగంలో హవన్నపేట కేంద్రానికి వెళ్తే అక్కడ వైద్యురాలు కనిపించలేదు.

# జగనన్న లేఅవుట్ల అక్రమాలపై విజిలెన్స్

చిత్తూరు : వైకాపా హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో భారీగా అక్రమాలు జరిగాయి. అర్హులను పక్కనపెట్టి వాలంటీర్లు, వారి స్నేహితులు, బంధువులు, సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు కాలనీల్లో పట్టాలు జారీ చేశారు. భూ సేకరణ మొదలు.. మౌలిక వసతులు, భూముల చదును పేరుతో వైకాపా నేతలు రూ.కోట్లు దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై దృష్టి సారించింది. విజిలెన్స్ విభాగ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణకు చర్యలు చేపట్టాయి. జగనన్న లేఅవుట్ల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో వందల ఎకరాలు సేకరించారు. ప్రభుత్వ భూములను సైతం అధికారుల సహకారంతో అసైన్డ్ భూములుగా మార్చి రూ.కోట్లు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు భూముల విషయంలో భూ విలువను అధికంగా పెంచేసి నిధులు స్వాహా చేశారు. భూ నిర్వాసితులకు తక్కువ మొత్తంలో పరిహారం అందజేసి అధిక భాగం వైకాపా పెద్దలు,



అధికారులు దోచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి భూసేకరణ దోపిడీలు జిల్లా వ్యాప్తంగా జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

**దర్యాప్తు ఇలా..**

విజిలెన్స్ అధికారులు ప్రతి జగనన్న లేఅవుట్‌పై క్షుణ్ణంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. లేఅవుట్‌కు సేకరించిన భూ విస్తీర్ణం ఎంత..? ఈ భూమి ప్రైవేటు వ్యక్తులదా.. ప్రభుత్వానిదా..? భూసేకరణకు నిధుల విడుదల ఎంత..? భూ నిర్వాసితులకు ఎంత ఇచ్చారు..? భూసేకరణలో ఏవైనా అక్రమాలు జరిగాయా..? లేఅవుట్ల అభివృద్ధికి మంజూరైన నిధులు, ఖర్చు చేశారా.. స్వాహా చేశారా..? లేఅవుట్లు లబ్ధిదారులకు సౌకర్యమా..? అసౌకర్యమా..? ప్రస్తుతానికి నిర్మాణాలు పూర్తయిన ఇళ్లు, నిర్మాణానికి నోచుకోని ప్లాట్లు ఎన్ని..? తదితర అంశాలను రికార్డుల ద్వారా పరిశీలించనున్నారు. ఈ నెలా 20 లోగా సమగ్ర నివేదిక అందజేయాలని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

**కొండలు, గుట్టల్లో జాగాలిచ్చి..**పట్టణ, మండల ప్రాంతాలకు సుదూరంగా అడవుల సమీప, గుట్టలు కొండల నడుమ, అసౌకర్యంగా లేఅవుట్లు ఏర్పాటు చేశారు. భూమి చదును, సరిహద్దు రాళ్ల ఏర్పాటు తదితర మౌలిక వసతులకు రూ.కోట్లు ఖర్చు చేశారు. భూముల చదును, రాళ్లు తొలగించకుండానే వైకాపా సానుభూతిపరులైన గుత్తేదారులకు రూ.కోట్లు బిల్లులిచ్చి అందరూ పంచుకున్నారు.

# చెరువుల్లో తోడేళ్లు

కుప్పం : కుప్పం నియోజకవర్గంలోని చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైకాపా పాలనలో ఇక్కడి వనరులను కొల్లగొట్టి కర్ణాటక, తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. నియోజకవర్గంలోని చెరువులన్నీ అడుగంటిపోయాయి. ఇదే అదనుగా తవ్వకాలు చేపడుతూ.. మట్టిని ఫిల్టర్ కేంద్రాలకు తరలించి, ఇసుకగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రధానంగా కుప్పం పురపాలిక పరిధిలోని కుప్పం చెరువు, లక్ష్మీపురం చెరువు, పరమసముద్రం, అబ్బకుంట చెరువు, శీగలపల్లె చెరువు, డీకే పల్లి చెరువుల్లో యంత్రాలతో తవ్వుతున్నారు. కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలోని కొండల మధ్య సైతం తవ్వేస్తున్నారు.

**పుట్టగొడుగుల్లా వెలిసినా** చీలేపల్లె, శీగలపల్లె, పరమసముద్రం, పలార్లపల్లె, లక్ష్మీపురం, వడ్డిపల్లె లింకు రోడ్డు, కృష్ణదాసనపల్లె, గుడ్లనాయనపల్లె, మల్లానూరు, రామకుప్పం, గుడుపల్లె శాంతిపురం మండలాల్లో కృత్రిమ ఇసుక తయారు చేసి.. యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం- శ్రీనివాసరాజు, ఆర్డీవో, కుప్పం**

అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి, ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలు చేస్తుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# వైకాపా నిర్మిత కాలనీళ్లివి..!

కాకినాడ : గత వైకాపా పాలకుల అక్రమాలకు నిలువెత్తు నిదర్శనం కొమరగిరి లేఅవుట్. కాకినాడ నగరంలోని 16 వేల మంది పేదలకు ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. సాక్షాత్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ లే-ఔట్‌లో ఇళ్లపట్టాల పంపిణీ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సముద్ర మట్టానికి దిగువన ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరం రూ.27 లక్షలు ఉండగా, అప్పటి వైకాపా ప్రజాప్రతినిధి దళారుల సాయంతో ఎకరం రూ.47 లక్షలకు కొనిపించి సొమ్ము చేసుకున్నారు. ఏకంగా 350 ఎకరాలు ఇక్కడ సేకరించారు.



లేఅవుట్ చదును పేరుతో నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతం నుంచి గ్రావెల్ తెచ్చి నింపి, రూ.కోట్లు కొట్టేశారు. తొలి విడతలో ఇక్కడ 13 వేల మందికి ఇళ్లు మంజూరు చేశారు. 9 వేల వరకు పునాదులు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రదేశమైన ఈ లేఅవుట్ మునిగిపోతోంది. సముద్రంలో పోటు వచ్చినా ముంపు తప్పడం లేదు. ప్రస్తుతం సముద్రపు పోటుతో తీరానికి నీరు చేరి ఇసుక మేట వేసింది. దీంతో ఈ లేఅవుట్ పక్కనున్న కాలువులో నీరు సముద్రంలోకి వెళ్లకుండా నిలిచిపోయింది. వెరసి లేఅవుట్‌ను ముంచెత్తుతోంది. ఈ లేఅవుట్‌లో ముంపునకు ఈ చిత్రాలే సాక్ష్యాలు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు ఎంత శ్రేయస్కరమో వైకాపా పెద్దలే చెప్పాలి.

# వివాదాస్పద టీడీఆర్ దస్త్రాలు చకాచకా..!

నిడదవోలు:నగర పరిధిలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్)ల జారీపై ఎన్ని ఆరోపణలు వస్తున్నా మహా విశాఖ నగరపాలక సంస్థ అధికారుల తీరు మారడం లేదు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ దస్త్రాలను ఆమోదింపచేయడానికి ప్రత్యేకంగా డీటీసీపీ (డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్) నుంచి ఉప సంచాలకుడు శ్రీనివాసరావు గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. మరో పక్క జీవీఎంసీకి చెందిన టీడీఆర్‌లపై అసెంబ్లీలో వివరణ ఇవ్వడానికి ప్రధాన పట్టణ ప్రణాళికా ధికారి ప్రభాకర్ హుటాహుటిన మధ్యాహ్నం విజయవాడ బయల్దేరి వెళ్లారు.

**90 వరకు దస్త్రాల పరిశీలన..:** వైకాపా హయాంలో నగరంలో జారీ చేసిన టీడీఆర్‌లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. వాటిల్లో కొన్నింటిని పక్కనపెట్టగా మిగతా వాటిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు. మరో మరోవైపు సీఐడీ అధికారులు సైతం టీడీఆర్ దస్త్రాలను తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అక్రమార్కులు అధికారులను ప్రసన్నం చేసుకుని, నాయకులకు తప్పుడు సమాచారం ఇస్తూ టీడీఆర్‌లు కొట్టేయడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జీవీఎంసీలో పెండింగ్‌లో ఉన్న 90 దస్త్రాలను ఆమోదింపజేయడానికి ప్రత్యేకంగా డీటీసీపీ కార్యాలయం నుంచి ఉప సంచాలకుడు స్థాయి అధికారి జీవీఎంసీకి చేరుకోవడం విశేషం.



**ఇవిగో అభ్యంతరాలు..:** కొమ్మాది ప్రాంతంలో మృతురాలి పేరిట ఉన్న డి-పట్టా భూమికి టీడీఆర్ ఇవ్వాలని దరఖాస్తు చేయగా, ప్రణాళికాధికారులు హడావుడిగా అభ్యంతరాల కోసం పత్రికల్లో నోటిఫికేషన్ ఇచ్చారు. అనకాపల్లిలో 30 వరకు టీడీఆర్‌లపై ఇంకా సర్వే కొనసాగుతుండగా, వాటిని ఆమోదించడానికి ప్రణాళికాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకుని మురళీనగర్ సమీపంలోని గెడ్డ పోరంబోకు స్థలానికి టీడీఆర్ ఇవ్వాలని ఓ నాయకుడు దరఖాస్తు చేయగా దానిపైనా దస్త్రం కదులుతోంది. రుషికొండ సమీపంలోని గీతం వర్సిటీ వద్ద 70 సెంట్ల భూమికి మూడు దశాబ్దాల క్రితం చేసిన అభివృద్ధి పనికి టీడీఆర్ రాగా, ఆ దరఖాస్తును పరిశీలిస్తున్నారు. ఎన్ఎస్‌టీఎల్ సమీపంలో రహదారి విస్తరణలో భాగంగా స్థలం కోల్పోయినట్లు వచ్చిన దరఖాస్తుపై ఎలాంటి విచారణ లేకుండానే టీడీఆర్ జారీ చేయడానికి సిద్ధపడినట్లు తెలిసింది. వీటిపై కౌన్సిల్‌లో కార్పొరేటర్లు అభ్యంతరాలు చెప్పినా అధికారులు ముందుకెళ్లి పోతుండటం గమనార్హం.

## ఇసుకను తోడేసి.. మట్టిని తవ్వేసి

ముమ్మిడివరం : గలగలపారే గోదావరి చెంతన ఇసుక, కొబ్బరితోటల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. లంకల్లో తట్ట ఇసుక తీయాలన్నా ఎన్నో నిబంధనలు, ఉన్నతస్థాయిలో అనుమతులు ఇవ్వాల్సి ఉన్నా అవేమీ లేకుండానే నాయకుల అండదండలతో తవ్వకాలు జరిగిపోతున్నాయి. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంక గోదావరి తీరంలో పొక్లెయిన్లతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఉచిత ఇసుక మాటున పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవరపాలెం ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు ప్రారంభించారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ తంతు జరుగుతున్నా



అధికారగణం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వైకాపా పాలనలో నిబంధనలు తుంగలో తొక్కి లంక గ్రామాల్లో ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టి తీరానికి తూట్లు పొడిచారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తీసుకురాగా కొందరు ర్యాంపుల వద్ద బాట పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఇసుక ర్యాంపు ఏర్పాటుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ర్యాంపును ప్రారంభించారు.

## ధర పతనం.. రైతు నిర్వేదం

చీరాల : రొయ్యల ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి... గడిచిన వారం రోజులకు ఇప్పటికి మార్పు రావడంతో ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు... ఒకపక్క సాగురేట్లు విపరీతంగా పెరిగిపోతున్నాయి... ఇదే పరిస్థితి కొనసాగితే డాలర్ల పంటగా ప్రసిద్ధికెక్కిన రొయ్యల పరిశ్రమ విస్తీర్ణం క్రమేపి తగ్గే అవకాశం ఉందని సాగుదారులు వాపోతున్నారు.

జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో 22 వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగవుతున్నాయి. ఏటా వీటి ద్వారా విదేశీ మారకద్రవ్యం రూ.కోట్లలో వస్తోంది. ఇంత వరకు బాగానే ఉంది. వచ్చిన చిక్కల్లా సాగుకు ఉపక్రమించే సమయంలో ధరలు ఆతరువాత ఉండటంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద కౌంట్ రొయ్యలు పండించడానికి రూ.240 నుంచి 250 వరకు వ్యయం అవుతోంది. దీంతో ప్రస్తుతం మార్కెట్ ధరతో నష్టాలు తప్పడంలేదని వారి వాదన. అంతర్జాతీయంగా పరిస్థితులు బాగాలేవని చెప్పే వ్యాపారులు ఇప్పుడు ఎటువంటి ఇబ్బందుల్లేకపోయినా ధర తగ్గించడంలో ఆంతర్యం అర్థం కాకుందని ఆవేదన చెందుతున్నారు. గడిచిన వారం రోజుల్లోనే వంద కౌంట్ రొయ్యల ధరల్లో కిలోకి రూ.40 తగ్గడం వీరిలో మరింత ఆందోళన నెలకొంది.

# రేషన్ బండి.. అక్రమాలు దండి!



అనంతపురం : ఆహార భద్రతా చట్టం ప్రకారం రేషన్ డీలర్లు కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాలి. గత వైకాపా ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లకు పూర్తి అధికారులు అప్పగించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. ఇంటింటికీ వాహనాలు వెళ్లడం లేదు. దీంతో కొన్ని చోట్ల కార్డుదారులు అవస్థ పడుతున్నారు. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 754 ఎండీయూ వాహనాలకుగాను 691 ఇంటింటికి తిరుగుతున్నట్లు ఆపరేటర్లు బిల్లు రాసేసుకుంటున్నారు. చౌక దుకాణాల వద్ద కూర్చొని పని కానిచ్చేస్తున్నారు. మరోవైపు లబ్ధిదారులకు సరకులు అందించినా.. అందించకపోయినా ప్రతి నెలా వారి ఖాతాలకు రూ.21 వేలు చొప్పున రూ.1.86 కోట్లు జమ అవుతుండటం గమనార్హం.

**చిల్లర పేరుతో..**

వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయాలకు ఎండీయూ వాహనాలను మ్యాపింగ్ చేశారు. చౌక దుకాణాల్లో సరకులు పంపిణీ చేసినా.. ఎండీయూ ఆపరేటర్ ఇప్పటికీ ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేయాల్సిందే. ఆపరేటరు, డీలరు కుమ్మక్కై ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేయించుకుని కందిపప్పు, పంచదార పంపిణీ చేసినట్లుగా పక్కదారి పట్టిస్తున్నారు. బియ్యం తూకాల్లో కార్డుకు 3-4 కిలోలు పట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కిలో కందిపప్పు రూ.67 ఉండగా రూ.70, అర కిలో పంచదార రూ.17 ఉండగా రూ.20 చొప్పున తీసుకుంటూ చిల్లర నొక్కేస్తున్నారు.

**అధికారులు ఏమంటున్నారంటే..**

ఇన్‌ఛార్జి డీఎస్‌వో జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు కచ్చితమైన తూకాలు, నిర్ణయించిన ధరల ప్రకారమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. లేదంటే చర్యలు తప్పవన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు బిల్లులు పంపుతారు. వాటి ప్రకారం ఆపరేటర్లకు రూ.21 వేల చొప్పున చెల్లిస్తున్నామన్నారు.

**8 నెలలకు రూ.14.92 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 754 వాహనాలున్నాయి. వాటిలో 63 వివిధ కారణాలతో ఆగిపోగా మిగతావి తిరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 405 వాహనాలకు గాను, 347...శ్రీసత్యసాయి జిల్లాలో 349 వాహనాలకు 344 తిరుగుతున్నాయి. ఒక్కో ఆపరేటర్‌కు ప్రభుత్వం నెలకు రూ. 21 వేలు చొప్పున చెల్లిస్తోంది. ఎనిమిది నెలలకు మొత్తం రూ.14.92 కోట్లు జమైంది.

# ప్రతిభా పరీక్షలు.. ఉన్నత స్థాయికి సోపానాలు



అనంతపురం : కేవలం చదువుల్లో మంచి మార్కులు సాధించిన వారికంటే ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, ఉన్నత స్థాయిలో ఉంటారని నగరపాలక కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లాలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం పట్టణాల్లో 4 నెలలపాటు ఈ పోటీలు నిర్వహించారు. పాఠశాల, ప్రాంతీయ స్థాయిలో గెలుపొందిన విజేతలకు స్థానిక పీవీకేకే డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు జరిగాయి. కార్యక్రమానికి అనంత నగర కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."జాతీయ పరిశోధన సంస్థలు సర్వే ప్రకారం పదో తరగతి, ఇంటర్, డిగ్రీల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు 4 నుంచి 5 శాతం మంది మాత్రమే ప్రభుత్వ కొలువులు దక్కించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఇలాంటి ప్రతిభాపాటవ పోటీల్లో పాల్గొనే వారు 50 శాతం మంది మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు స్వయం అధ్యయనం, ప్రజలకు సేవ చేయాలనే తత్వం ఉంటుంది. చదువులతోపాటు అన్య అంశాల్లో మిళితమైన వారే జీవితంలో రాణిస్తారు. నేర్చుకోవడం అనేది జీవితంలో నిరంతర ప్రక్రియ. ఈనాడు పత్రిక సమాజంలో వివిధ వర్గాల వారి కోసం వసుంధర, చదువు, అంతర్యామి వంటి శీర్షికలతో ప్రత్యేక సమాచారం అందిస్తోంది. మద్యపానం వంటి సామాజిక రుగ్మతలు రూపమాపడానికి గతంలో చేసిన కృషి అమోఘం. విద్యార్థులను ఉత్సాహపరచడానికి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించడం అభినందనీయం. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలి" అని పిలుపునిచ్చారు. ఈనాడు యూనిట్ మేనేజరు చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరు నుంచి ఉమ్మడి అనంత జిల్లాలో 6 ప్రధాన కేంద్రాల్లో 82 పాఠశాలల్లో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించామన్నారు. మొత్తం 25 వేలమంది పైగా పాల్గొన్నారని, పిల్లలు చదువుల్లోనే కాదు వారు ఏయే రంగాల్లో రాణిస్తున్నారో గుర్తించి ఆయా అంశాల్లో మరింత రాణించేలా ప్రోత్సహించడానికి వేదికగా మారిందన్నారు. 2024లో స్వర్ణోత్సవాలు నిర్వహించిన రంగంలో సమాచారం అందించడమే కాకుండా ప్రజలతో మమేకం కావడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తు తరానికి ఎంతో కొంత సహాయపడాలనే ఉద్దేశంతో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పీవీకేకే బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను అభినందించారు. ఈ పోటీలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, ముత్యాలప్ప, కత్తి విజయ్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

**అంశం:** ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విజేతలు, పాఠశాల, ప్రాంతం వివరాలు

వ్యాసరచన : రంగశివ చరణ్ (రోటరీ, గుంతకల్లు), మధురిమ (ఆదర్శ, తాడిపత్రి), వర్ష (జీవానంద, ధర్మవరం) చిత్రలేఖనం: ఉదయ్ సాయిరాం (సాధన, ధర్మవరం), మోక్షజ్ఞ (వాల్మీకి, కదిరి), నవ్యశ్రీ (పాంచజన్య, హిందూపురం)

**ఉపన్యాసం:** స్నేహిత (నారాయణ, తాడిపత్రి), గగనప్రియ (ఎల్ఆర్‌జీ, హిందూపురం), మేఘన (ఆదర్శ, తాడిపత్రి)

క్విజ్: రాజేష్ (గుడ్ చిల్డ్రన్, అనంతపురం), సాయిలిఖిత్ (ప్రసాద్, అనంతపురం), అనన్య (శ్రీవాణి, తాడిపత్రి)

**దినపత్రిక చదవడంతోనే ..**

అనంతపురం గుడ్ చిల్డ్రన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. క్విజ్ పోటీల్లో పాల్గొనాలంటే వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జిలో పట్టు సాధించాలి. ఈనాడు దినపత్రికను చదవడంతోపాటు ప్రత్యేక పుస్తకాలు చదివాను. క్విజ్‌లో ప్రథమ బహుమతి దక్కింది. ఆనందంగా ఉంది. రాజేష్, అనంతపురం

**సాధన చేశా..**

ఉపన్యాస పోటీల్లో పాల్గొనడానికి కష్టపడ్డాను. అంశాలను నేర్చుకోడానికి అంతర్జాలం ఉపయోగించాను. పుస్తకాలు చదివాను, నేర్చుకొన్న అంశాలపై ఉపన్యసించడానికి సాధన చేశాను. ఈ పోటీల్లో పాల్గొనడంతో ఉపన్యాస భయం తొలగిపోయింది. ఎక్కడైనా వేదికలపై మాట్లాడగలననే నమ్మకం ఏర్పడింది. స్నేహిత, తాడిపత్రి

**ఎంతో ఉపయుక్తం..**

చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. బొమ్మలు గీయడం, చిత్రాలు వేయడం స్వయంగా నేర్చుకొన్నా. కళను, సృజనాత్మకతను ఇతరులకు తెలిపేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తం అవుతాయి. ఉదయ్ సాయిరాం, ధర్మవరం

**కొత్త అంశాలు తెలుసుకున్నా..**

జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందడం ఎంతో ఆనందంగా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాన్ని నేర్చుకోవడానికి గ్రంథాలయానికి వెళ్లి కొత్త అంశాలు తెలుసుకున్నాను. రచనా శైలి మెరుగుపడింది. విజయం సాధించడంతో మనోధైర్యం వచ్చింది. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుకొని ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన కలిగింది. రంగ శివచరణ్, గుంతకల్లు

# రొయ్య.. ధర పడిపోతోందయ్యో

నిడదవోలు: సిరుల పంటగా పేరొందిన రొయ్యల సాగులో ఒడుదొడుకులు తప్పడం లేదు. గత కొన్ని రోజులుగా రోజుకు పది రూపాయల చొప్పున ధర పడిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అంతర్జాతీయంగా పరిస్థితులు బాగా లేనప్పుడు వివిధ కారణాలు చెప్పే ఎగుమతిదారులు ప్రస్తుతం ఏ కారణం లేకుండానే ధరలు తగ్గించేయడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వారు అంటున్నారు. గత ఏడాది మే నెలలో 100 కౌంట్ ధర కిలో రూ.220 ఉండేది. వీటి సాగుకు రూ.240 నుంచి రూ.250 వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి క్రమంగా కిలో రూ.260 వరకు పెరిగింది. ఒక దశలో రూ.270 వరకు కొనుగోలు చేశారు. అలా ధర కొన్ని నెలలపాటు నిలకడగా ఉంది. ఈ నెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు రోజుకు రూ.10 చొప్పున ప్రతి కౌంట్‌కు కేజీకి సగటున రూ.30 వరకు తగ్గిందన్నారు. దీనివల్ల ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు. రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో 85 వేల ఎకరాల్లో సాగు..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట ఉంది. అధికంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 45 వేల ఎకరాల వరకు సాగులో ఉండగా, మిగిలిన సగం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉంది. గతంలో 30 కౌంట్ రొయ్య ధర కిలో రూ.585 వరకు అమ్మిన సందర్భాలు ఉన్నాయి. అటువంటిది ప్రస్తుతం రూ.450 పలుకుతోంది. అంటే కిలోకు రూ.135 వ్యత్యాసం ఉంది. డిసెంబరు 12న 90 కౌంట్ రూ.270 ఉండగా, ప్రస్తుతం రూ.240 ఉంది.

# కాలం చెల్లాయ్.. ప్రాణం తీస్తాయ్

చిలకలూరిపేట : జిల్లాలో కాలం చెల్లిన వంతెనలపై వాహనదారులు భయంభయంగా ప్రయానం సాగిస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించినవి శిథిలావస్థకు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నూతన వంతెనల నిర్మాణం కాగితాలకే పరిమితం కాగా.. ప్రాణ, ఆస్తినష్టంతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. నీటి వనరులు, జాతీయ, రాష్ట్ర రహదారులపై పురాతన వంతెనల స్థానంలో కొత్తవి చేపడితే సాఫీ ప్రయాణానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొండమోడు- పేరేచర్ల జాతీయ రహదారి మార్గంలో సత్తెనపల్లి పట్టణంలోని అమరావతి మేజర్ కాల్వపై ఉన్న పురాతన వంతెనపై ప్రమాదాలు పరిపాటిగా మారాయి. ఆర్టీసీ బస్సులు దీని నుంచి కాల్వలో పడబోయి ఏడాదిన్నరలో రెండుసార్లు పెను ప్రమాదాలు తప్పాయి. పిడుగురాళ్ల, మాచర్ల నుంచి విజయవాడ, గుంటూరు వెళ్తున్న బస్సులు శిథిలావస్థ వంతెనపై నుంచి కాల్వలో పడబోయి రెయిలింగ్‌ను ఢీకొని ఆగాయి. ఈ బ్రిడ్జిపై రెండు వాహనాలు ఎదురుపడితే గంటల తరబడి ట్రాఫిక్ ఆగిపోతుంది. కీలక బ్రిడ్జి నిర్మాణం రెండు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది.

పెదకూరపాడు నియోజకవర్గంలో అమరావతి మండలంలో నుంచి ప్రజా రాజధాని మీదుగా విజయవాడ వెళ్లే మార్గంలో పెద్దమద్దూరు వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. రెండేళ్ల క్రితం కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో ఆపారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో చిలకలూరిపేట నుంచి నరసరావుపేట వెళ్లే మార్గంలో లింగంగుంట్ల వద్ద ఉన్న వంతెన కూలిపోయే



దశలో ఉంది. కుప్పగంజి వాగుపై ఉన్న దీనిపై ప్రయాణం భయం భయంగా ఉంటుంది. యడ్లపాడు నుంచి లింగారావుపాలేనికి వెళ్లే మార్గంలో పెదనందిపాడు బ్రాంచి కాల్వపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది.

మాచర్ల నియోజకవర్గంలో కారంపూడి నుంచి వినుకొండ వెళ్లే మార్గంలో కారంపూడి వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దీని నిర్మాణాన్ని ఏడు దశాబ్దాల క్రితం చేపట్టారు. తరచూ పైపై మరమ్మతులే తప్పించి కొత్త దాని నిర్మాణాన్ని చేపట్టక పోవడంతో సమస్యలుంటున్నాయి. నరసరావుపేట పట్టణ పరిధిలో కోడెల శివప్రసాదరావు స్టేడియం వద్ద ఉన్న కత్తెర చెరువు కాల్వపై నూతన బ్రిడ్జి నిర్మాణం అత్యంత కీలకంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా దీనిపై వాహనాల రాకపోకలు ఆగిపోతున్నాయి. ముంపు సమస్య కూడా నెలకొంటుంది. సత్తెనపల్లి- నరసరావుపేట మార్గంలో నార్నెపాడు, ముప్పాళ్ల వద్ద జీబీసీ, పీబీసీలపై వంతెనలు శిథిలావస్థకు చేరాయి. జీబీసీపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరై ఇటీవలే పనులకు భూమిపూజ చేశారు. పీబీసీపై కూడా కొత్తది నిర్మించాల్సి ఉంది.

వినుకొండ నియోజకవర్గంలో వినుకొండ నుంచి కారంపూడి వెళ్లే మార్గంలో ఈపూరు చెరువు వద్ద ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఈపూరు మండలంలోని ముప్పాళ్ల వంతెన ఎన్నెస్పీ కాల్వపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది.

దశాబ్దాల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన పాత వంతెనల స్థానంలో కొత్తవాటి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు బృందంతో చెప్పారు.

## భవనాశి ప్రక్షాళనకు చర్యలు

అద్దంకి : భవనాశి తటాకం ప్రక్షాళనకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోనుంది. దాతల సహకారంతో సుమారు రెండు వేల ఎకరాల భూమిని తటాకంగా మార్చినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం ఆరు వందల ఎకరాలు మాత్రమే చెరువు గర్భంగా కనిపిస్తోంది. ఇందులోనూ తూర్పు, పడమర దిక్కుల్లో చేపల చెరువులతో మరింత కుంచించుకుపోతుంది. భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు పదేళ్ల నుంచి నిలిచాయి. ఫలితంగా చెరువు చుట్టూ ఆక్రమణదారులు తమ ప్రతాపం చూపుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు చుట్టూ ఆక్రమణలు పెంచేశారు. దీనికితోడు తటాకంలోని నీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనతో భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు అభివృద్ధి చర్యలకు ఉపక్రమించారు. ఫలితంగా దీని విస్తీర్ణం కొలతలు వేయించి, ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధమవుతుంది.నిలిచిన భవనాశి రిజర్వాయరు పనులు: భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు కొన్నేళ్లుగా నిలిచాయి. రూ.27 కోట్ల అంచనాతో 2008లో శంకుస్థాపన చేయగా, మరో రూ.20 కోట్ల నిధుల్ని గత తెదేపా ప్రభుత్వంలో మంజూరు చేశారు. గుండ్లకమ్మ నదికి పల్నాడు జిల్లా గోకనకొండ వద్ద ఆనకట్ట నిర్మించడం, 13కి.మీ. కాలువ ద్వారా భవనాశి చెరువును నింపడం, సుమారు 10 వేల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నదే లక్ష్యం. ఆనకట్ట నిర్మాణం, కాలువ తవ్వకం, భవనాశి కట్ట బలోపేతం వంటి పనులు పూర్తయ్యాయి. కాలువ నిర్మాణంలో చిన్న సమస్యల కారణంగా పుష్కరకాలం నుంచి పనులు ముందుకు సాగలేదు. రైతులకు పరిహారం చెల్లింపు, బ్లాస్టింగ్ పనులు జరగాల్సి ఉంది. దీనికితోడు భవనాశి చెరువు చుట్టూ గల రైతుల పొలాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఆయా నిధులతో సుమారు 70శాతం పనులు పూర్తయ్యాయి.


**పరిహారం పెంపుదలకు పన్నాగం**

సాధారణ పొలానికైతే ఎకరాకు గరిష్ఠంగా రూ.5.5 లక్షల పరిహారం చెల్లించారు. అదే చేపల చెరువులకైతే రూ.12-15 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఈనేపథ్యంలోనే జలాశయం చుట్టూ గల రైతులు చేపల చెరువుల్ని ఏర్పాటు చేస్తున్నారు. అందువల్లనే సుమారు 150 ఎకరాల్లో చక్రాయపాలెం, శింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, చిన్నకొత్తపల్లి తదితర గ్రామాల రైతులు ఇలాంటి ఎత్తుగడ వేస్తున్నట్లు సమాచారం. తాజా పరిణామాల్లో నీటిపారుదల శాఖ అధికారులు జలాశయం విస్తీర్ణం, నీరు నిలిచే ప్రదేశాలను లెక్కించే పనుల్లో ఉన్నారు. తన హయాంలో మంజూరైన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ విశేష కృషి చేస్తున్నారు.

సర్వే చేసి, ఆక్రమణలు తొలగిస్తాం భవనాశి చెరువు పరిధిలో సరిహద్దులు కొలుస్తున్నాం. ఆక్రమణలు గుర్తిస్తే తొలగింపునకు రెవెన్యూ, పోలీసు శాఖ నుంచి సహకారం తీసుకుంటాం. ఆమేరకు నివేదికను ఉన్నతాధికారులకు నివేదించాం.

# ఇంతవరకే చేశామంటే కుదరదు!

చిత్తూరు : ప్రభుత్వ సర్వేలను తూతూమంత్రంగా చేద్దామంటే ఇక కుదరదు! ఎందుకంటే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. డిసెంబరు 29 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు గడువునిచ్చింది. సర్వే పనుల్ని సచివాలయ గ్రామ/వార్డు సిబ్బందికి కేటాయించింది. పర్యవేక్షణ బాధ్యతల్ని ఎంపీడీవో, పురపాలక కమిషనర్ స్థాయి అధికారులకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలంటే సాధారణమే కదా అని అనుకుని నిర్ణీత గడువులోగా చేసింది ఇదే అంటూ యంత్రాంగం నివేదిక సమర్పించింది. దీనిపై సంతృప్తి చెందని ప్రభుత్వం..



సర్వే మళ్లీ మొదలు చేపట్టాలని ఆదేశించింది. లక్ష్యాలు పూర్తయ్యే వరకూ ప్రతి పరిశ్రమను విధిగా సర్వే చేయాలని ఉత్తర్వు జారీ చేసింది.

**25 శాతం కూడా కాక..**

జిల్లాలోని విద్యుత్తు కనెక్షన్ల ఆధారంగా 67 వేల పైచిలుకు ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 25 శాతం కూడా సర్వే చేయలేదు. గతంలో పనిచేస్తున్న పరిశ్రమలు చాలావరకు ప్రస్తుతం మూతబడినట్లు అధికారులు గుర్తించారు. పనిచేస్తున్న వాటికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

సర్వే లక్ష్యం: 67 వేల పైచిలుకు

గడువు: ఫిబ్రవరి 2

చేసింది: 16 వేలు

# పోరంబోకు.. లేఅవుట్ల సోకు

నాయుడుపేట : అధికారుల పర్యవేక్షణ లేమితో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. మేనకూరు రెవెన్యూ పరిధిలో మామిడి కాలువ వెంబడి ఉన్న పోరంబోకు స్థలాలను కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. కాలువ పక్కనే ఉన్న భీమవరం లింకు రోడ్డు స్థలం కూడా పట్టా భూమి అంటూ రోడ్డును స్వాధీనం చేసుకునే యత్నాలు చేయడంతో రాకపోకలు సాగించే ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేనకూరు పారిశ్రామికవాడ ఏర్పడ్డాక ఈ ప్రాంతంలో కాలువలు, వాగులు శ్మశాన వాటికలు, గ్రామనత్తం భూములను కొందరు నాయకుల ప్రోత్సాహంతో వైకాపా ప్రభుత్వంలో ఎక్కడికక్కడ కబ్జా చేశారు. ప్రభుత్వ స్థలాలకు ప్రైవేటు భూముల సర్వే నంబర్లు వేసి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇందులో భాగంగానే మామిడి కాలువ దగ్గర పోరంబోకు భూములను



లేఅవుట్ల కింద విక్రయించారు. కొనుగోలు చేశానంటూ కాలువను పూడ్చేయడంతో ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

**ఎక్కడెక్కడంటే..**

నాయుడుపేట మండం బిరదవాడ, పుదూరు, తుమ్మూరు, ఎల్ఏ సాగరం, మేనకూరు పంచాయతీలో ఎన్టీఆర్ కాలనీ, కోనేటి రాజుపాళెం, ఏపీఐసీసీ భూములను ఆక్రమిస్తున్నారు.

పుదూరు రెవెన్యూ పరిధిలో టిడ్కో గృహాల నిర్మాణానికి స్థలం పోనూ కొంచెం ఖాళీగా ఉంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ భూమిపై కబ్జాదారులు కన్నేసి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారు.

# శింగనమలపై చిన్నచూపేల!

అనంతపురం : శింగనమలకు వెళ్లేందుకు జాతీయ రహదారి మీదుగా చిన్న దారిని వదిలి చేతులు దులిపేసుకుంటున్నారు. ఆ కాసింత దారిని నియోజకవర్గ కేంద్రానికి వదలడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శింగనమలను జాతీయ రహదారి నుంచి విడదీశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు వరుసల రోడ్డుకు మరువ కొమ్మ ప్రాంతాన్ని కలపాలని పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నా జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నారు. జాతీయ



రహదారితో శింగనమల రోడ్డును కలపాలని డిమాండ్ చేస్తున్నా చెవికెక్కడం లేదని జనం వాపోతున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే రోడ్డు ప్రణాళికను మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా సరే ఎవర్నీ లెక్క చేయకుండా ఇంజినీర్లు తమ పని తాము చేసుకుపోతున్నారు. దీనిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ ఎన్‌హెచ్ విభాగం అధికారులతో కలెక్టర్‌తో కలిసి మాట్లాడాం. ఆరువరుసల రహదారితో శింగనమలను కలిపేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు.

# మిగులు బియ్యం మింగుతున్నారు



కర్నూలు : పౌరసరఫరాల నిబంధనల ప్రకారం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము నుంచి జీపీఎస్ అమర్చిన వాహనంలోనే వసతి గృహాలకు లేదా చౌక దుకాణాలకు బియ్యం తరలించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నారు. ప్రైవేటు వాహనానికి జీపీఎస్ ఉండదు. అందులో జీపీఎస్ లేకపోయినా ఉన్నట్లు డ్రైవర్ చూపుతారు. ఎవరికీ అనుమానం రాకుండా ఆర్వో ఉంటుంది. బియ్యం ఎక్కడికి వెళ్తుందో ఆర్వోలో సమగ్రంగా రాస్తారు. అందుకే ప్రైవేటు వాహనాల్లో తరలించే బియ్యం బస్తాలను డూప్లికేట్ ఆర్వోలతో ఎన్నిసార్లైనా గోదాము నుంచి నల్లబజారుకు తరలించొచ్చు. ఆ వాహనం ఎక్కడికి వెళ్తుందో పౌరసరఫరాల గోదాము ఇన్‌ఛార్జులకు, గుత్తేదారులకు మాత్రమే తెలుస్తుంది.

“ మీ వసతిగృహం పేరుతో 10 క్వింటాళ్ల బియ్యం పంపినట్లు ఆర్వో జనరేట్ చేశాం.. ఎవరైనా అడిగితే తడబడకుండా ఆర్వో కాపీలు చూపండి.. అంటూ ముందుగానే చెప్పిపెడతారు.

పౌరసరఫరాల గోదాముల్లో బియ్యం పక్కదారి పడుతోంది. డీలర్లు, విద్యా సంస్థలకు సరఫరా చేసే బియ్యం కోటాలో కోత పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో సక్రమంగా చేసి.. ఎవరికీ అనుమానం రాకుండా గోదాముల నుంచే ప్రైవేటు వాహనాల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. అంతా పారదర్శకంగా సాగుతోందని.. జీపీఎస్ ద్వారా వాహనాల్లో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని, గోదాముల్లో ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలతో తూకాలు వేయిస్తున్నామని అధికారులు చెబుతూ దందాను గుట్టుగా సాగిస్తున్నారు.

**నెలకు 50 టన్నుల వరకు తరలింపు**

ప్రతి 50 కిలోల సంచికి 660 గ్రాముల టేర్ వెయిట్ ఇవ్వాల్సి ఉంది. కానీ పౌరసరఫరాల గోదాముల ఇన్‌ఛార్జులు రేషన్ డీలర్లకు, పాఠశాలలు, వసతి గృహాలకు ఇలా అన్నింటికి కలిపి కొందరికే టేర్ వెయిట్ ఇస్తున్నారు. అదీ డీలర్లలో కొందరు గట్టిగా అడిగితే తప్ప టేర్ వెయిట్ కింద ఒక గోనె సంచి (గన్ని బ్యాగు) 660 గ్రాములకు గాను కొందరికి 500 గ్రాముల చొప్పున ఇస్తుండగా.. 70 శాతం మందికి ఇవ్వక మిగుల్చుకుంటున్నారు. వేబ్రిడ్జిలో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

ప్రతి నెలా టన్నులకొద్దీ బియ్యం నిల్వలు మిగుల్చుకుంటారు. వాటిని జీపీఎస్ వాహనాల్లో కాకుండా ప్రైవేటు వాహనాల్లో దొంగ ఆర్వోలు సృష్టించి అన్ని ఆధారాలున్నట్లు నకలు కాపీలు సృష్టించి బయటకు తరలిస్తున్నారు. పైకి అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా.. లోలోపల చేసేదంతా అక్రమ వ్యాపారమే.

చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం అక్రమంగా తరలిపోతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో నెలకు 50 టన్నులకుపైగా రూ.20-30 లక్షల విలువ చేసే బియ్యం గోదాముల నుంచి అక్రమంగా తరలిపోతోంది.

**ఆర్వోలు సృష్టించి.. ప్రైవేటు వాహనాల్లో తరలించి!**

కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో స్టేజ్-2 కాంట్రాక్టును నలుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. ఈ నలుగురు కలిపి గోదాము ద్వారా స్టేజ్-2 కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. 11 వాహనాలకు జీపీఎస్‌ను అమర్చారు. వాహనాలు కాదని.. ఆర్వోపై పెన్నుతో ఏపీ39 టీజీ 3828 అనే నంబరు వేసి అక్రమంగా బియ్యాన్ని తరలించారు. ప్రైవేటు వాహనాల్లో 40 క్వింటాళ్ల బియ్యం ఎందుకు తరలించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇవి నిజంగా వసతి గృహాలకేనా.. లేక నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకునేందుకు పౌరసరఫరాల అధికారులు, గుత్తేదారు కలిపి చేస్తున్న అక్రమ వ్యాపారమా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

6కేఎన్600: జనరేట్ చేసిన వాహనం కాదని.. ఏపీ 39 టీజీ 3828 నంబరు వాహనంలో ఫిబ్రవరి ఒకటో తేదీన తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఏడీక్యూ1016 నంబరు వాహనంలో ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె బీసీ బాలుర వసతిగృహానికి పది క్వింటాళ్లు, మీదివేముల బీసీ బాలుర వసతిగృహానికి 20 క్వింటాళ్లు, సాంఘిక సంక్షేమ సీజీహెచ్ వసతిగృహానికి 10 క్వింటాళ్లు తరలించనున్నట్లు కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో ఈ ఏడాది జవనరి 30న ఆర్వో జనరేట్ చేశారు. వాటిని జనవరి 31న సదరు గుత్తేదారు తీసుకెళ్లాలి.

# నాడితప్పిన పల్లె వైద్యం



మద్దికెర : మద్దికెర మండల హంప గ్రామంలో రూ.22 లక్షలతో చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నేటికీ అసంపూర్తిగానే మిగిలింది. సంబంధిత సిబ్బంది స్థానికంగా ఉన్న ఓ రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఆ షెడ్డులో రోగులను పరీక్షించేందుకు అవసరమైన వసతులు లేవు. “ గ్రామంలో సౌకర్యంగా ఉండే ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. పల్లె వైద్యం గాలిలో దీపంలా మారింది.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలని కేంద్రం ముందుకొచ్చింది.. జాతీయ ఆరోగ్య విధానంలో భాగంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా వీటిని పట్టించుకోలేదు.. కేంద్రం నిధులిచ్చినా పట్టించుకోలేదు.. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా మిగిలాయి.. ‘కూటమి’ ప్రభుత్వం దృష్టి సారించి అందుబాటులోకి తీసుకొస్తే గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

**నిధులివ్వని వైకాపా** ఉమ్మడి కర్నూలు జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు నత్తకు నడక నేర్పిస్తున్నాయి. ఐదేళ్ల కిందట.. ఇవి పురుడు పోసుకోగా.. పక్కా భవనాలుండాలనే ఆలోచనతో కేంద్రం నిధులిచ్చినా గత వైకాపా ప్రభుత్వంలో వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. దీంతో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. నేటికీ కొన్నింటికి సొంత భవనాలుంటే, చాలా కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

**14 రకాల సేవలందించాలి** గ్రామీణ ప్రాంతంలో సచివాలయ కేంద్రంగా 14 రకాల వైద్య సేవలందించాలి. వీటిలో జనరల్ ఓపీ, ఈఎన్‌టీ, చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మధుమేహం, రక్తపోటు, కౌమార బాలికలు, నవజాత శిశువులు, హెచ్ఐవీ, హెచ్‌బీ ఇలా పలు సేవలున్నాయి. వైద్య కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తయిన ఒక ఎంపీఎల్‌హెచ్‌తో పాటు ఆ ప్రాంత ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలుంటారు. వీరి నెలకు రూ.25 వేతనం చెల్లిస్తారు.

# ఇలకైలాస దారిలో సమస్యల ముళ్లు

ఆత్మకూరు : దట్టమైన అడవి.. రాళ్లు దాటాలి.. కొండలు ఎక్కాలి.. ఆ మార్గంలో వెళ్లడానికి శివరాత్రి, ఉగాది పర్వదినం వేళ మాత్రమే అనుమతి ఉంటుంది. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దర్శనార్థం పది లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది.. పండగకు పది రోజుల ముందు నుంచే భక్తుల రాక మొదలవుతుంది.. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి వేలాదిమంది కాలినడకన మల్లన్న సన్నిధికి చేరుకుంటారు. 13 రోజుల్లో శివరాత్రి పర్వదినం వచ్చేస్తుంది.. సమస్యలు ఇప్పటి వరకు పరిష్కరించలేదు.. తాగునీటి బావులు పాచిపట్టాయి. నీరు ‘చేతి’కందడం లేదు.

**శుభ్రత మరిచారు**

శ్రీశైల ముఖద్వారంగా ప్రసిద్ధిగాంచిన నాగలూటి క్షేత్రం వద్ద భక్తులు మెట్ల మార్గానికి పూజలు చేసి నడిచి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. మార్గ మధ్యలో దాహార్తి తీర్చుకొనేందుకు ఇక్కడి కోనేటిలో నీటిని సీసాల్లో తీసుకెళ్తుంటారు. కోనేరు పాచిపట్టింది. చెట్ల ఆకులు, చెత్తాచెదారంతో నీరు అపరిశుభ్రంగా మారింది. దీనిని శుభ్రపర్చి బ్లీచింగ్ చేయించాల్సి ఉంది.

అన్నదాన శిబిరాల నిర్వాహకులు వంట అవసరాల కోసం పెచ్చెర్వులోని పురాతన బావి నీటిని వినియోగిస్తారు. ఇందులో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చేయించాలి.

పెచ్చెర్వు- భీమునికొలను మధ్య భక్తులకు మఠం బావి నీరే ఆధారం. మలినాలతో కూడిన ఈ నీటిని శుభ్రం చేయాల్సి ఉంది.

**దప్పిక తీర్చే ధారలేవీ**

భీముని కొలను వద్ద నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రవాహం లేక కోనేరు అడుగంటింది. నీరు పాచిపట్టి పచ్చగా మారింది. అందులోనే భక్తులు స్నానాలు చేస్తుండటంతో మరింత అపరిశుభ్రమై దుర్వాసన వస్తోంది. నాగలూటి- పెచ్చెర్వు మధ్య భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతిపంపు పాడైంది.

**40 కి.మీ నరకయాతన**

ఆత్మకూరు పట్టణ సమీపంలో మొదలైన నడక వెంకటాపురం,



నాగలూటి, దామెరకుంట, పెద్ద చెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాస ద్వారం మీదుగా ఇలకైలాసం(శ్రీశైలం) వరకు 40 కి.మీ మేర కొనసాగుతుంది.

వెంకటాపురం గ్రామ శివారులోని మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి నడకదారి మొదలవుతుంది. మొదట్లోనే చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంది. ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగాయి.

మార్గమధ్యంలో పిచ్చిమొక్కలను పూర్తిస్థాయిలో తొలగించలేదు. మొదలు భాగం కొంత వదిలేసి కత్తిరించారు. వాటి కొయ్యలు మొనదేలి ప్రమాదకరంగా మారాయి.

పెచ్చెర్వు నుంచి భీమునికొలనుకు వెళ్లేదారిలో వీరభద్రుని మెట్లు దాటి కొంతదూరం వెళ్లాక మార్గ మధ్యలో ఓ చెట్టు కొమ్మ దారికి అడ్డంగా వాలిపోయింది.

ఎండుటాకులు.. అడుగేస్తే చిక్కులు

మెట్ల మార్గంలోని బండరాళ్లను ఎండుటాకులు కప్పేశాయి. నునుపైన బండలపై రాలిన ఆకులపై భక్తులు అడుగేస్తే జారి పడిపోయే ప్రమాదముంది. గతంలో పాదచారులు జారిపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.


పెచ్చెర్వు నుంచి భీమునికొలనుకు వెళ్లేదారిలో కొండలు ఎక్కి దిగాల్సి ఉంది. కోర్కెల కొండ, కత్తుల కొండ, మఠం బావి సమీపంలోని కొండలపై కొన్నిచోట్లు బండరాళ్లు నునుపుగా ఉన్నాయి. వాటిపై ఎండుటాకులు పడ్డాయి.

# పెన్ అనధికారిక డౌన్

ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రెవెన్యూ శాఖలో పలు సమస్యల ప్రక్షాళనకు తెర తీసింది. వైకాపా హయాంలో చేపట్టిన రీసర్వేతో నష్టపోయిన భూయజమానులకు దన్నుగా నిలిచి గ్రామసభలు నిర్వహించింది. సమస్యల పరిష్కారానికి డిసెంబరు నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న తప్పులపై ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక గ్రామం చొప్పున భూముల రీసర్వే చేపడుతోంది. ఇలాంటి కీలక సమయంలో తహసీల్దార్లు సెలవుపై వెళ్లడం సమస్యగా మారింది. ఆ పనులన్నీ పెండింగ్‌లో పడిపోతున్నాయి.

**తల పట్టుకుంటున్న ఉన్నతాధికారులు:** ఇప్పటికే వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలోనూ భూ సంబంధిత సమస్యల పైనే ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మండల తహసీల్దార్లు సెలవులు పెడుతుండటంతో వీటి పరిష్కారానికి ఏంచేయాలనే విషయమై జిల్లా ఉన్నతాధికారులు తల పట్టుకుంటున్నారు. సెలవులు ఇవ్వడానికి జిల్లా పాలనాధికారి ససేమిరా అంటున్నా.. ఆరోగ్యం బాగాలేదని చెబుతుండటంతో మానవతా దృక్పథంతో వ్యవహరించక తప్పని పరిస్థితి నెలకొంది.

**పెరుగుతున్న ఒత్తిడులు!:** కొన్నిచోట్ల రెవెన్యూపై రాజకీయ ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు తమ పనులు చేయాలంటూ తహసీల్దార్లపై దుర్భాషలాడుతున్నారు. దీంతో



అధికారులు మానసికంగా కుంగిపోతున్నారు. విధులు నిర్వహించలేమనే నైరాశ్యంలోకి వెళ్తున్నట్లు సమాచారం. వైకాపా హయాంలో అక్రమాలకు పాల్పడిన కొందరు తమ తప్పులు బయటికి వస్తున్నాయని.. అనారోగ్యం సాకు చూపుతున్నారనే విమర్శలూ ఉన్నాయి. అధికారుల గైర్హాజరుతో తమ దస్త్రాలకు పరిష్కారం దక్కక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. ‘ఆరోగ్యం బాగాలేదంటూ తహసీల్దార్లు సెలవులు పెడుతున్నారు. పరిశీలించి అవసరం లేకుంటే రద్దు చేస్తున్నాం. డిప్యూటీ కలెక్టర్ల సహకారంతో పరిస్థితిని సమీక్షిస్తున్నాం’ అని తెలిపారు. సీఎస్‌పురం తహసీల్దారు గత నెల 21 నుంచి ఈ నెల 9 వరకు సెలవు పెట్టారు. రాజకీయ ఒత్తిడి కారణంగా విధులకు రావడం లేదని సమాచారం. డిప్యూటీ తహసీల్దారుకు అక్కడ పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు.

రాచర్ల తహసీల్దారు భార్య అనారోగ్యానికి గురవ్వడంతో ఆయన సెలవుపై వెళ్లారు.

తర్లుపాడు తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డిపై పలు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రస్తుతం డీటీ విజయ్‌భాస్కర్ ఇన్‌ఛార్జి తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

దొనకొండ తహసీల్దారు రమాదేవి అనారోగ్యం కారణంగా మూడు రోజులుగా సెలవులో ఉన్నారు. నాలుగు రోజుల తర్వాత విధుల్లో చేరే అవకాశం ఉంది. తాళ్లూరు తహసీల్దారు సంజీవరావు అనారోగ్యంతో దాదాపు 20 రోజుల నుంచి సెలవులో ఉన్నారు. ప్రస్తుతం డీటీ ఇమ్మాన్యుయేల్ రాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. పుల్లలచెరువు తహసీల్దారు నజీర్ అహ్మద్ నవంబరు 22 నుంచి సెలవులో ఉన్నారు. యర్రగొండపాలెం తహసీల్దారుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆయన కూడా సెలవుపై వెళ్లడంతో ఆ రెండు మండలాలకు ఇన్‌ఛార్జిలుగా డీటీలు వ్యవహరిస్తున్నారు.

# దొడ్డిదారుల్లో పెద్దదోర్నాల

ఒంగోలు : అధికారమే అండగా గత వైకాపా ప్రభుత్వంలో ‘భూ’చోళ్లు రెచ్చిపోయారు. ఫ్రీ హోల్డ్ పేరిట కొందరు పెద్దలు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని పది మండలాల్లో 666 రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు సర్వే చేపట్టి సుమారు 20 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జాబితాలో చేర్చినట్లు గుర్తించారు. కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు ఎక్కువ నమోదైన వాటిలో విస్తీర్ణంపరంగా పెద్దదోర్నాల రాష్ట్రంలోని మొదటి పది మండలాల్లో ఒకటి కావడం గమనార్హం. ఆ మండలంలో 341.06 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయగా.. అందులో 200.94 వరకు నిబంధనలకు విరుద్ధంగా చేసినట్లు తేలింది.

**సొమ్ము చేసుకున్న వైకాపా నేతలు**

వైకాపా ప్రభుత్వం హయాంలో గత ఏడాది అసైన్డ్ నిబంధనలు సవరించారు. 2003కు ముందు అసైన్డ్ చేసిన భూములపై అనుభవదారులకు హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులున్న పేదలకు ఉపశమనం కలిగించినా.. వాటి వెనుక వైకాపా నాయకులు చక్రం తిప్పారు. రహదారుల



వెంట, బహిరంగ మార్కెట్‌లో విలువ కలిగిన వాటిపై కన్నేశారు. అవగాహన లేని రైతుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకున్నారు.

**అర్హత లేని వాటికీ చోటు**

జిల్లా వ్యాప్తంగా 22ఏ, అసైన్డ్ ల్యాండ్ ఫ్రీ హోల్డ్, చుక్కల భూములు, షరతులు గల పట్టాకు సంబంధించి మొత్తం 1,75,722.73 ఎకరాల క్రయ, విక్రయాలకు హక్కులు కల్పించారు. అందులో అసైన్డ్ ఇతర ఫ్రీ హోల్డ్‌వి 1,36,783.60 ఎకరాలున్నాయి. అందులో ఇప్పటికే సుమారు రెండు వేల మంది రైతుల క్రయ, విక్రయాలకు సంబంధించి 3,638 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. జిల్లాలోని పలు మండలాల్లో ఫ్రీ హోల్డ్‌కు అర్హత లేని వాటికీ ఆ జాబితాలో చోటు కల్పించారు. కనిగిరి, సీఎస్‌పురం మండలాల్లో ఎక్కువ ఫిర్యాదులు అందడంతో కనిగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని ఇప్పటికే దస్త్రాల పరిశీలన చేపట్టారు. అయినా బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది.

# తమలపాకు రైతు ధరహాసం

పాయకరావుపేట : తమలపాకు ధర రోజురోజుకు ఎగబాకుతోంది. ఇప్పటివరకు గిట్టుబాటు ధర రాక నిరాశ చెందిన అన్నదాతకు పెరిగిన ధర ఊరటనిస్తోంది. ఆకులకు మంచి ధర వస్తోంది. పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు. సత్యవరం, మాసాహెబ్‌పేట, మంగవరం, అరట్లకోట, కొత్తూరు, శ్రీరాంపురం, గోపాలపట్నం సహా ఎస్.రాయవరం, లింగరాజుపాలెం, వమ్మవరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట ఉంది. ఆకులను విశాఖ, రాజమహేంద్రవరం, హైదరాబాద్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు భూములను కౌలుకు తీసుకునే పంట పండిస్తున్నారు. కౌలు, పెట్టుబడులు కలిపి సాగు వ్యయం సుమారు రూ.2 లక్షలు దాటిపోతోంది. ఇప్పటివరకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.



పెట్టుబడిపైనా ఆశలు వదులుకున్నారు. ఈ తరుణంలో ధర అనూహ్యంగా ఊపందుకుంది. సుమారు 180 ఆకులను కట్టగా కడతారు. దీన్ని పంతాగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఒక్కో పంతా ధర రూ. 40 వస్తోంది. ఇది మరింత పెరిగే అవకాశముంది. రానున్న రోజుల్లో శుభముహూర్తాలు ఉండటం, ఊరూరా పెళ్లి బాజాలు మోగనుండటంతో తమలపాకులకు డిమాండ్ రానుంది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఏప్రిల్ నెలాఖరుకు దిగుబడి తగ్గుతుంది. ఆ సమయానికి ఈ ప్రాంతంలో తోటలు నిండుగా ఉంటాయి. దీంతో ఎగుమతులు మరింత ఊపందుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**గిట్టుబాటు ధరతో ఊరట**

తమలపాకు ధర ప్రస్తుతం పెరుగుతోంది. ఇప్పటివరకు తక్కువ ధర ఉండటంతో ఇబ్బందులు పడ్డాం. పెట్టుబడులపై ఆశ వదులుకున్నాం. దీనికితోడు సాగు వ్యయం ఎక్కువైంది. తెగుళ్ల తాకిడి అధికంగా ఉంటోంది. ఎగుమతులు పెరుగుతాయి.

– వీరబాబు, తమలపాకు రైతు

**మూడు నెలలూ ఆశాజనకమే**

రానున్న మూడు నెలలు ఆశాజనకంగానే ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి ఎగుమతులు తగ్గుతాయి. దీనికితోడు ఇక్కడ ఆకుకు మంచి డిమాండ్ ఉంది. ఈ ధర మరింత పెరిగే అవకాశముంది. రైళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఆకులను పంపిస్తున్నాం.

– ఎస్.నూకరాజు, సత్యవరం

# చోటు పరిమితం.. వాహనాలు అధికం

సింహాచలం : సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తుల్ని పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. సింహాద్రినాథుడి దర్శనానికి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొవిడ్ అనంతరం భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రధానంగా సొంత వాహనాల్లో వచ్చే వారికి సంఖ్య ఎక్కువ. సింహగిరిపై పరిమితంగా ఉన్న పార్కింగ్ ప్రదేశం చాలకపోవడంతో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

**ఆలయ ధర్మకర్త దృష్టికి సమస్య..:** సింహగిరిపై పార్కింగ్ సమస్యను ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దృష్టికి తీసుకెళ్లాం. అలాగే ఇటీవల అప్పన్న దర్శనానికి వచ్చిన రాష్ట్ర హోంమంత్రి అనిత ద్వారా దేవాదాయశాఖ మంత్రికి తెలియజేశాం. ఆలయం వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రాంగణంలో పోలీసు అవుట్ పోస్టు, పార్కింగ్‌కు వినియోగిస్తే బాగుంటుందని సూచించాం.– శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ, పశ్చిమ జోన్

**కిక్కిరిసిపోతున్న పార్కింగ్..**

సింహగిరిపై రాజగోపురం ఎదురుగా, జోడుభద్రాలు, టీవీ టవర్ రోడ్డు వంటి ప్రాంతాల్లో అత్యధికంగా 300 నాలుగు చక్రాల వాహనాలకు సరిపడే పార్కింగ్ ఉంది. ఇది కాకుండా లోవతోట, బస్టాండు, ఇతర ప్రాంతాల్లో సుమారు 1,500 ద్విచక్ర వాహనాల్ని నిలపొచ్చు. ప్రస్తుతం ఉన్న ఈ ప్రాంగణాలు శాస్త్రీయంగా లేకపోవడంతో నిలిపిన వాహనాలను తిరిగి బయటకు తీసుకురావడం పెద్ద ప్రహసనంగా మారింది. ఖాళీ ప్రదేశాలనే పార్కింగ్ ప్రాంగణాలుగా వినియోగించడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. టీవీ టవర్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాల కోసం సుమారు కిలో మీటరుపైగా భక్తులు నడవాల్సిన



దుస్థితి నెలకొంది. చందనోత్సవం వంటి పర్వదినాల్లో వాహనాలను కొండపైకి అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేకమైన పార్కింగ్ ప్రాంగణాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ భక్తుల నుంచి వస్తోంది.

స్వామి దర్శనానికి వచ్చే భక్తులు..

సాధారణ రోజుల్లో: 25–30వేల మంది

శని, ఆదివారాల్లో: 50,000

మల్టీలెవల్ పార్కింగ్ ఆలోచన ఉంది..: సింహాచలం బృహత్తర ప్రణాళికలో మల్టీలెవల్ పార్కింగ్ ప్రతిపాదన ఉంది. సింహగిరిపై పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల ప్రాంగణంలో ఇది ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. టీవీ టవర్ నుంచి సత్తమ్మ ఆలయం వరకు హిల్‌టాప్ రహదారిని విస్తరించి పార్కింగ్‌కు అనుకూలంగా మార్చాలన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. హిల్‌టాప్ రహదారి నుంచి వన్‌వే వచ్చే విధంగా ఆలయం వెనుక నుంచి రోడ్డు వేసే విషయంపై నిపుణులతో చర్చిస్తున్నా. రాబోయే రోజుల్లో సింహగిరిపై పార్కింగ్ ప్రాంగణాల ఆవశ్యకత ఎంతో ఉంది. త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి, సింహాచలం దేవస్థానం

# ఆశజూపి.. అంతా దోచి!



అనంతపురం : అనంతపురం జిల్లాలో రోజుకు 7 నుంచి 9 సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదవుతున్నాయి. సైబర్ క్రైం ద్వారా బాధితులు జిల్లాలో 2023లో రూ.1.45 కోట్లు, 2024లో రూ.1.76 కోట్లను పోగొట్టుకున్నారు.. ఆన్‌లైన్ సాంకేతికతతో సైబర్ నేరగాళ్లు ఏ విధంగా పేట్రేగిపోతున్నారో చెప్పేందుకు ఈ గణాంకాలు నిదర్శనం.అమాయకులు, డబ్బు అత్యవసరం ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పతున్నారు. వీటికి విద్యావంతులు సైతం బలవుతున్నారు. తాజాగా డిజటల్ నగదు చెల్లింపులు, లావాదేవీల్లో లొసుగుల్ని లక్ష్యంగా చేసుకొని స్కామర్లు సవాల్ విసురుతున్నారు.

**జంప్డ్ డిపాజిట్ స్కామ్**

'జంప్డ్ డిపాజిట్ స్కామ్'.. అంటే దుండగులు ముందుగా యూపీఐ ద్వారా బాధితుడి బ్యాంకు ఖాతాకు డబ్బు పంపుతారు. డబ్బు జమ అయినట్లు మెసేజ్ వచ్చిన వెంటనే చాలామంది బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకునేందుకు ఫోన్ పే, గూగుల్ పే యాప్‌లను ఆశ్రయిస్తారు. బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి పిన్‌ను నమోదు చేయగానే వెంటనే, అతని ఖాతా నుంచి డబ్బు విత్ డ్రా అయిపోతుంది.

పిన్ నంబరును ఎంటర్ చేయగానే ఆ వ్యక్తి ఖాతాను దుండగులు యాక్సెస్ చేసి ఖాతాలో డబ్బంతా ఊడ్చేస్తారు.

తొలుత రూ.300 ఖాతాలో వేస్తారు. దానికి స్పందించక పోతే రూ.500 ఇలా పెంచుకుంటూ పోయి రూ.2 వేలు వరకు ఖాతాలోకి వేస్తారు. ఏదో ఒక సమయంలో స్పందిస్తారని స్కామర్లు తెలివిగా ఇలా వ్యవహరిస్తారు.

అనంతపురం నగరానికి చెందిన భార్యాభర్తల చరవాణులకు 'తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలనుకుంటున్నారా? అయితే ఈ లింకు క్లిక్ చేయండంటూ 'ఓ మెసేజ్ వచ్చింది. అందులో తొలుత రూ.వెయ్యి పెట్టుబడి పెట్టగా రెట్టింపు కలిపి ఖాతాకు జమైంది. ఇలా నాలుగైదు దశల్లో ఆదాయం చూపి ఆశ చూపారు. అత్యాశకు పోయిన బాధితులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఒకేసారి రూ.కోటి పెట్టారు. ఆ సొమ్ము అవతలి స్కామర్లకు బదిలీ చేశారు. అంతే అవతలి నుంచి స్పందన లేదు. మోసపోయామని గుర్తించి బాధితులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

**అప్రమత్తతే శ్రీరామరక్ష - జగదీశ్, అనంతపురం ఎస్పీ**

సామాజిక మాధ్యమాల వేదికగా వచ్చిన ప్రకటనలు చూసి పెట్టుబడులు పడితే మోసపోతారు. కమిషన్లకు ఆశపడి అనుమానిత ఖాతాలకు డబ్బు తరలించడం, రిజిస్టర్ కాని సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం క్షేమం కాదు. ఫోన్లకు వచ్చే అపరిచిత లింక్‌లు, ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు. అనుమానం కలిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలపాలి..

**ఇలా చేయాలి..**

యాప్‌లోకి వెళ్లేందుకూ, నగదు చెల్లించేందుకూ పిన్ నంబర్లు వేర్వేరుగా ఉండాలి. చరవాణికి వచ్చిన మెసేజ్‌ను 30 నిమిషాలదాకా తెరవకూడదు. డిజిటల్ చెల్లింపులకు, యూపీఐ కోసం ప్రత్యేక ఖాతాను నిర్వహించడం ఉత్తమం.

తక్కువ నగదు నిల్వతో పొదుపు ఖాతానే అందించే బ్యాంకును ఎంచుకుని, ఆ ఖాతాను యూపీఐ చెల్లింపుల యాప్‌తో అనుసంధానం చేసుకోవడం మంచిది.

# జల్‌జీవన్.. నవీకరణ పథం



అనంతపురం : గ్రామీణులకు తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన జల్‌జీవన్ పథకం పనుల్లో కూటమి ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. పాత పనులను రద్దు చేసింది. జిల్లా మొత్తం మీద 31 మండలాల్లోని గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఈనేపథ్యంలో ప్రత్యేక కథనం. మూడేళ్ల కిందట మొదటి దశలో గ్రానీస ఇంజినీర్లు పలు గ్రామాల్లో తాగునీటి పనులు చేయించారు. ఏడాదిన్నర కిందట మంజూరు చేసిన పనులు అరకొరగా జరిగాయి. తాజాగా వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటి వరకు గ్రానీస ఇంజినీర్లు గ్రామాల్లో బోర్లువేసి ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇస్తూ వచ్చారు. గ్రామాల్లో ఇదివరకే ఉన్న తాగునీటి పథకాల ద్వారా ప్రజలు సొంతంగా కుళాయిలను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని కూడా జల్‌జీవన్ పథకంలో ఏర్పాటు చేసినట్లు అధికారులు కాకిలెక్కలు వేశారు.

**నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాలకు రెండో విడతలో మంజూరైన పనులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా గుంతకల్లు నియోజకవర్గానికి, శింగనమల నియోజకవర్గాలకు గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి తాగునీటిని అందించాలని నిర్ణయించారు. అలాగే తాడిపత్రికి గండికోట నుంచి నీరు ఇస్తారు. తొలి విడతలాగా గ్రామాల్లో బోర్లు వేయడం వల్ల భవిష్యత్తులో నీటి సమస్య ఉత్పన్నం కానుంది. అందుకే ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపేందుకు పథకంలో మార్పులు చేసింది. ఈవిషయమై గుత్తి గ్రానీస డీఈఈ రెహెనావాసీం మాట్లాడుతూ పాతపనులు రద్దయ్యాయన్నారు. కొత్తగా పనులకు అంచనాలు వేస్తూ ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.

**సర్వేతో కాక్కిలెక్కలు మాయం**

కూటమి ప్రభుత్వం తాజాగా కుళాయి కనెక్షన్లపై సర్వేచేయించింది. వార్డు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులతో సుమారు నెలపాటు సర్వేచేయించి పక్కాగా లెక్కలు తేల్చారు. జిల్లా మొత్తం మీద 3.33 లక్షల కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా లక్షదాకా ఇవ్వాల్సి ఉంది.

**763 పనులకు 113 మాత్రమే పూర్తి**

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో రెండో విడతలో ప్రభుత్వం రూ.156.55 కోట్లు మంజూరు చేసింది. రెండు విడతల్లో మంజూరైన 763 పనులకు గాను కేవలం 114 పనులను మాత్రమే పూర్తి చేశారు. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లోని పలు గ్రామాల్లో అధికారులు బోర్లు వేసి పైపులైన్లను విస్తరించారు. రెండో విడతలో పనులు మొదలు కాలేదు. నిధులను కేంద్ర ప్రభుత్వం తనవాటా ఇవ్వగా గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రం వాటా ఇవ్వలేకపోయింది. ఈకారణంగానే రెండో విడతలో పనులు మొదలేకాలేదు.

# మిరప.. ఏటా కష్టాలేనప్పా



ఉరవకొండ : కొన్నేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఏటా పెట్టుబడి పెరుగుతోంది. దీనికితోడు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోగా.. పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మూడేళ్లుగా ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. అనంతపురం జిల్లాలో ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో దాదాపు 50 వేల ఎకరాలు.. గుత్తి, గుంతకల్లు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో 10 వేల ఎకరాలకు పైగా మిరప పంట సాగైంది. అందులో బ్యాడిగ, తేజ ఇతర రకాలు ఉన్నాయి. ఎకరాకు సగటున రూ.2.20 లక్షలు పెట్టుబడి పెట్టారు. బ్యాడిగ, 2043 రకాలు ఎకరాకు సగటున 12 క్వింటాళ్లు, మిగతా రకాలు ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో కోతలు ప్రారంభం అయ్యాయి. కొందరు పొలాల్లో ఆరబెడుతున్నారు.

**మార్కెట్ సదుపాయం లేక..**

ఈ ప్రాంతంలో మిరప మార్కెట్ లేదు. పొరుగున ఉన్న కర్ణాటకలోని బ్యాడిగ, హుబ్బళ్లి, మంగళూరులో మాత్రమే ఆ సదుపాయం ఉంది. అనంత నుంచి అక్కడికి మిరప పంటను తరలించడానికి 30 కిలోలు బరువు ఉన్న ఒక్కో సంచికి రూ.120 వరకు ఖర్చు అవుతుంది. వ్యయప్రయాసలతో పంటను తరలించిన తరువాత గిట్టుబాటు ధర లేకపోతే వెనక్కి తీసుకురావడం కుదరదు. దీంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. మరికొందరు రైతులు స్థానిక దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటున్నారు.

**గిట్టుబాటు ఏదీ?**

ప్రస్తుతం మిరపకు గిట్టుబాటు ధర ప్రశ్నార్థకంగా మారింది. బ్యాడిగ రకం క్వింటాలు కొత్తది మంచి రకం రూ.33వేలు, పాతది రూ.20వేలు పలుకుతోంది. 2043 కొత్తది క్వింటాలు రూ.16వేలు, పాతది రూ.11వేలు, మిగతా రకాలు క్వింటాలు రూ.7వేల నుంచి 9వేలు పలుకుతున్నాయి. గత రెండేళ్లుగా మిరప ఎగుమతి ఆగిపోవడంతో గిట్టుబాటు ధర దక్కడం గగనంగా మారింది.

: గతేడాది మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాలకు చెందిన రైతులు కర్ణాటకలో వివిధ ప్రాంతాల్లోని శీతల గోదాములో నిల్వ ఉంచారు. దాదాపు కోటి సంచుల వరకు నిల్వ ఉన్నాయి. దీంతో గోదాముల అద్దె రైతులకు భారంగా మారింది.

**ఆరు ఎకరాల్లో వేశా...- హనుమేశ్, పాలికి**

గత ఏడాది 12 ఎకరాల్లో మిరప సాగు చేయగా, 550 సంచుల దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర లేక పోవడంతో శీతల గోదాములోనే నిల్వ ఉంచా. ఇప్పటికీ ధర లేక పోవడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో పంట సాగు చేశా. కొత్త పంటకూ గిట్టుబాటు ధర దక్కేలా లేదు.

# నిబంధనలకు పాతరేసి.. ఫ్రీ హోల్డ్ చేసి..

తిరుపతి : ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిబంధనలు గాలికి వదిలేశారు. చివరి ఏడాదిలో అక్రమాలు, కబ్జాలకు అంతే లేకుండా పోయింది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న చందంగా చెలరేగారు. అసైన్డ్ భూములకు భూ యాజమాన్య (ఫ్రీ హోల్డ్) హక్కులు కల్పించడంలో జరిగిన అవకతవకలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. 2003కు ముందు అసైన్డ్ పట్టాలు పొందిన వ్యక్తులకు ఫ్రీ హోల్డ్ చేసి పట్టా ఇవ్వాలని వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు దాదాపు మూడు నెలలకు ముందు హడావుడిగా ఉత్తర్వులు ఇచ్చేశారు. త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్లతో రెండు రోజులకోసారి టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి పరుగులు పెట్టించారు. అదేవిధంగా కలెక్టర్, జేసీలకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు మొదలు సీఎస్ వరకు తరచూ ఆదేశాలు ఇచ్చారు. ఎంతవరకు పని జరిగిందో తెలుసుకోవడానికి నివేదికలు అడిగేవారు. దీంతో అనివార్యంగా క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. కొందరు దీన్ని సదవకాశంగా తీసుకున్నారు. రైతుల నుంచి లంచాలు వసూలు చేశారు. అదేవిధంగా వైకాపా నాయకులు చెప్పిన సూచనలు తూచా తప్పకుండా పాటించారు.

బంగారుపాళ్యం, వి.కోట, కుప్పంలోనే.. ఫ్రీ హోల్డ్ అవకతవకల్లోనూ బంగారుపాళ్యం, వి.కోట, కుప్పం మండలాలు అగ్రస్థానంలో ఉన్నాయని ఉన్నతాధికారులు అంచనాకు వచ్చారు. ఎక్కడెక్కడ ఎవరెవరు కీలక పాత్ర పోషించారనే అంశంపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారని సమాచారం. రానున్న రోజుల్లో బాధ్యులపై చర్యలు తప్పవని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి.



**ఒకటికి రెండుసార్లు పరిశీలించి..**

చిత్తూరు జిల్లావ్యాప్తంగా 1.59 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్‌గా చేశారు. దీనిపై అప్పట్లోనే తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే గతేడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత గతేడాది నవంబరులో మరోసారి పునః పరిశీలన చేయాలని స్పష్టం చేసింది. ఇలా ఒకటికి రెండుసార్లు విచారించారు. ఇలా స్పష్టంగా లెక్కలు తీసిన తర్వాత 1.06 లక్షల ఎకరాలను ఎటువంటి నిబంధనలు పాటించకుండానే భూ యాజమాన్య హక్కులు కల్పించారని నిర్ధారించారు.


**మేత భూములనూ వదలక..**

తిరుపతి జిల్లాలో 79 వేల ఎకరాలకు యాజమాన్య హక్కులు ఇవ్వగా 32 వేల ఎకరాలు సక్రమంగా జరగలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉల్లంఘనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఇక్కడ గుట్ట పోరంబోకు, మేత భూములనూ ఫ్రీ హోల్డ్ చేశారు. వైకాపా నాయకుల హస్తమే దీనికి ప్రధాన కారణం. పని చేయకుంటే నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాలని హెచ్చరించడంతో రెవెన్యూ యంత్రాంగం వారికి దాసోహమైంది. దీనికితోడు కొందరు అధికారులు పెద్దఎత్తున డబ్బులు గుంజి నిబంధనలకు తూట్లు పొడిచారు.

# 'మిత్ర'మా మనకోసం!

విశాఖపట్నం: పౌరసేవల్లో వేగం పెంచేందుకు, ప్రజల వినతుల పరిష్కారానికి 'మన మిత్ర' (వాట్సప్ గవర్నెన్స్)ను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఇంటి నుంచే పలు రకాల సేవలు పొందేలా వాట్సప్ నంబర్ (9552300009)ను ఆరంభించింది. సెల్‌ఫోన్‌లోనే 161 సేవలు అందుకోవచ్చు. జనవరి 30 నుంచి ఇది అమల్లోకి రాగా నగర ప్రజల వినియోగం క్రమంగా పెరుగుతోంది. గతంలో పలు రెవెన్యూ సమస్యలపై సాధారణ విధానంలో దరఖాస్తు చేసిన వారు...వాటి పరిస్థితేంటో తెలుసుకుంటున్నారు. నగర పరిధిలోని వారితో పాటు ఆనందపురం, పద్మనాభం,పెందుర్తి, భీమిలి మండలాల ప్రజలు ఈ సేవలను వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతున్నాయి.

ఇలా: ఈ సేవలు పొందాలనుకునే వారు వాట్సప్‌లో ప్రభుత్వం పేర్కొన్న నంబరుకు మొదట హాయ్ అని పంపితే ప్రధానంగా 8 విభాగాల సేవలు వస్తాయి. అందులో అవసరమైన దాన్ని ఎంచుకోవాలి. ఆ తర్వాత ఎంచుకున్న సేవ ఆధారంగా



వ్యక్తిగత వివరాలు, ఆధార్ నంబరు నమోదు చేస్తే సరిపోతుంది. ఆంగ్లం, తెలుగు.. రెండింటిలోనూ సేవల వివరాలు అందుబాటులో ఉన్నాయి.

**అరచేతిలో 161 రకాల ప్రభుత్వ సేవలు**

అందుబాటులోకి వాట్సాప్ నెంబర్ 9552300009

పద్మనాభం మండలం బచ్చుపేటకు చెందిన మహిళ తనకు ఇంటిని మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తును స్వీకరించినట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో దరఖాస్తు స్థితి ఏమిటో సెల్‌ఫోన్‌లోనే చూసుకున్నారు. ఇలా ... నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాట్సాప్ సేవలతో ఇంటి నుంచి బయటకు వెళ్లకుండానే సమాచారం వెంటనే తెలుసుకుంటున్నారు.

చురకలు



## అనసూయ.. చీరలో స్టన్నింగ్ గ్లామర్ ట్రీట్

టాలీవుడ్ లో స్టార్ యాంకర్ గా తనదైన ముద్ర వేసుకున్న అనసూయ భరద్వాజ్.. సినిమాల్లోనూ తన హవాను కొనసాగిస్తూ దూసుకుపోతోంది. అందం, అభినయం, గ్లామర్, స్టైల్ అన్నీ కలగలిసిన ఆమె.. ఎప్పటికప్పుడు కొత్త లుక్స్ తో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా అనసూయ మరోసారి తన స్టన్నింగ్ లుక్స్ తో సోషల్ మీడియాలో హీట్ పెంచేసింది. వైట్ ఫ్లోరల్ ట్రాన్స్‌పరెంట్ సారీతో గ్లామరస్ లుక్ లో దర్శనం ఇచ్చి అందరినీ షాక్ కి గురి చేసింది. ఈ ఫోటోషూట్ లో అనసూయ హాల్టర్ నెక్ వైట్ బ్లౌజ్ కు మ్యాచ్ అయ్యే ఫ్లోరల్ ప్రింటెడ్ సారీలో అదరగొట్టింది. స్టైలిష్ హెయిర్, మినిమల్ జ్యువెల్రీతో ఆమె ఇచ్చిన పొజెస్ మరో లెవల్ లో ఉన్నాయి. ట్రాన్స్‌పరెంట్ లుక్ తో తన గ్లామర్ ను మరింత హైలైట్ చేసింది. సారీలో గ్లామర్ ను హైలెయ్ చేయడమంటే ఇదే అనిపించేలా



కనిపిస్తోంది. ఒకవైపు అందం, మరోవైపు తన మైమరిపించే ఎక్స్‌ప్రెషన్స్ తో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అనసూయ స్టైల్, ఫ్యాషన్ గురించి చెప్పనక్కర్లేదు. ఆమె ఏ లుక్ లో కనిపించినా ట్రెండింగ్ లోకి వచ్చేస్తుంది. ఇప్పుడు ఈ ట్రెడిషనల్ సారీ లుక్ లో కూడా గ్లామర్ డోస్ పెంచుతూ ఫ్యాన్స్ ని కనువిందు చేస్తోంది. ఆమె కేవలం యాంకర్ గా మాత్రమే కాకుండా ఓ సక్సెస్‌ఫుల్ నటిగా కూడా ప్రూవ్ చేసుకుంది. 'పుష్ప'లో దాక్షయణిగా నటించి మరో లెవల్ లో పేరు తెచ్చుకుంది. త్వరలోనే రానున్న మరికొన్ని బిగ్ మూవీస్ లోనూ అనసూయ కీలక పాత్రలో కనిపించనుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా, నెటిజన్లు ఆమె అందాన్ని చూసి ఫిదా అవుతున్నారు. కామెంట్స్ విభాగంలో 'అమ్మో మైండ్ బ్లాక్ అయిపోయింది', 'అనసూయ స్టన్నింగ్ గ్లామర్ ', 'వైట్ లో ఎంతో అందంగా ఉన్నావ్' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## పుష్ప 2 కావేరి.. చీరలో అందాల మెరుపులా..

'పుష్ప 2' సినిమా విజయం సాధించడంతో అందులోని ప్రతి పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ గా నిలిచింది. ఇందులో 'కావేరి' పాత్రలో నటించిన పావని కరణం ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోటోషూట్‌లతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ఎప్పుడూ సింపుల్ లుక్‌లో కనిపించే పావని, తాజాగా స్టైలిష్ ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోతూ కుర్రాళ్ల గుండెల్లో దడ పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే పావని, తాజాగా గోల్డెన్ శారీలో దిగిన ఫోటోలను షేర్ చేసింది. ప్రాముఖ్యమైన అవార్డు షో కోసం స్టైలింగ్ అన్ని స్వయంగా చేసుకున్నానని తెలిపింది. ఆమె కర్లీ హెయిర్, మినిమల్ మేకప్, జ్యువెలరీతో ఓ రాయల్టీ ఫీల్‌ను తీసుకువచ్చింది. సింప్లిసిటీ లో ఉండే అందాన్ని మరోసారి నిరూపించిన ఈ లుక్స్, నెటిజన్లను మాయ చేస్తున్నాయి. న్యెట్ లైట్స్ లో ఆమె ఫోజ్ చేసిన ఫోటోలు హాట్ టాపిక్ గా మారాయి. పావని కరణం కెరీర్ విషయానికొస్తే, ఆమె 'పరేషాన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. "సమోసా తింటావా శిరీష?"



అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిన్నా చితకా సినిమాల్లో నటించిన ఈ అమ్మడు, 'పుష్ప 2'లో కీలక పాత్ర పోషించడం ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయ్యింది. పుష్ప రాజ్ అన్నయ్య కూతురుగా 'కావేరి' పాత్రలో నటించి ప్రేక్షకుల మనసులు దోచుకుంది. ఆ సినిమాలో తన నటన ఎంత బలమైనదో ఇప్పుడు ఈ ఫోటోషూట్‌లోనూ తన గ్లామర్‌తో మరోసారి నిరూపిస్తోంది. సాధారణంగా నటీనటులు వెస్ట్రన్ లుక్స్‌లో హాట్ ఫోటోషూట్‌లు చేస్తుంటారు. కానీ పావని ట్రెడిషనల్ లుక్‌లోనూ అందాన్ని చాటుకోవచ్చు అని ప్రూవ్ చేసింది. ఎప్పుడూ మోడరన్ లుక్‌లో కాకుండా, సింప్లిసిటీ లోనూ ఎంత అద్భుతంగా మెరిసిపోవచ్చో ఈ ఫోటోలు చెబుతున్నాయి. అంతే కాకుండా అవార్డును పట్టుకుని ఇచ్చిన పోజులు ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ లా నిలిచేలా ఉన్నాయి. త్వరలో పావని మరిన్ని వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటించే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది.




## దుపాహియా వెబ్ సిరీస్ ఎలా ఉంది..?




ప్రతి వారం ప్రేక్షకులకు సరికొత్త సీరీస్ లతో ఓటీటీ సంస్థలు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాయి. వీకెండ్ వస్తే థియేటర్ లో కొత్త సినిమా ఎలా రిలీజ్ అవుతుందో ఓటీటీలో కొత్త సీరీస్ లు కూడా రిలీజ్ అవుతుంటాయి. లేటెస్ట్ గా అమెజాన్ ప్రైం వీడియోలో రూరల్ కామెడీ ఇంకా మెసేజ్ తో వచ్చింది దుపాహియా వెబ్ సీరీస్. సోనం నాయర్ డైరెక్ట్ చేసిన ఈ వెబ్ సీరీస్ 5 ఎపిసోడ్స్ తో వచ్చింది. ఇంతకీ ఈ సీరీస్ కథ ఏంటంటే దడక్ పూర్ లో టీచర్ గా పనిచేస్తున్న బన్వారీ ఝా తన కూతురు రోష్నికి పెళ్లి చేయాలని అనుకుంటాడు. ఐతే అప్పటికే రోష్ని తన చిన్ననాటి స్నేహితుడు అమావాస్ తో రిలేషన్ లో ఉంటుంది. అయినా సరే రోష్ని తండ్రి చూపించిన సంబంధాన్ని చేసుకోవాలని అనుకుంటుంది. ఈ క్రమంలో కట్నం కోసం ఐదు లక్షల విలువ గల మోటర్ బైక్ ని కుబేర్ డిమాండ్ చేస్తాడు. ఆ బైక్ కి మ్యారేజ్ కి సంబంధం ఏంటి మిగతా కథ ఎలా నడిచింది అన్నది వెబ్ సీరీస్ ఉంటుంది. అంతకుందు లాపాట లేడీస్ లో నటించి మెప్పించిన స్పర్ష్ శ్రీవాస్తవ ఈ సినిమాలో కూడా మెప్పించాడు. భువన్ అరోరా కూడా అమావాస్ పాత్రకు పర్ఫెక్ట్ అనిపించుకున్నాడు. గజరాజ్ రావు, శివాని రఘువంశీ, రేణుక వారి వారి పాత్రల్లో ఆకట్టుకున్నారు. కామెడీ ప్రధానంగా సాగుతూ రూరల్ మెసేజ్ ని కూడా అందించేలా వచ్చిన ఈ దుహాపియా వెబ్ సీరీస్ కొంతమేరకు ప్రేక్షకులను అలరించిందనే చెప్పొచ్చు. ఐతే ఇంకాస్త గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే ఉంటే సీరీస్ ఇంకాస్త బాగుండేది. ముఖ్యంగా అక్కడక్కడ స్లో అయినట్టుగా అనిపిస్తుంది. పాత్రలు వాటి స్వభావాల ద్వారానే కథనం నడిపించేశాడు. సీరీస్ తో దర్శకుడు చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పగలిగాడు. సీరీస్ చూసిన ఆడియన్స్ కామెడీ ఎంటర్టైన్ గా భావిస్తారు. ఐతే కథ మొత్తం అక్కడక్కడే తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. టైం పాస్ కి ఒకసారి చూసేలా దుపాహియా సీరీస్ ఉంది.

## కళ్యాణ్ రామ్ డెసిషన్.. ఎఫెక్ట్ పడుతుందా..?



నందమూరి కళ్యాణ్ రామ్ లేటెస్ట్ సినిమా టైటిల్ పోస్టర్ ఉమెన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అర్జున్ సన్నాఫ్ వైజయంతి గా కళ్యాణ్ రామ్ రాబోతున్నాడు. ఈ సినిమాలో ఒకప్పటి లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పవర్ ఫుల్ రోల్ లో నటిస్తున్నారు. సినిమాలో కళ్యాణ్ రామ్ మదర్ గా పోలీస్ పాత్రలో ఆమె నటిస్తున్నారు. మహేష్ తో సరిలేరు నీకెవ్వరు సినిమా తర్వాత విజయశాంతి చేస్తున్న సినిమా ఇదే అవ్వడం విశేషం. ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్ తోనే ఇదొక యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతుందని తెలుస్తుంది. ఐతే ఈ సినిమా టైటిల్ ని అర్జున్ సన్నాఫ్ వైజయంతి అని పెట్టమని కళ్యాణ్ రామ్ సజెస్ట్ చేశాడట. అసలైతే ముందు వేరే టైటిల్ అనుకోగా వైజయంతి యాడ్ చేయమని ఆయన చెప్పారట. ఈమధ్య సినిమా టైటిల్స్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేసేలా ఉంటేనే చూస్తున్నారు. ఈ క్రమంలో కళ్యాణ్ రామ్ దర్శక నిర్మాతలు ఈ సినిమాకు ముందు వేరే టైటిల్ అనుకోగా ఫైనల్ గా అర్జున్ సన్నాఫ్ వైజయంతి అని లాక్ చేశారు. ఐతే కథ మీద ఉన్న నమ్మకంతోనే కళ్యాణ్ రామ్ ఇలాంటి డెసిషన్ తీసుకున్నారని తెలుస్తుంది. ఐతే ఈ నిర్ణయం సినిమాకు ఏమేరకు హెల్ప్ అవుతుంది అన్నది సినిమా వస్తేనే తెలుస్తుంది. కళ్యాణ్ రామ్ అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాను ఎన్టీఆర్ ఆర్ట్స్, అశోక క్రియేషన్స్ బ్యానర్ లో వర్ధన్ ముప్ప, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కళ్యాణ్ రామ్ సరసన మేజర్ సినిమా హీరోయిన్ సయి మంజ్రేకర్ నటిస్తుంది. అంతేకాదు సినిమాలో శ్రీకాంత్ కూడా ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నట్టు తెలుస్తుంది. బింబిసార సినిమాతో సక్సెస్ అందుకున్న కళ్యాణ్ రామ్ లాస్ట్ ఇయర్ డెవిల్ అంటూ వచ్చి నిరాశపరిచాడు. మరి ఈ అర్జున్ సన్నాఫ్ వైజయంతి మూవీతో అయినా హిట్ ట్రాక్ ఎక్కుతాడేమో చూడాలి. నందమూరి హీరోగా కళ్యాణ్ రామ్ తన పంథాలో సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు. ఐతే కళ్యాణ్ రామ్ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే మాత్రం అది సూపర్ హిట్ కొట్టినట్టే లెక్క. సినిమాలను ఎంతో ప్రయోగాత్మకంగా చేయాలన్న కళ్యాణ్ రామ్ ఎఫర్ట్స్ కి తగిన ప్రఫితలం అయితే రావట్లేదని చెప్పొచ్చు.

## ఫేమస్ అవ్వడం కోసమే ఇద్దరి మధ్యా చిచ్చు పెట్టిందా?

ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన చిన్న సినిమాలు సంచలనమైతే అందులో నటీనటులు ఓవవర్ నైట్ లో ఫేమస్ అయిపోతారు. అలాంటి చిన్న సినిమాల్లో ఇటీవల రిలీజ్ అయిన ప్రదీప్ రంగనాద్ నటించి డ్రాగన్ ఒకటి. తెలుగు, తమిళ్ లో ఈ సినిమా మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రదీప్ సంగతి పక్కన బెడితే ఇందులో సెకెండ్ హీరోయిన్ గా నటించిన కయాదు లోహర్ బాగా ఫేమస్ అయింది. అమ్మడు స్కిన్ షోతో కుర్రాళ్లలో కాకలు పుట్టించింది. సొగసరి అందానికి యువత ఫిదా అవుతుంది. సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోనూ నిలిచింది. అప్పుడే తెలుగు సినిమాలు కూడా సైన్ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఓ సినిమాలో ఎంపికైందని సమాచారం. అయితే ఈ భామ కోలీవుడ్ లో ఇద్దరు స్టార్ హీరోల అభిమానుల మధ్య పెద్ద చిచ్చే రేపింది. ఇటీవల ఓ కాలెజ్ ఈవెంట్లో అభిమానులు



మీకు ఇష్టమైన హీరో ఎవరని అడిగితే తలపతి విజయ్ పేరు చెప్పింది. సర్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. అందులోనూ విజయ్ నటించిన తేరి సినిమా ఎన్నిసార్లు చూసానో? తనకే తెలియదంది. అయితే ఇదే బ్యూటీ గతంలో తన అభిమాన హీరోగా ధనుష్ పేరు చెప్పింది. అతడి హిట్ సినిమాల గురించి తెగ పొగిడేసింది. ఇలా ఇద్దరుహీరోల పేర్లు చెప్పడంతో? ఆ హీరోల అభిమానుల మధ్య చిచ్చు రేగింది. ఇద్దరు హీరోల అభిమానులు కయాదు ను లైక్ చేసిన వారు కావడంతో ఈ కుంపంటి మొదలైంది. కయాదు కు మా హీరో మాత్రమే క్రష్ అంటూ ఇరువురు హీరోల అభిమానులు సోషల్ మీడియాలో యుద్ధానికి తెర తీసారు. అయితే కయాదు ఇలా చెప్పడానికి కారణం ఇద్దరు హీరోల అభిమానుల మధ్య మరింత ఫేమస్ అవ్వం కోసమే ఈ డ్రామాకి తెర తీసిందంటూ మరికొంత మంది అభిమానులు మండి పడుతున్నారు. దీనికి తెర పడాలంటే కయాదు హీరోలిద్దరు సమానమే అంటే తప్ప పంచాయతీ తెగదు.

## ఖుషీ కపూర్.. మరోసారి హీటెక్కించే గ్లామర్ జోష్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ ఖుషీ కపూర్ స్టైలింగ్ లో ఎప్పుడూ ఒక ప్రత్యేకత ఉంటుంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. తెల్లని లేస్ ఔట్‌ఫిట్‌లో ఖుషీ తన అందాన్ని మరింతగా హైలైట్ చేస్తూ గ్లామర్ కవర్ లుక్‌లో మెరిసిపోయింది. సూర్యకాంతి తాకుతూ, ఆకర్షణీయమైన పోజులతో కెమెరా ముందు తన అందాన్ని ఒలకబోస్తూ ఖుషీ స్టన్నింగ్ లుక్స్‌తో అభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తోంది. ఫోటోల్లో ఖుషీ పూర్తిగా బోల్డ్ లుక్‌లో కనిపిస్తోంది. గోధుమ రంగులో మెరిసే సన్‌కిస్డ్ లుక్ ఆమె బ్యూటీని మరింత హైలైట్ చేసింది. ఫోటో షూట్ లో ఆమె తన గ్లామరస్ అప్పీల్‌తో స్టైలిష్ లుక్స్‌ని హైలెట్ చేసింది. ఆమె వేసుకున్న వైట్ లేస్ డ్రెస్ మోడ్రన్ టచ్‌తో, ఫెమినిన్ గ్రేస్‌తో మెస్మరైజ్ చేసింది. దానికి తగ్గట్టుగా మినిమల్ జువెలరీ, ఓపెన్ హెయిర్ స్టైలింగ్ ఖుషీ అందాన్ని రెట్టింపు చేసింది. ఓ ఫోటోలో ఖుషీ లాజ్ బ్రీజీ మూడ్‌లో



సూర్యకాంతిని ఆస్వాదిస్తున్నట్టు కనిపించగా, మరొక ఫోటోలో సీటింగ్ పోజ్‌లో స్టన్నింగ్ లుక్ ఇచ్చింది. మరికొన్ని ఫోటోల్లో తన స్టైల్ స్టేట్మెంట్‌ను చూపిస్తూ స్నేహితులతో ఎంజాయ్ చేస్తూ కనిపించింది. ఈ ఫోటోషూట్ ఖుషీ గ్లామర్ గేమ్ ఎక్కడికీ వెళ్ళిందో చెప్పడానికి నిదర్శనం. ఖుషీ తన అద్భుతమైన ఫోటో షూట్ లుక్స్ ద్వారా మరోసారి తన ట్రెండీ స్టైల్ సెన్స్‌ను ప్రూవ్ చేసుకుంది.

ఖుషీ కపూర్ బాలీవుడ్‌లో తన ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఆమె స్టైలిష్ అప్పీల్, ఫ్యాషన్ చాయిస్‌లు ట్రెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ గ్లామరస్ ఫోటోషూట్ చూస్తే ఖుషీ త్వరలోనే స్టార్‌డమ్‌కు చేరుతుందని చెప్పొచ్చు. ఖుషీ బోల్డ్ స్టెప్పులు, గ్లామరస్ లుక్స్ సోషల్ మీడియాలో గట్టిగానే వైరల్ అవుతున్నాయి. దీంతో అభిమానులు ఆమె డెబ్యూ మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536